# దేశభక్తి - ప్రజాస్వామ్యం



కన్నయ్యకుమార్ | ఉమర్ ఖాలీద్ | షెహ్లా రషీద్
మారి | అనిర్బాన్ భట్టాచార్య

335·4
ప్రసాద్-దేశభ
110195

335·4
ప్రసాద్-దేశభ
110195

నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్

# 'దేశభక్తి' - ప్రజాస్వామ్యం

కన్నయ్యకుమార్, ఉమర్ ఖాలీద్, షెహ్లా రషీద్, చింటూ కుమారి, అనిర్బాన్ భట్టాచార్య

# 'దేశభక్తి' - ప్రజాస్వామ్యం

కన్నయ్యకుమార్, ఉమర్ ఖాలీద్,
షెహ్లా రషీద్, చింటూ కుమారి, అనిర్బాన్ భట్టాచార్య

తెలుగు

ఎం. శ్వేత, జి.వి.కె. ప్రసాద్

**నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

116789

335.4
ప్రసాద్ - దేశభ

ప్రచురణ సంఖ్య : 1393

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2016

వెల : ₹ 30/-

ప్రతులకు : నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్
ఎమ్.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్
ఆర్టీసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ -20
ఫోన్ : 040 - 27660013

బ్రాంచీలు : నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ బ్రాంచీలు
హైదరాబాద్ - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్., నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్

ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచీలు
విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు

ముద్రణ : నవతెలంగాణ ప్రింటర్స్ ప్రై. లిమిటెడ్, హైదరాబాద్

C114773

ACC No. 110195

# విషయసూచిక


ముందుమాట ........................................................ 7

1. వివక్షకు సమాధికట్టే సంఘర్షణ మాది ............................ 9

2. మనువాదాన్ని, మతవాదాన్ని సమాధిచేసి
సమానత్వ సమాజాన్ని స్థాపిస్తాం... ................................ 17

3. నా పేరు ఉమర్ ఖాలిద్... కానీ నేను టెర్రరిస్టును కాను ....... 25

4. నల్ల చట్టాలు మీరు తెస్తే... భగత్‌సింగ్‌లం మేమవుతాం... ... 30

5. మావి విద్వేష రాజకీయాలు కావు
దేశాన్ని బాగు చేసే రాజకీయాలు!... ............................ 37

6. దేశాన్ని దోచుకునేవాళ్ళ నుంచి కావాలి ఆజాదీ.................. 43

7. దేశాన్ని నాశనం చేస్తున్నది ఆర్ఎస్ఎస్, బీజేపీలే! ............... 53

8. హక్కులడగడమే దేశద్రోహమా? .................................. 62

9. మనువులూ, హిట్లర్‌లూ, గోబెల్స్‌లూ!
కాస్త నోళ్లు మూసుకుంటారా? ....................................... 67

10. ఇది విద్యార్థుల వసంతం! ........................................... 73

# ముందుమాట

కన్నయ్య కుమార్ ఓ పరిణతి చెందిన విద్యార్థి నేత. సమాజంలో కొనసాగుతున్న వివక్షతలు, అణచివేతలు, దోపిడీల గురించి అవగాహన ఉన్న వ్యక్తి. మతోన్మాద, సామ్రాజ్యవాద ప్రమాదాల గురించి స్పష్టంగా తెలిసిన వ్యక్తి. ఆయన పుట్టి పెరిగిన వాతావరణంతో పాటు, బహుళ అభిప్రాయాలకు తావుకల్పిస్తూ, పురోగామి భావజాలానికి నెలవుగా ఉన్న న్యూఢిల్లీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం కన్నయ్య కుమార్ మేధోపరిణామానికి తోడ్పడింది. ఇదే భావజాలంతో ఉన్న ఇతర విద్యార్థి సహచరులతో పాటు కన్నయ్య కుమార్ కార్యకలాపాలు మతోన్మాదులకు, ఇతర ప్రతీప శక్తులకు కంటగింపుగా ఉండటం ఎంత మాత్రం ఆశ్చర్యం కల్గించదు. అందుచేతనే ఉరిశిక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన వారిని, ఉగ్రవాదులకు మద్దతు ఇస్తూ దేశద్రోహులుగా మారారని తప్పుడు ఆరోపణలతో కేసులపెట్టి, దొంగ సాక్ష్యాలతో శిక్షలు పడేందుకు నానా తంటాలు పడుతున్నారు. ప్రజాస్వామిక సంప్రదాయాలన్నింటిని తుంగలో తొక్కి కన్నయ్య కుమార్‌పై కోర్టు అవరణలోనే మతోన్మాదులు భౌతిక దాడులకు పాల్పడ్డారు. కాని ఈ నిర్బంధాలను, దాడులను తట్టుకొని కన్నయ్య కుమార్, ఆయన సహచర విద్యార్థి నేతలు బెయిల్‌పై బయటకొచ్చారు.

అనంతరం యావత్ దేశం దృష్టి వారందరిపై పడింది. తాము ఇచ్చిన ఉపన్యాసాలు, ఇంటర్వ్యూలు, పాల్గన్న మీడియా చర్చా గోష్ఠులలో తమ అభిప్రాయాలను వారు ఎంతో ప్రతిభావంతంగా, ప్రభావశీలంగా వ్యక్తం చేశారు. దీనితో మరింత రెచ్చిపోయిన మతోన్మాద మూకలు కన్నయ్య కుమార్‌పై మరిన్ని దాడులకు పాల్పడుతున్నారు. హైదరాబాదు, సెంట్రల్ యూనివర్శిటీలో సామాజిక వివక్షతకు నిరసనగా దీక్ష కొనసాగించి, చివరకు ఆత్మహత్యకు పాల్పడిన రోహిత్ కుమార్ తల్లిని పరామర్శించడానికి ఇటీవల కన్నయ్య కుమార్ వచ్చిన సమయంలోను ఇదే రకమైన దాడులకు ప్రయత్నాలు జరిగాయి.

దేశంలోనే కాకుండా, అంతర్జాతీయంగా సైతం ప్రజాస్వామికవాదుల, ప్రగతిశీలుర మద్దతును పొందుతూ, మతోన్మాదుల, ఇతర అభివృద్ధి నిరోధకుల ఆగ్రహానికి ఇంతగా కారణమవుతున్న ఈ విద్యార్థి నేతల ప్రసంగాలు, చర్చాగోష్ఠులు, ఇంటర్వ్యూల సంకలనం ఇది. హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీలో రోహిత్ కుమార్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను వివరించే ఓ చిన్న సంకలనాన్ని నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఇటీవలనే ప్రచురించింది. ఇదే క్రమంలో మరికొన్ని ప్రచురణలు కూడా ప్రతిపాదనలో ఉన్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం కాపాడబడాలని, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కొనసాగాలని కోరుకునే ప్రతి ఒక్కరు ఈ ప్రచురణలను ఆదరించి సద్వినియోగం చేస్తారని ఆశిస్తున్నాము.

**నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్,**

**1, ఏప్రిల్ 2016**

# 1

# వివక్షకు సమాధికట్టే సంఘర్షణ మాది

దేశద్రోహం ఆరోపణలతో అరెస్టయి బెయిల్‌పై విడుదలైన కన్నయ్య హెచ్‌సీయూకు వస్తున్నట్టు ప్రకటించడంతో కాషాయమూకల్లో గుబులు పుట్టింది. ఆయన రాకను అడ్డుకునేందుకు చేయని ప్రయత్నం లేదు. హెచ్‌సీయూను ఖాకీ ముష్కరులతో ముంచెత్తారు. విద్యార్థులపై విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో కన్నయ్యకుమార్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సులో పాల్గన్నారు. ఆ ప్రసంగ పాఠం ఇది....

సహచరులారా!

అన్నిటికన్నాముందు నేను మిమ్మల్ని క్షమాపణ అడుగుతున్నాను. నాకు తెలుగు రాదు. కేవలం హిందీ మాత్రమే దేశభాష కాదు. తమిళ్, తెలుగు, కన్నడ, మళయాళం ఇంకా మనకు తెలియనివి ఎన్నో ఉన్నాయి. అవన్నీ మన దేశ భాషలు. నేను భారత్ గురించి మాట్లాడుతున్నానంటే... కేవలం బీహార్ గురించి, హిందీ గురించే మాట్లాడుతున్నానని దాని అర్థం కాదు. నన్ను క్షమించండి. నాకు తెలుగు రాదు. కానీ, తెలుగులోని ఒక పదం తెలుసు. అది 'గారు'.

ఈ దేశం బాబా సాహేబ్ డాక్టర్ భీంరావు అంబేద్కర్‌ది. అంబేద్కర్‌కు దేశంలో అగ్రకులాలవారు ఉండటానికి ఇల్లు అద్దెకు ఇవ్వకపోతే... వారికి అబద్ధం చెప్పి ఇల్లు అద్దెకు తీసుకునేవాడు. ఆయన దళితుడని తెలిసినప్పుడు అతని సామాన్లు బయటకు విసిరేసేవారు. కానీ, అంబేద్కర్ ఎప్పుడూ వాళ్ళ మీద కోపగించుకోలేదు. మీరు బాబా

సాహెబ్‌ను నిజంగా నమ్మితే, మీరు కూడా అరవకూడదు. కొట్లాటలు చేయకూడదు. సహనం కోల్పోకూడదు. నేను మోడీజీకి, వారి పోలీసులకు ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. ఎందుకంటే వారు నాకు ప్రచారం కల్పించారు. కొంతమంది నన్ను కొట్టి ప్రచారం పొందాలనుకుంటున్నారు. వారిని ప్రచారం చేసుకోనివ్వండి. ఈ దేశం గాంధేయవాద దేశం. మీరు ఏం చేసినా... గాడ్సే మందిరం కట్టనివ్వం. ఈ దేశం భగత్‌సింగ్‌ది. సిద్ధాంతాలతో విప్లవం వస్తుందని భగత్ సింగ్ చెప్పారు. చెప్పులూ, రాళ్ళూ విసిరితే రాదు. అందుకే నాకు ఆ వ్యక్తి చర్యతో బాధ కలగడంలేదు. నా మీద చెప్పులు విసిరినా... నా మీద రాళ్ళు విసిరినా... జేఎన్‌యూలో ఒక వ్యక్తి ఇంతకన్నా ఎక్కువ రద్దీలో నన్ను చెంపదెబ్బ కొట్టాడు. జేఎన్‌యూ విద్యార్థులు అతన్ని కూర్చోపెట్టి నీళ్ళు తాగించారు. టీ ఇచ్చారు. తర్వాత ఇదంతా ఎవరి ఆదేశాలతో చేస్తున్నావని అడిగారు. నేనే చేశానన్నాడు. అలా అయితే నిన్ను వదిలేస్తాము. ఎందుకంటే... నువ్వు నీ మీద రాయిని విసురుకుంటున్నావని, నీ మీదే చెప్పులు విసురుకుంటున్నావని కొన్ని రోజుల తర్వాత నీకే అర్థమవుతుంది. ఈ దేశ భవిష్యత్తు ఏమిటో నీకు తెలియదు. ఎప్పుడైనా ఒక వ్యక్తి మీ వద్దకు వచ్చి ఇలాంటి వాతావరణం సృష్టిస్తే... అతన్ని ఏమీ అనకండి. ఇక్కడ కెమేరాలు పట్టుకుని నుంచున్నవారు అతని ఫొటోలు తీస్తారు. అప్పుడు అతడి ఆత్మ శాంతిస్తుంది. ఇక అతని భక్తి అక్కడే సమాప్తమవుతుంది. అందుకే మీరు సహనాన్ని కోల్పోవద్దు. మీడియా వారు మన పక్షాన ఉన్నారు. వారు ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం. వారు మన ప్రతిస్పందన చూడాలనుకుంటున్నారు. ఎవరు భయపెట్టినా నేను భయపడను. లంగదీసుకోవాలనుకుంటే లంగిపోను. నన్ను యూనివర్సిటీలోకి వెళ్ళకుండా అడ్డుకుంటే రోహిత్ గురించి ప్రశ్నించనని అనుకుంటున్నారు. దారిలో వెళుతుండగా రాళ్ళు విసిరితే... హైదరాబాద్‌కు రావడం మానేస్తానని అనుకుంటున్నారు. సెమినార్‌లో చెప్పులు విసిరితే మాట్లాడ్డం మానేస్తానని అనుకుంటున్నారు. మీరు ఏం చేసినా మేం భయపడం. భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం మేము పోరాడుతున్నాం. మీరు ఏం చేసినా మేం మాట్లాడతాం.

ఇంతకుముందు కూడా నేను హైదరాబాద్‌కు వచ్చాను, రోహిత్ ప్రశ్నలతో హెచ్‌సీయూకు వెళ్ళాను. జాయింట్ యాక్షన్ కమిటీ కూడా నాతో ఉంది. అప్పుడు హెచ్‌సీయూ విద్యార్థులు నిరాహారదీక్షలో ఉన్నారు. మూడు రోజులు వారితో గడిపిన తర్వాత నిర్ణయించుకున్నాను. రోహిత్ ఆందోళన కేవలం ఒక యూనివర్సిటీ పోరాటం కాదు. ఈ పోరాటం దేశంలో వెయ్యి సంవత్సరాల నుండి జరుగుతున్న వివక్షకు సమాధికట్టే పోరాటం. దేశంలోని ఎక్కువ – తక్కువ అనే భావనలను అంతమొందించాల్సిన సంఘర్షణ.

మన గుర్తింపును ఆధారంగా చేసుకొని ఒకరినొకరు కొట్టుకునేలా చేసే కుట్రకు వ్యతిరేకం ఈ సంఘర్షణ. ఈ రోజు ఎవ్వరైనా... మార్క్సిస్టు అయినా... అంబేద్కరిస్టు అయినా... సోషలిస్టయినా... లేదా తమను తాము మధ్యేవాది అనేవారైనా... దాడులకు గురవుతున్నారు. దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోంది. ఇక్కడ కొంతమంది పెద్దవారున్నారు. ఈ రోజు నుండి ఇరవై ఏండ్లకు ముందు... నీళ్ళు అమ్ముతామని ఎవరైనా అంటే... నీళ్ళ దందా చేస్తామని అంటే... ఆ వ్యక్తికి పిచ్చిపట్టిందా అని అనుకుంటారు. నీరు ఏమైనా అమ్మబడే వస్తువా అనుకుంటారు. కానీ, అంతకుముందు నీటి మీద కూడా అందరికీ హక్కు ఉండేది కాదు. దళితులను బావిలోంచి నీరు తీసుకోనిచ్చేవారు కాదు. నదులలో వారికి ప్రత్యేక ఘాట్ ఉండేది. ఈ రోజు కొత్తరకం ఘాట్లు తయారవుతున్నాయి. కొత్తరకం బావులు తయారవుతున్నారు. అవి ఏమిటంటే... ఈ బాటిళ్ళలో అమ్మే నీళ్లు. ఈ దేశంలో మేము పేదల గురించి మాట్లాడతాం... వారు ఎవరు? వారు దళితులు... ఆదివాసీలు... వెనుకబడినవారు... ముస్లింలు... మైనార్టీలు... అల్పసంఖ్యాకవర్గాల వారు. మీరు మార్క్సిస్టు అయినా, శ్రామికవార్గల ఆజాదీ కావాలనుకుంటున్నా... మీరు అంబేద్కరిస్టు అయినా... మైనార్టీల హక్కుల కోసం పోరాడేవారైనా... ఈ రోజు మనం ఏకం కావాల్సిన అవసరం ఉంది. మనం ఏకమైతే... మనం గెలుస్తాం. ఇది మన రాజ్యాంగం కల. అందరికీ న్యాయం జరగాలన్నా... అందరికీ సమానత్వం కావాలన్నా... సమన్యాయ సమాజాన్ని దేశంలో నెలకొల్పాలన్నా... మన రాజ్యాంగ కలను, బాబా సాహెబ్ కలలను నిజం చేయొచ్చు. భగత్ సింగ్ కన్న కలల దేశాన్ని నిర్మించవచ్చు.

'జై భీం' 'లాల్‌సలాం' అని నేనన్నప్పుడు దాని వెనుక ప్రాథమిక అర్థం ఉంది. అదేంటంటే... శ్రామికవర్గ సంఘర్షణ అయినా, దళితుల సంఘర్షణ అయినా, ఆదివాసీల సంఘర్షణ అయినా, వెనుకబడిన వర్గాల వారి సంఘర్షణ అయినా, అల్ప సంఖ్యాకుల వర్గాల వారి సంఘర్షణ అయినా, మహిళల సంఘర్షణ అయినా... అన్నిటినీ ఏకం చేయాల్సిన అవసరం ఉంది. బీజేపీ మైనార్టీలకు వ్యతిరేకమని కొంతమంది అంటారు. కాదని నేనంటాను. అసలైతే బీజేపీ మెజార్టీలకు వ్యతిరేకం. ఎందుకంటే, వందకి 90 శాతం దేశ సంపదను వారి కబ్జాలో ఉంచుకున్నవారు మైనార్టీలు. వారు కేవలం 0.5 శాతం మంది మాత్రమే. బడ్జెట్‌లో వారి కోసం 60 శాతం ఖర్చుపెడుతున్నారు. అటువంటి వారి వైపు బీజేపీ నిలబడింది.

పదేపదే మోడీకి వ్యతిరేకంగా మీరు ఎందుకు మాట్లాడుతున్నారని ఒకవ్యక్తి నాతో అన్నాడు. ఒకవేళ మీరు ప్రధానమంత్రి అయివుంటే... విద్యార్థులకు వ్యతిరేక విధానాలు

అమలుచేస్తే... మీరు ఈ దేశంలో బలహీన ప్రజలకు వ్యతిరేకంగా విధానాలు తెస్తే, మేము మీకు వ్యతిరేకంగా మాట్లాడతాం అని నేనతనికి చెప్పాను. నాకు వ్యక్తితో సంబంధంలేదు. అందుకే ఇక్కడ కూర్చొని మోడీ గారిపై ఒక కవిత రాశాను.

ఆప్ మేరీ గలీ మే ఆయేహీ క్యోం (మీరు మా గల్లీలోకి అసలెందుకు వచ్చారు)

నా ఉమ్మీదీమే ఉమ్మీదీ జగాయేహీ క్యోం (నిరాశలో ఆశను ఎందుకు రేకెత్తించారు)

కుష్‌తో అపనీ ముఫ్‌లిసి మే... (పేదరికంలోనూ మేము ఆనందంగా ఉండేవాళ్లం)

అచ్చేదిన్ కా సప్నా దిఖాయేహీ క్యోం (మంచి రోజుల కలలను ఎందుకు చూపించారు)

మా 15 లక్షలు ఏవీ అని మేము అడిగితే... అందులో నా తప్పేంటి? ధరలు తగ్గలేదని మేము అడిగితే... సెన్సెక్స్ ఎగిసిపడడంతో ధరలు పెరిగిపోతున్నాయని అంటే... అందులో నా తప్పేంటి? భారత్ ఒక యువ రాజ్యమని మీరే చెప్పారు. 10 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 16 కోట్ల మంది ఉద్యోగాల కోసం ప్రభుత్వ రికార్డుల్లో తమ పేర్లను నమోదుచేసుకున్నారు. వారికి ఉద్యోగాలు ఎప్పుడొస్తాయి? మంచిరోజులు ఎప్పుడొస్తాయి? మేము మోడీకి వ్యతిరేకం కాదు. మేము దేశంలోని విద్యార్థులందరినీ ఏకం చేస్తున్నామని అంటున్నారు. అసలు విడదీస్తున్నదెవరు? ఏకం చేయాల్సిన అవసరం అసలెందుకు వస్తున్నదని నేనడిగాను. అప్పుడు ఆ వ్యక్తి దగ్గర జవాబు లేదు. ఎందుకంటే... అతను విడదీస్తున్నవారితో నిలబడ్డాడు. మేము హైదరాబాద్ ప్రజలకు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు జేఎన్‌యూఎస్‌యూ తరఫున ధన్యవాదాలు చెబుతున్నాను. మీరు జేఎన్‌యూ పక్షాన నిలబడ్డారు. స్నేహితుడు రోహిత్ పక్షాన మాట్లాడుతున్నారు. ప్రజాస్వామ్యం వైపు మాట్లాడుతున్నారు. నిజాన్ని నిజమని చెప్పే పక్షాన, అబద్ధాన్ని అబద్ధమని చెప్పే పక్షాన మాట్లాడుతున్నారు. అందుకే మాట్లాడటం అవసరం. మనం మట్లాడకపోతే... మనం అర్థం చేసుకోలేం. మనం అర్థం చేసుకోలేకపోతే... ఏకం కాలేము. ఒకటికాలేకపోతే... పోరాడలేం. పోరాడలేకపోతే... గెలవలేం. అందుకే మనం పోరాడాల్సిన అవసరం ఉంది. ఇంకొకవిషయం... మేము జేఎన్‌యూలో జై భీం, లాల్ సలాంతోపాటు ఇంకో నినాదం ఇస్తాం. అదేంటంటే... 'జాతివాద్‌కా ఏక్ జవాబ్... జై భీం, జై ఇంక్విలాబ్' (కులతత్వానికి సమాధానం... జై భీం... జై ఇంక్విలాబ్). దేశంలో కులతత్వాన్ని నిర్మూలించే విప్లవాన్ని తీసుకురాగలం. ఈ దేశంలో మహిళల హక్కుల గురించి మాట్లాడే విప్లవాన్ని తీసుకురాగలం. ఈ దేశంలో రైతుల, కార్మికుల హక్కుల గురించి మాట్లాడే విప్లవాన్ని

తీసుకురాగలం. 99 శాతంగా ఉన్న బలహీన పౌరుల పక్షాన మాట్లాడే విప్లవాన్ని మనం తీసుకురాగలం. అందుకే స్నేహితులారా...! నేను విజ్ఞప్తి చేస్తున్నాను. వాళ్ళు ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. కానీ వాళ్ళ వలలో పడొద్దు. వారు రోహిత్ ప్రశ్నల నుంచి దారి మళ్ళించడానికి కన్నయ్య విషయం ముందుకు తెచ్చారు. ఇతనికి అకస్మాత్తుగా ప్రచారం చేస్తే... రోహిత్ ప్రశ్నలను మర్చిపోతారని అనుకున్నారు. కానీ, వారికి తెలియదు. జైలుకు వెళ్ళకముందు నుంచే జేఎన్‌యూలో రోహిత్‌కు న్యాయం జరగాలని ఉద్యమం జరుగుతోంది. జైలు నుంచి బయటకువచ్చిన తర్వాత కూడా రోహిత్‌కు న్యాయం జరగాలని ఉద్యమం జరుగుతోంది. రోహిత్ చట్టం అమలులోకి రావాలి. యూనివర్సిటీలలో వివక్షను నిర్మూలించడానికి రోహిత్ చట్టం అమలులోకి రావాలి. మేము రోహిత్ చట్టం కోసం కట్టుబడి ఉన్నాం. పోరాడుతున్నాం. సాధిస్తాం. రెండు విగ్రహాలను తయారుచేసి... మీరు మమ్మల్ని కొట్టుకునేలా చేయలేరు. టీ షర్టుపై నా చిత్రాన్ని వేయవద్దని ఇక్కడి స్నేహితులకు చెప్పాను. రోహిత్ ఫొటోను వేయండి. అందులోనే కన్నయ్య ఫొటో ప్రజలకు కనిపిస్తుంది. ఎందుకంటే... జేఎన్‌యూలో దాడి జరిగిందంటే... దానికి ఒకటే కారణం. అదేంటంటే మన ప్రభుత్వం 'అందరికీ అభివృద్ధి' అంటూ గాలి బుగ్గ ఊదుతోంది. అకస్మాత్తుగా... ఆర్థిక వ్యవస్థయొక్క బలహీనతల వైరుధ్యం ఆ బుగ్గలోని గాలిని తీసేసింది. ఇప్పుడు వారు మళ్ళీ ఎన్నికల్లో పాల్గనాలి కదా. కాబట్టి ప్రజల వద్దకు అభివృద్ధి బుగ్గను తీసుకెళ్ళలేకపోయాము కాబట్టి... జాతీయత బుగ్గను తీసుకెళ్ళాలని అనుకున్నారు. వారికి నేనొక విషయం చెప్పాలనుకుంటున్నాను. జాతీయత బుగ్గను ప్రజలు ముందునుంచే పట్టుకొని ఉన్నారు. మీ నకిలీ జాతీయత బుగ్గను వారు పట్టుకోరు. అందుకే ఈ దేశంలో జాతీయతపై చర్చ జరిగిందంటే... ఈ చర్చల్లో ఈ దేశం ఏదో ఒక భాషకు చెందింది కాదు. ఏదో ఒక మతానికి చెందింది కాదు. ఏదో ఒక కులానికి చెందింది కాదు. ఏదో ఒక లింగానికి చెందింది కాదని కచ్చితంగా చెప్పాలి. ఇది విభిన్న జాతుల దేశం. మనం అన్నిరకాల జాతీయతలను గౌరవించాలనేదే జాతీయవాద భావన. మనం జాతీయవాద పక్షంవైపు నిలబడాలి. కులతత్వం, బ్రాహ్మనిజం, హిందూయిజం వైపు కాదు.

స్నేహితులారా! వారి దగ్గర ఒక స్క్రిప్టు ఉంది. వాళ్ళు ఏదో ఏదో రాస్తూ ఉంటారు. వచ్చి చెప్పులు విసిరేస్తే... కొంతమంది కొడతారు... అప్పుడు కన్నయ్య సభలో హంగామా జరిగిందని మీడియా ప్రసారం చేస్తుంది. ఇదంతా స్క్రిప్టెడే. హంగామా చేయడం మా పని కాదు. కన్నయ్య ఎలుకలాంటి వాడని ఆర్ఎస్ఎస్ నాయకుడన్నాడు. అవును... నిజమే... ఎలుకనే... వలను కొరకడానికే వచ్చాను. ఎలుక వినాయకుడి వాహనం. మీరు

వినాయకుడిని అవమానిస్తున్నారా? లేదా కన్నయ్యను గౌరవిస్తున్నారా? నిర్ణయించుకోండి. వారు చిహ్నాన్ని ఉపయోగించి ప్రజలను విభజించాలని చూస్తున్నారు. నేను కూడా ఒక చిహ్నాన్ని గురించి మాట్లాడాలనుకుంటున్నాను. ఆ చిహ్నం ఏంటంటే... మన మువ్వన్నెల జెండా. ఈ జెండా ఏం చెబుతోంది? దానిలో కాషాయరంగు... సాహసానికి ప్రతీక. తెలుపు రంగు...శాంతిని విన్నవిస్తుంది. అందుకే చెప్పులు విసిరిన వ్యక్తిని కొట్టద్దని చెప్పాను. వీటి కింద ఆకుపచ్చ రంగు... ఇది దేశంలోని రైతుల ప్రతీక. ఈ మూడు రంగులపైన ఒక నీలం రంగు చక్రం ఉంది. అది బాబా సాహెబ్‌కు చిహ్నం. సామాజిక న్యాయానికి చిహ్నం. ఈ దేశంలో కులతత్వానికి వ్యతిరేకంగా, బ్రాహ్మణిజం, హిందూయిజానికి వ్యతిరేకంగా... బుద్ధిజానికి చిహ్నం. శాంతి, అహింసల చిహ్నం. ఆ జెండాలోని మూడు రంగులను వేరుచేసి... పూర్తిగా కాషాయమే ఉండాలని వారంటారు. శాంతి ప్రతీకను తీసేసి... అక్కడ ఓం రాయాలని వారంటారు. ఓంతో నాకు ఎటువంటి ఇబ్బందీ లేదు. నాకు 'జై శ్రీరాం'తో, 'భారత్‌మాతా'తో ఎటువంటి ఇబ్బందీ లేదు. వేరే మతానికి చెందినవారితో కూడా ఇబ్బందిలేదు. ఎందుకంటే... మతాన్ని నమ్మకపోవడం కూడా ప్రజాస్వామ్య హక్కే. కావాలంటే... నమ్మండి... లేదా నమ్మకండి. కానీ, తేడా ఏంటి? ఈ జెండాను పూర్తిగా జాతీయవాదం చేసి, ఓం పెట్టడానికి తేడా ఏంటి? 'జై శ్రీరాం' 'రాం రాం'కు ఉన్న తేడానే. 'జై శ్రీరాం' ఒక రాజకీయ నినాదం. 'రాం రాం' ఒక మత నిర్ధారణకు ప్రతీక, ఈ సంస్కృతి పక్షాన ఉన్న భావనకు ప్రతీక. ఇది మీరు అర్థం చేసుకోవాలి. బేజూబావ్రా సినిమాలోని 'మన్‌తర్పక్ హరిదర్శన్' అనే ఒక పాట ఉంది. దానిని ఒక ముస్లిం రాశాడు. సంగీతం అందించింది ఒక ముస్లిం. పాడింది ముస్లిం. అది హిందువుల గుళ్ళలో భజనలా పాడతారు. ఇదీ భారతదేశం. ఇదే భారతదేశ కోరిక, ఆకాంక్ష. వాళ్ళు దీనిని మార్చాలనుకుంటున్నారు. 'భారతమాత' పేరుతో మార్చాలనుకుంటున్నారు. ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. భారత్‌మాత ఉంది. ఉంటుంది కూడా. భారతమాత రంగు కేవలం తెలుపే కాదు. భారతమాత రంగు నలుపు కూడా, చామనఛాయ కూడా. ఆమె దగ్గర ఎప్పుడూ మెరుస్తున్న బట్టలు ఉండవు. చిరిగిపోయిన మువ్వెన్నల చీర కూడా ఉంటుంది. అంతేకాదు, చీరనే కాకుండా, చుడిదార్ కూడా ఉంటుంది. ఆదివాసీయుల బట్టలు కూడా భారత్‌మాత వేసుకుంటుంది. నువ్వు భారత్‌మాతను నీ రంగులో ముంచలేవు. భారతదేశ రంగే భారతమాతది. 125 కోట్లాది మంది ప్రజల రంగు భారత మాతది. ఈ రంగులను నువ్వు ఒకరికొకరికి వ్యతిరేకంగా ఉపయోగించలేవు. అందుకే ఎరుపుకు వ్యతిరేకంగా నీలాన్ని ఉపయోగించొద్దు. ఎరుపు, నీలం కలసి కులతత్వం, మనువాదానికి వ్యతిరేకంగా పోరాడాలి. కేవలం ఎరుపు, నీలం రంగులు మాత్రమే లేవు. ఏడురంగులు ఉంటాయని అంటారు. ఈ దేశంలో నిజంగా ఏదైనా విప్లవం ఉందంటే... ఎక్కువ –

తక్కువకు వ్యతిరేకంగా ఉంటుంది. ఆ విప్లవ రంగులతో మాకు ఎలాంటి ఘర్షణ లేదు. మేము ఏడురంగుల విప్లవాన్ని తేవడానికి సిద్ధంగా ఉన్నాం. ఆకుపచ్చదనాన్ని కూడా ప్రేమిస్తాం. తెలుపును కూడా మాదే. కాషాయం కూడా మాదే. చక్రం కూడా మాదే. భారత్ మాతా మాది. భారతదేశ తల్లి... భారతదేశ ప్రజలు కూడా మావాళ్ళే. మేము ఏదో ఒక రూపంతో వారిని వేరు చేయాలనుకోం. వీళ్ళు ఎందుకు వేరుచేస్తున్నారు? దాని వెనుక ఒక కుతంత్రం ఉంది. ఏంటది? దాద్రీలో ఒక ముస్లింను హత్యచేస్తే... అతను ఎందుకు హత్యచేయబడ్డాడని ప్రజలు అడగరు. రోహిత్‌ను హత్య చేయండి... రోహిత్ ఎందుకు చనిపోయాడని ప్రజలు అడగరు. అతని కులమేంటని అడుగుతారు. ఈ రాజనీతిపై సిగ్గుపడుతున్నాం. ఇటువంటి కథనాలవల్ల బాధకలుగుతుంది. చనిపోయిన వ్యక్తి కులం, మతం గురించి ప్రశ్నించడానికి ముందు చనిపోయిన కారణాన్ని గురించి అడగాలి. దీనికి కారకులెవరో గుర్తించాలి. ఇవాళ విద్యార్థులకు వ్యతిరేకంగా సైనికులను నిలబెట్టే కొత్త కుతంత్రాలకు పాల్పడుతున్నారు. మీరు సైనికులను విద్యార్థులకు వ్యతిరేకంగా నిలబెట్టలేరు. ఎందుకంటే... సరిహద్దుల్లో చనిపోయే సైనికులు అమరవీరులు. దళిత పోరాటాల్లో, యూనివర్సిటీ పోరాటాల్లో చనిపోతున్నవారు... రోహిత్ వేముల లాంటి వారు కూడా అమరవీరులే. మాలో మేము కొట్టుకునేలా మీరు చేయలేరు. ఈ సమాజంలో అసమానత్వాన్ని అంతం చేసి, సమానత్వం స్థాపిచండానికి మేము పోరాడతాం. మా పోరాటాన్ని బలహీనం చేయలేరు. మమ్మల్ని విడదీయలేరు. ఇదే మా కమిట్‌మెంట్. ఇదే మా హేతుబద్ధత. చివరగా... ఇది గంభీరమైన పరిస్థితి. దేశ ఆర్థిక సంక్షోభం దేశంలో అంతర్గతంగా ఏర్పడింది. ఇది కేవలం దేశ సంక్షోభం మాత్రమే కాదు. ఇది ప్రపంచ సంక్షోభం. అందుకే ట్రంప్ ముస్లింలు అమెరికా వదలి వెళ్ళాలని సూటిగా చెప్పాడు. ఇప్పుడు అతడు అమెరికా అధ్యక్షుడు కావచ్చు. దీని గురించి మనం తీవ్రంగా ఆలోచించాలి. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో డబ్బులతో ఉత్పత్తి చేయరు. ఫ్యాక్టరీలు కట్టరు. రైతులకు అప్పులు ఇవ్వరు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వరు. చట్టా బజార్లో కూర్చొని జూదం ఆడతారు. ఈ క్రోనీ క్యాపిటలిజం వల్లనే సంక్షోభాలు వచ్చాయి. ఈ సంక్షోభాలవల్ల మొత్తం లోకంలో ఫాసిస్టు ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. భారత దేశంలో ఈ సంక్షోభం రెట్టింపవుతోంది. ఎందుకంటే భారతదేశం విభిన్న సంస్కృతుల సమ్మేళనం. ఇక్కడ ప్రజలలో గొడవలు పెట్టడం వారికి తేలిక. నేను అందుకే మళ్ళీ మళ్ళీ కనీస ఐక్యత గురించి మాట్లాడుతున్నాను. ఒకవేళ మనం క్రోనీ క్యాపిటలిజం దోపిడీ నుంచి ఈ దేశాన్ని కాపాడాలంటే... మన కనీస ఐక్యతను సాధించాలి. ఉత్పత్తి పెట్టుబడి పక్షంవైపు నిలబడాలి. ఉత్పత్తి పెట్టుబడితో ఉత్పత్తి చేస్తే ఉద్యోగాలు వస్తాయి. చదువు నేర్పించవచ్చు. విద్యార్థి అయివుండి రాజకీయాలు ఎందుకు మాట్లాడతావని కొందరు అంటారు. మొదటి విషయం ఏమిటంటే... మీరు రాజకీయాల నీడలోనే

ఆ స్థాయిదాకా వెళ్ళారు. రెండో విషయం ఏమిటంటే ఈ దేశంలో సంక్షోభం వచ్చిందంటే... ఆ సంక్షోభాన్ని అంతం చేయడానికి మాతో ఎవరు వస్తున్నారని అడగం. జెండా పట్టుకుని ముందుకు సాగిపోతాం. ఈ దేశాన్ని రక్షించడం కోసం పోరాడతాం. ఒకవేళ మీరు మా ఇంటిపై దాడిచేస్తే... మా గుర్తింపుపై దాడిచేస్తే... దళితుడిగా పుట్టడం ఒక శాపం అని రోహిత్ అన్నాడు. కానీ దళితుడిగా పుట్టాలి... కానీ, దళితుడిగా చనిపోకూడదు. రోహితులుగా అవ్వాలి.... కానీ, రోహిత్‌లా చనిపోకూడదు. వారి హక్కుల కోసం పోరాడాలి. సామాజిక న్యాయం కోసం పోరాడాలి. సమాజంలో ఇలాంటి సంక్షోభం ఉన్నప్పుడు, మాకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వనప్పుడు, డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగాలు దొరకనప్పుడు వాటికి బాధ్యులెవరో వెతుకుతాం... కోటుకు డబ్బులు ఉన్నప్పుడు... మాకు జీతాలు ఇవ్వడానికి డబ్బులు లేవా అని వారి గల్లా, కోటు పట్టుకొని ప్రశ్నిస్తాం. సబ్సిడీ డబ్బులు విజయమాల్యాకు ఇచ్చి లండన్ పంపించారు. మా డబ్బులు మాకు ఇవ్వకుండా మమ్మల్ని ఉరికంబం ఎక్కిస్తున్నారు. ఇది ఇక సాగనివ్వం. అందుకే స్నేహితులారా! మీ అందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ సమయంలో ఒకరికొకరు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. నేను కూడా చరిత్ర చదివాను. అంబేద్కర్‌కి, గాంధీకి మధ్య చర్చ జరిగింది. కానీ, గాడ్సేతో పోరాడాలంటే... గాంధీ పేరు ప్రస్తావించాలి. లేకపోతే, వారు గాంధీని వదిలేసి, అతని కళ్ళజోడును మనకు ఇస్తారు.  మాకు పూర్తి గాంధీకావాలి. వివేకానందుడ్ని కూడా వారు వదిలేసారు. ఎందుకంటే, వారి ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లయింది. వీరు ఎటువంటి ప్రణాళికలు చేయలేదు. చేసినా కూడా వాటికి వివేకానందుడి పేర్లు పెట్టలేదు. వారి సంఘ్ నాయకుల పేర్లే పెట్టుకున్నారు. ఎందుకంటే వీరికి వివేకానందుడితో కూడా తేడావుంది. 'పేద ప్రజలతో ధర్మం గురించి మాట్లాడటం అతి పెద్ద అధర్మం' అని వివేకానందుడు అన్నాడు. ఇప్పుడు చెప్పండి. మతం పేరుతో ఓట్లు ఎలా అడుగుతారు? వివేకానందుడు వీరికి ఎలా సహాయపడతాడు? అందుకే ఈ దేశంలోని మహా మేధావులు, ప్రజల విముక్తి కోసం పోరాడినవారి మార్గంలో మనం పయనించాలి. ఆ మహామేధావులు... గాంధీ అయినా... డాంగే అయినా... అంబేద్కర్... జ్యోతిబాపూలే... భగత్‌సింగ్ అయినా... ఇంకా మనకు తెలియనివారు ఎందరో ఉన్నారు. వారిని మనం ఆదర్శంగా తీసుకోవాలి. వారి బాటలో నడుస్తూ మన సంస్కృతిని కాపాడాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి.

# 2

# మనువాదాన్ని, మతవాదాన్ని సమాధిచేసి సమానత్వ సమాజాన్ని స్థాపిస్తాం...

కన్నయ్య ఇప్పుడో హాట్ టాపిక్... విద్యార్థి నాయకుడి ప్రసంగం యువతకు ఉత్తేజం. మతోన్మాద శక్తులకు మాత్రం సింహ స్వప్నం. బెయిల్‌పై విడుదలైన తర్వాత మొదటిసారిగా అతడు తెలుగు రాష్ట్రాల్లో అడుగుపెట్టిందే తడవు... అతనిపై దాడులు మొదలయ్యాయి. హైదరాబాద్‌లో జరిగేందే... విజయవాడలోనూ జరిగింది. హిందూత్వ శక్తులు అతని ప్రసంగాన్ని జీర్ణించుకోలేక అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో విజయవాడలో యువజన శంఖారావం సభలో కన్నయ్య ప్రసంగం చేశారు. ఆ ప్రసంగ పాఠం ఇది.

*స్నేహితులారా!*

భారతదేశంలాంటి విస్తారమైన ప్రాంతంలోని వేర్వేరు భాషలను నేర్చుకోవడానికి నేను ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటాను. ఇక్కడ ఎన్ని భాషలు, ఎన్ని మతాలు, ఎన్ని సంస్కృతులున్నాయంటే... బహుశా ఒక జీవితంలో ఇవన్నీ నేర్చుకోలేకపోవచ్చు. దీని కోసం వందసార్లు జన్మించాలి. అందుకే నా మాటలను తెలుగులో చెప్పలేను. దానికి నన్ను క్షమించమని అడుగుతున్నాను. నేను మొదటిసారి ఢిల్లీ నుంచి బయటకు వచ్చినప్పుడు ముందుగా స్వాతంత్ర్య భారతదేశంలో భూ పోరాటం జరిగిన నేల మీద అడుగుపెట్టాలని అనుకున్నాను. అది విశాలాంధ్ర నేల. అది తెలంగాణ నేల. నేను దానికి సలాం చేయాలని వచ్చాను. ఎందుకంటే... ఈ నేలమీదే రోహిత్ వేముల పుట్టాడు. రోహిత్ ఈ ప్రజాస్వామ్యం ముందు ఒక పెద్ద '?' (క్వశ్చన్ మార్కు) పెట్టి ప్రశ్నించాడు. – వెయ్యి సంవత్సరాల

తర్వాత కూడా ఈ సమాజంలో ఒక దళితుడుగా జన్మించడానికి దుఃఖించాలా? ఒక దళితుడు విశ్వవిద్యాలయంలో సీటు పొందిన తర్వాత కూడా తన చదువును పూర్తిచేయలేదా? ద్రోణాచార్యులు ఏకలవ్యుల వేళ్ళు కత్తిరించిన బ్రాహ్మణవాద గురుకులాల్లాగా ఆధునిక సమాజంలో ఉన్న యూనివర్సిటీలను తయారుచేయనిద్దామా? ఈ ప్రశ్నలను మనముందు వదిలి వెళ్ళిపోయాడు రోహిత్. నిన్న నేను రోహిత్ అమ్మను కలిశాను. 'అమ్మా... రోహిత్ చేసిన సంఘర్షణను మేము ముందుకు తీసుకెళ్ళతాం. సమాజంలోని మనువాదాన్ని, మతవాదాన్ని సమాధిపెట్టి సమానత్వ సమాజాన్ని స్థాపిస్తాం... ఇదే మా కమిట్‌మెంట్' అని ఆమెతో చెప్పాను.

మనం రోహిత్ వేములకు న్యాయం కోసం, విశ్వవిద్యాలయాలపై జరుగుతున్న దాడిని అడ్డుకోవడానికి, ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రోడ్లపైకి వచ్చినప్పుడు... విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు 'అభివృద్ధి' గాలి తీసేస్తే... మోడీ - మోడీ అని రాసివున్న సూట్ ఎక్కడనుంచి వచ్చిందని ప్రశ్నిస్తే... ఏ చాయ్ వాలా బేటా... లక్షలు ఖరీదు చేసే సూటు వేసుకుంటాడు...? అని ప్రశ్నిస్తారని ఈ ప్రభుత్వం భయపడుతోంది... మన్మోహన్ సింగ్ మాట్లాడరని... సైలెంట్ మోడ్‌లో ఉంటారని మోడీజీ అనేవారు. మీరు ఫ్లైట్ మోడ్‌లో ఉంటారని మేమంటాం. మీరు 'ఫ్లైట్ మోడ్'లో ఉంటారు... ఇక ప్రజలను వైబ్రేషన్‌లో వదిలిపెట్టేశారు. కొత్త మొబైల్స్‌లో వైబ్రేషన్ కెపాసిటీ ఎక్కువని నేను చెప్పాలనుకుంటున్నాను. మేము ఈ దేశ నవయువకులం. మేము విద్యార్థులం. ఒకవేళ మేము వైబ్రేట్ అయితే... మీ ప్రభుత్వం కూడా వైబ్రేట్ అయిపోతుందని మీరు అర్థం చేసుకోండి. ఈ వైబ్రేషన్ యూనివర్సిటీ క్యాంపస్‌లలో మొదలైపోయింది. తమాషా ఏంటంటే... ఈ పని మేము మా మనసుతో చేయలేదు. మోడీ గారి 'మన్ కీ బాత్' (మనసులో మాట)లో మా మన్ కీ బాత్ లేనప్పుడు... మా దిల్ కీ బాత్ మేము వినిపిస్తాము.

మోడీజీ... మేము అడిగిన సమస్యలకు జవాబులు ఇవ్వలేనప్పుడు... మీరు చెప్పినవే ఇచ్చేయండని నేనంటాను. మంచి రోజులు వస్తాయని మీరే చెప్పారు. ఎప్పుడొస్తాయని నేను అడుతున్నాను. ఐదేళ్ళలో వస్తాయా? లేదా 2019 తర్వాత ఇంకో టర్మ్ కావాలా? ధరలు తగ్గుతాయన్నారు. ఎప్పుడు తగ్గిస్తారని నేను అడుగుతున్నాను... పప్పు కిలో రూ.200 లకు అమ్ముతున్నారు. ఆడవాళ్ళ మీద అత్యాచారాలు ఇక జరగవన్నారు. మహిళలు ఇండ్ల నుంచే బయటకురాకూడదని మోహన్ భగవత్ అన్నారు. రెండేండ్ల పాలన తర్వాత బుల్లెట్ రైలు ఎజెండా మారిపోయిందని మేమంటాం. ఈ దేశంలో గుడుల కన్నా... మరుగుదొడ్లు కట్టడం ముఖ్యమని, అందుకే 'స్వచ్ఛభారత్' మొదలుపెట్టామని... ప్రమాణ

స్వీకారం చేసేటప్పుడు మోడీజీ చెప్పారు. కానీ... ఈ స్వచ్ఛ భారత్ నిజమేంటి? వీళ్ళు మురికిని తుడిచేయాలనుకుంటున్నారు. వీళ్ళ దృష్టిలో ఏది మురికి? వీళ్ళ దృష్టిలో పేదరికం మురికి కాదు. మురికి – 'పేద ప్రజలు'. కానీ, ఈ ప్రజలతోనే దేశం ఏర్పడుతుంది. ఈ ప్రజలతోనే ప్రజాస్వామ్యం ఏర్పడుతుంది. ఈ ప్రజల ఓట్లతోనే ప్రభుత్వాలు ఏర్పడతాయి. ప్రభుత్వాలు పడిపోతాయి. ఒకవేళ మీరు మమ్మల్ని తుడిచేయాలనుకుంటే... మీరు కూడా తుడిచిపెట్టుకుపోతారు.

మీరు విద్యార్థులు... చదువుకునే పనిచేయండి... రాజకీయాలు చేయకండి... అని నాయుడుగారు అన్నారు. ఇదే విషయాన్ని ఆయన 30–35 ఏండ్ల ముందు చెప్పివుంటే బాగుండేదని నేను అంటాను. ఎందుకంటే... ఆ సమయంలో ఆయన కూడా విద్యార్థే. రాజకీయం చేసే పార్లమెంటుకు చేరుకున్నారు. ఓడిపోతారు... అయినా మంత్రి అయిపోతారు. మీరు సరదా కోసం రాజకీయం చేస్తారు. మేము మా అవసరాల కోసం రోడ్ల మీదకు వస్తాం. సామాజిక న్యాయం, సమన్యాయం స్థాపించడమే మా అవసరం. ఈ అవసరాలను దేశంలోని 125 కోట్ల మంది ప్రజలు అర్థం చేసుకుంటే... మోడీ జీ... మీరు చేతులు ఊపుతూ 'సవా సౌ కరోడ్ లోగ్' అన్నప్పుడు మా కోసం ఏం చేశారని ఈ 125 కోట్ల మంది ప్రజలు తిరిగి ప్రశ్నిస్తారని గుర్తించుకోండి. సబ్సిడీ డబ్బులన్నీ మాల్యాకు ఇచ్చారు. మా కోసం ఏం చేశారు?

పీఎఫ్ డబ్బులు డ్రా చేయడానికి కూడా పన్నులు కట్టాలని ప్రభుత్వం కార్మికులకు చెప్పింది. దీన్ని మీరు అర్థం చేసుకున్నారా...? మీరు ఏదైనా షాపుకు వెళ్ళి రీచార్జి కూపన్ కొనుక్కున్నప్పుడు దాని రేటు ఎంతుంటే... అంత డబ్బులైతే కట్టాలి. ఆ తర్వాత షాపు యజమాని మీకు థ్యాంక్యూ చెప్పి... అందుకు ఐదు రూపాయలు అధికంగా కట్టమన్నట్టుందీ ఈ విధానం. పిఎఫ్ డబ్బులు కార్మికులవైనప్పుడు... కడుపుమాడ్చుకొని పీఎఫ్ ఎకౌంట్లో జమచేసుకుంటే... అది ఆదాయం ఎలా అవుతుంది? ఈ దోపిడీ ఇక సాగుదు మోడీ జీ... ఈ దోపిడీని ప్రజలు ఇక ఒప్పుకోరు. బహుశా అదే కారణమనుకుంటా... 'వికాస్ (అభివృద్ధి) రైలు' ఇంజన్ రెండేండ్లలో ఫెయిలయిపోయింది. ఆ బుల్లెట్ రైలు పట్టాలమీదికి ఎక్కకముందే ఆగిపోయింది. బహుశా అదే కారణమనుకుంటా... మరుగుదొడ్లు కట్టడం మానేసి... బీజేపీ ఎజెండాలో మళ్ళీ గుడుల నిర్మాణం చేరింది. బహుశా అదే కారణమనుకుంటా... అభివృద్ధి మాటలు వదిలేసి బీజేపీ ఎజెండాలో మళ్ళీ మతవాదం చేరిపోయింది.

ఎవరైతే... బ్రిటిష్ వారికి లేఖలు రాశారో... క్షమాపణ అడిగారో... ఆంగ్లేయులకోసం గూఢచర్యం చేశారో... వారు దేశభక్తి గురించి మాట్లాడుతుంటే... వినడానికి

బాగుంది. వంద ఎలుకలను తిన్న పిల్లికి అసలు ఏమైందని మనసులో ప్రశ్నలు కూడా వెల్లువెత్తుతున్నాయి. తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే... ఈ దేశంలోని 125 కోట్ల మంది ప్రజల మతవాదానికి, నాగపూర్‌లో కూర్చున్నవారి మతవాదానికి తేడా తెలుస్తుంది. తేడా ఏమిటంటే... 'నిక్కరు నుంచి ప్యాంటు'కు మారడానికి సంవత్సరాలు గడిచాయి. కానీ... వీరి ఆలోచనలు ఇప్పటివరకూ మారలేదు. "మేము హిందూ రాజ్యం తెస్తామ"ని వారంటారు. కానీ, వీరు హిందూరాజ్యం కూడా తీసుకురారు. వీళ్ళు అంటరానితత్వాన్ని ఆధారంగా చేసుకొని అగ్రవర్ణాల కోసం రాజ్యం తేవాలనుకుంటున్నారు. ఈ దేశం ఏదో ఒక మతానిది కాదు. ఏదో ఒక కులానిది కాదు. ఏదో ఒక భాషకు, ఒక లింగానికి, ఒక ప్రాంతానికి చెందింది కాదని వారికి చెప్పాలనుకుంటున్నాను. భారతదేశ జాతీయవాద ఆలోచనను ఎవరూ గుత్తాధిపత్యం చేయలేరు. భారత పౌరులుగా... ప్రజలు ఆశించే జాతీయవాదానికి మేము మద్దతిస్తాం. అలాంటి జాతీయవాదాన్ని కాపాడటానికి మేము పోరాడుతున్నాం. ఇదే మా కమిట్‌మెంట్.

అసలు ఈ జాతీయవాద వివాదం ఎందుకు ముందుకొచ్చింది? ఈ సమయంలో ఎందుకొచ్చింది? 2017లో యూపీలో ఎన్నికలున్నాయి. అక్కడ వారు 80లో 73 స్థానాలు గెలుచుకున్నారు. ఈసారి ఓట్లు అడగడానికి ప్రజల దగ్గరకువెళ్ళితే... సోదర సోదరీమణులారా! అని వారన్నప్పుడు... 'మోడీజీ రూ. 15 లక్షలు ఏవి' అని ఆ సోదర సోదరీమణులు ప్రశ్నిస్తే... వారి దగ్గర జవాబు ఉండదు. అందుకే క్యాంపస్‌లలో 'జాతీయవాదం – జాతీయవాదం' ఆడుకుందామని వారనుకున్నారు. రండి... మేము కూడా సిద్ధంగా ఉన్నాం. మీరు నన్ను జాతీయవాదంలో ఇరికిస్తే... నేను మీ జాతీయవాద వివాదాన్ని రోటీ సమస్య వరకూ తీసుకెళ్ళి ముగిస్తాను. మీరు నన్ను జాతీయవాదంలో ఇరికిస్తే... నేను మీ జాతీయవాదాన్ని ప్రజల గౌరవ సమస్యల వరకూ తీసుకెళ్ళి ముగిస్తాను. ఎందుకంటే, దేశం ప్రజలతోనే నిర్మించబడుతుంది. ఇక ప్రజల రోజువారీ తిండి, వారి మౌలిక అధికారాల గురించి, ఆత్మగౌరవం గురించి మాట్లాడటమే దేశభక్తి. మేము ఆ దేశభక్తి పక్షాన నిలబడాలనుకుంటున్నాం. నిలబడ్డాం.

రోహిత్ వేముల ఒక లేఖ రాశాడు. లేఖలో చాలా బాధాకరమైన విషయం చెప్పాడు. 'వైస్ ఛాన్సలర్ గారూ... ఎప్పుడైతే ఒక దళితుడు యూనివర్సిటీలో అడ్మిషన్ తీసుకుంటాడో... అతనికి పొటాషియం సైనైడ్‌ను ఇవ్వండి, సుందరమైన తాడును ఇవ్వండి... వారు అంబేద్కర్ గురించి చదువుకున్నప్పుడు... వారి మనసులో కుల, మత వ్యతిరేక ఆలోచనలు వచ్చినప్పుడు అతను పొటాషియం సైనైడ్ తిననైనా, లేదా తాడును మెడకు

చుట్టుకొని ఉరివేసుకొనైనా తన ప్రాణాలు తీసుకుంటాడు' అని రోహిత్ లేఖలో పేర్కొన్నాడు. పొటాషియం సైనెడ్ కూడా తీసుకుంటాం. ఉరి తాడును కూడా తీసుకుంటాం. కానీ... మాకు మేము ఉరివేసుకోము. బ్రాహ్మణవాదానికి, కులతత్వానికి ఉరివేస్తామని రోహిత్‌తో చెప్పాలనుకుంటున్నాను. రోహిత్... ఈ దేశంలోని క్యాంపస్‌లలో ఉన్న కులతత్వ పరిస్థితులకు వ్యతిరేకంగా... నువ్వు చూపిన దారిలో ఈ సంఘర్షణను ముందుకు సాగిస్తాం. క్యాంపస్‌లలో రోహిత్ యాక్ట్ అమలుచేయాలన్నదే మా డిమాండ్. సమాజంలో, యూనివర్సిటీ క్యాంపస్‌ల నుంచి కులవివక్షను పూర్తిగా నిర్మూలించాలి.

ఒక దళితుడు క్యాంపస్‌లోకి వచ్చినప్పుడు, ఒక పేద రైతు కొడుకు క్యాంపస్‌లోకి వచ్చినప్పుడు... ఒక రైతు కొడుకు ఎందుకు రైతు కావాలనుకోవడంలేదు? ప్రధానమంత్రి కొడుకు ప్రధానమంత్రి కావాలనుకుంటున్నాడు. రాష్ట్రపతి కొడుకు రాష్ట్రపతి కావాలనుకుంటున్నప్పుడు... ప్యూన్ కొడుకు ప్యూన్ ఎందుకు కావాలనుకోవడంలేదో అర్థం చేసుకుంటాడు. ఈ దోపిడీని అతను అర్థం చేసుకుంటే... ఈ దోపిడీకి వ్యతిరేకంగా మాట్లాడటం మొదలుపెడతాడు. మాట్లాడటం మొదలుపెడితే... కొంతమంది అధికార పీఠాలు కదులుతాయి. ఎవరి అధికార పీఠాలు కదులుతాయో... వారు 'షట్ డౌన్ జేఎన్‌యూ' (జేఎన్‌యూను మూసివేయండి) అంటారు. జేఎన్‌యూ మీ ఆదేశాల ప్రకారం నడవడంలేదు. జేఎన్‌యూ మీ ఆశీర్వాదాలతో నడవడంలేదు. జేఎన్‌యూ ఈ దేశ ప్రజల డబ్బులతో నడుస్తోంది. వారి పిల్లలు జేఎన్‌యూలో చదువుతారు. దేశంపై ధనవంతులకు ఎంత హక్కుందో... పేదలకు కూడా అంతే హక్కుంది. జేఎన్‌యూలో రూ. 120 లతో చదువుకోవచ్చంటే... అక్కడ ఎలాంటి వారు చదువుతారో మీరే ఊహించుకోండి. జేఎన్‌యూపై ఎందుకు దాడి చేశారో మీరే ఊహించుకోండి. జేఎన్‌యూలో 65 శాతం మంది విద్యార్థినులు చదువుతున్నారు. వారు పురుషాధిక్య సమాజం నుంచి స్వాతంత్ర్యం కావాలని హక్కుతో అడుగుతారు. అందుకే జేఎన్‌యూ జేఎన్‌యూ అయ్యింది. మహిళలు ఇండ్ల నుంచి బయటకు రాకూడదని చెప్పే మోహన్ భగవత్‌లకు ఇది మంటపుట్టిస్తోంది.

మన దేశంలో, క్యాంపస్‌లలో దేశ వ్యతిరేక పరిస్థితులు నెలకొంటున్నాయని ఆరోపిస్తున్నారు. అతి పెద్ద దేశ వ్యతిరేక పరిస్థితులు ఎక్కడైనా నెలకొంటున్నాయంటే... అవి విధానాల రూపకల్పన చేసే గదుల్లోనే. పేద ప్రజల పొట్టకొట్టి ధనవంతులకు సబ్సిడీలు ఇచ్చేస్తున్నారు. మాకిస్తే సబ్సిడీ... వారికిస్తే ప్రోత్సాహకాలా? ఇది ఇక సాగదు. సబ్సిడీలు మా హక్కు. మేము తీసుకొని తీరతాం. ప్రోత్సాహకాలు ఇచ్చి ఎవరినైతే... పారిపోయేలా చేశారో... వారి గురించి కూడా ప్రశ్నిస్తాం. ప్రశ్నలు అడిగినప్పుడు రాజకీయం చేస్తున్నారని

అంటారు. లేదు మోడీజీ... మీరే రాజకీయాలు చేయండి. అందులో మీరు ప్రావీణ్యులు. మేము విద్యార్థులం. చదువుకోవాలనే అనుకుంటున్నాం. కానీ... మీరు మమ్మల్ని ఎక్కడ చదువుకోనిస్తున్నారు. ఎవరినడిగి స్కాలర్‌షిప్‌లు నిలిపివేశారు? ఈ దేశంలోని పీహెచ్‌డీ స్కాలర్లకు రూ. 5,000, రూ. 8,000లు స్కాలర్‌షిప్ వచ్చేదని మీకు తెలిసుండాలి. 'అచ్చేదిన్' ప్రభుత్వం వచ్చినప్పుడు మొట్టమొదటిగా విద్యారంగ బడ్జెట్‌లో 17 శాతం కోతపెట్టారు. ఈ ప్రభుత్వం ఎవరినీ వదిలిపెట్టదు. మొదటిదాడి మా విద్యార్థులపై జరిగింది... మా స్కాలర్‌షిప్‌లను ఆపేశారు. మనం మాట్లాడితేనే వారికి ఇబ్బంది కలుగుతోంది. ఇబ్బంది కలిగినప్పుడే విద్యార్థులను టార్గెట్ చేస్తారు. కేవలం విద్యార్థులనే టార్గెట్ చేయరు. హెచ్‌సీయూలో, జేఎన్‌యూలో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను కూడా జైల్లో పెట్టడం మొదలుపెట్టారు. ఇదే విషయాన్ని నేను మీడియా వారికి కూడా చెప్పాను. లోకంలో మొదటిసారి ఫాసిజం వచ్చినప్పుడు ప్రెస్ వాళ్ళు ఇలా అన్నారు – 'వాళ్ళు వచ్చి జ్యూస్‌ని చంపినప్పుడు మేము మౌనంగా ఉన్నాం. వాళ్ళు వచ్చి సోషల్ డెమోక్రాట్లను చంపినప్పుడు మౌనంగా ఉన్నాం. వాళ్ళు వచ్చి కమ్యూనిస్టులను చంపినప్పుడు మౌనంగా ఉన్నాం. తర్వాత వాళ్ళు మమ్మల్ని చంపడానికి వచ్చినప్పుడు... కాపాడ్డానికి ఎవరూ లేరు'. అలాగే మన దేశంలో ఇవాళ వాళ్ళు విద్యార్థులను కొడుతున్నారు. ఉపాధ్యాయులను కొట్టడం మొదలుపెట్టేశారు. మీడియావాళ్ళను కూడా ఢిల్లీలో కొట్టారు. ఈ దేశంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే 'ఫ్యాషన్' అని బీజేపీ అంటోంది. రేపు వారిని కూడా కొడతారు. కార్మికులు ఎప్పటి నుంచో చనిపోతున్నారు. పౌర సమాజం, మధ్యతరగతి వారు కూడా తప్పించుకోలేరు. అందుకే ఇవాళ జేఎన్‌యూ మీద దాడి జరిగిందంటే... హెచ్‌సీయూ మీద దాడి జరిగిందంటే... అది ప్రజాస్వామ్యం మీద జరిగిన దాడి. రాజ్యాంగం మీద జరిగిన దాడి. ఈ దాడిని ఆపడానికి మనమందరం ఏకంకావాలి. ఈ నకిలీ జాతీయవాదులతో పోటీకి దిగాలి.

భారత్‌మాత మాదని వారికి చెప్పాలి. కానీ, మా భారత్‌మాతకి మీ భారత్‌మాతకి తేడా ఉంది. తేడా ఏమిటంటే... మీ భారత్ మాత చాలా అందంగా కనిపిస్తుంది. మా భారత్‌మాత చాలా బలహీనంగా ఉంది. ఆమె మొఖం మీద అలసట ఉంది. ఒక్కసారి స్వాతంత్ర్య పోరాట సమయంలోని భారతమాతను గుర్తుచేసుకోండి. అప్పుడు భారత మాత చేతిలో తిరంగ జెండా ఉండేది. భారతమాత వెనుక మనదేశ పటం ఉండేది. కానీ, ఇప్పటి భారతమాతలో తేడా వచ్చింది. భరతమాత చీరను మార్చేశారు. జెండాను మార్చేశారు. అందుకే కామ్రేడ్స్... తప్పుగా అనుకోకండి. కానీ నేను ఒక విషయం చెప్పదలుచుకున్నాను.

లాల్ ఖిలాపై లాల్ జెండాను ఎగురవేస్తామనే నినాదాన్ని వదిలేయండి. ఎందుకంటే... లాల్ ఖిలాపై తిరంగ జెండా కూడా మిగలని పరిస్థితి. అక్కడ కాషాయ జెండా ఎగరేసే ఏర్పాట్లలో ఉన్నారు. అందుకే ఇప్పుడు ఒక్క రంగుతో పని పూర్తికాని స్థితిలో ఉన్నాం. సప్త స్వరాల లాగా, ఏడు రంగులపైన మనం పట్టు సాధించాలి. ఎరుపు – నీలాన్ని ఏకం చేయండి. పచ్చదనాన్ని కలుపుకుపోండి. తెలుపును మీ రంగులా మార్చుకోండి. ఏడు రంగుల ఆందోళనను నిలబెట్టండి. ఏడు రంగుల సలాం చేయండి. కాషాయరంగు ఆధిపత్యాన్ని మేము అంగీకరించమని చెప్పండి. మీ హిందూ రాష్ట్ర సిద్ధాంతాన్ని మేము ఒప్పుకోమని చెప్పాలి. ఇది ఎంత విచారించాల్సిన పరిస్థితో చూడండి. ఒకరి ప్రాణాలుపోతే... తిన్న మాంసాన్ని గుర్తించడం ముఖ్యమైపోయింది. ఒకరి ప్రాణాలు పోతే... వారి కులం గుర్తించడం ముఖ్యమైపోయింది. ఎలాంటి దేశం కోసం బాబా సాహెబ్ డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్, భగత్‌సింగ్ కలలు కన్నారో... అలాంటి దేశం కోసం మనమూ కలలుకంటుంటే... మనకి కులం ముఖ్యం కాకూడదు. గుర్తింపు ముఖ్యం కాకూడదు. మనకు ప్రతీ భారతీయుడి, పౌరుడి అధికారాలు ముఖ్యం. వారి హక్కులు ముఖ్యం. ఆ హక్కుల పక్షాన నిలబడటం ముఖ్యం. అందుకే నేను మీకు చెప్పాలనుకుంటున్నాను. ఇది చాలా గంభీరమైన సమయం. మనం అన్నిరకాల సిద్ధాంతాలను ఏకం చేయాల్సిన అవసరం ఉంది.

అమెరికాలో ట్రంప్ గెలిస్తే... ఇక్కడ మోడీగారు అధికారంలో కూర్చుంటే... ఈ దేశంలో ఏం జరుగుతుందో మీరే ఊహించుకోండి. ఎందుకంటే... రెండురకాల పెట్టుబడిదారులు తయారవుతున్నారు. సింహం గడ్డి తినదని అంటారు. అవును. నిజమే. అలాగే పేదల రక్తం పీల్చేసి – పెట్టుబడిదారులు ముందుకు సాగుతారు. ఇది సత్యం. కానీ, ఇంకో విషయం. వెనకటికి ఒక సామెత ఉంది. నాగుపాము నాట్యానికి... సాధారణ పాము నాట్యానికి తేడా గమనించాలి. ఏ శత్రువు ఎక్కువ ప్రమాదకరమో మనమే నిర్ణయించుకోవాలి. ఒకసారి శత్రువును నిర్ణయించుకుంటే... మిత్రులు వారికి వారే కళ్ళు మూసుకుని తయారైపోతారు.

స్నేహితులారా! కేవలం ప్రజల ఓట్లతోనే ప్రభుత్వాలు ఏర్పడవు. కేవలం ప్రజల ఓట్లతోనే ప్రభుత్వాలు ఏర్పడితే... కోట్లాది రూపాయలు ఎన్నికల్లో ఖర్చుపెట్టాల్సిన అవసరంరాదు. ఎన్నికల్లో ఇంత నగదు ఎందుకు ఖర్చుపెడుతున్నారు? ఎందుకంటే... ప్రజల అవగాహనను మార్చేయడానికి. అవగాహన ఎంత అద్భుతమైందో చూడండి. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నప్పుడు అన్ని ఛానళ్ళు రేయీ... పగలూ మోడీ మోడీ అంటూ భజన చేశాయి. మనం హిందుస్థాన్‌లో కాకుండా... మోడిస్థాన్‌లో ఉన్నట్టుగా

అనిపించేది. నేడు మోడీ భక్తులు ఎలాంటి తిట్లు కురిపిస్తున్నారంటే... దేశభక్తి కాదు, మోడీభక్తి ఈ దేశంలో నడుస్తున్నట్టు అనిపిస్తుంది. ఇది మోడిస్తాన్ కాదు... ఇక్కడ ఎలాంటి మోడీభక్తి జరగబోదని నేను మీకు చెప్పాలనుకుంటున్నాను. ఇది భారతదేశం. ఇంకా ఇక్కడ దేశభక్తే నడుస్తుంది. ఇక దేశం గాలిలో తయారవదు. ఇక్కడి 125 కోట్ల మంది ప్రజలతో తయారవుతుంది. మీ భక్తి, మన భక్తే... ఈ దేశభక్తని వారికి అర్థమయ్యేలా చెప్పాలి.

మా విద్యార్థులందరం మా దారిని ఎంచుకున్నాం. మేము ప్రజాస్వామ్యం వైపు నిలబడ్డామని, న్యాయం వైపు నిలబడ్డామని మాకు తెలుసు. ఎవరైతే ప్రజాస్వామ్యంవైపు నిలబడాలనుకుంటున్నారో... ఈ దేశంలో 55 కోట్ల యువకుల పక్షాన మాట్లాడాలనుకుంటున్నారో... ఈ దేశంలో పంటలు పండించే రైతుల పక్షాన మాట్లాడాలనుకుంటున్నారో... తమ హక్కుల కోసం మాట్లాడాలనుకుంటున్నారో... ఈ దేశంలోని 125 కోట్ల ప్రజల హక్కుల కోసం మాట్లాడాలనుకుంటున్నారో... రండి... జై జవాన్ నినాదమిద్దాం. జై కిసాన్ నినాదమిద్దాం. జై రాజ్యాంగం నినాదమిద్దాం. సాంప్రదాయ దౌర్జన్య వ్యవస్థను విసిరిపారేసి... ఈ భారతదేశం మాది. ఈ భారతదేశం డాక్టర్ భీం రావ్ అంబేద్కర్‌ది. ఈ భారతదేశం భగత్‌సింగ్‌ది. దీన్ని నాశనం కానివ్వమని చాటి చెబుదాం. ఈ దేశాన్ని రక్షిద్దాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం. రాజ్యాంగాన్ని కాపాడదాం. రోహిత్ వేములకు న్యాయం జరిగేలా చూసి, సామాజిక న్యాయ కలలను నిజం చేద్దాం. ఇంక్విలాబ్ జిందాబాద్.

# 3

# నా పేరు ఉమర్ ఖాలిద్...
# కానీ నేను టెర్రరిస్టును కాను

జేఎన్‌యూ వివాదంలో ఉమర్ ఖాలిద్ గురించి చాలా చర్చ జరిగింది. మీడియాలో ఒక వర్గం అతణ్ని 'టెర్రరిస్టు'గా చిత్రించడానికి తప్పుడు ఆరోపణలెన్నో చేసింది. 'సంఘ్' భక్తులు అతని కుటుంబాన్ని చాలా దుర్మార్గంగా వేధించారు. పోలీసులు అతని కోసం దేశవ్యాప్తంగా 'వేట' ప్రారంభించామని చెప్పారు. కానీ ఖాలిద్ అతని అనుచరులతో పాటు సోమవారం తెల్లవారు జామున జేఎన్‌యూ విద్యార్థుల ముందు ప్రత్యక్షమై ఉత్తేజకరమైన ప్రసంగం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలన్నింటికీ తనదైన శైలిలో జవాబిచ్చారు. ఇది ఆ ప్రసంగం పూర్తి పాఠం.

మిత్రులారా! నా పేరు ఉమర్ ఖాలిద్ నిజమే కానీ నేను టెర్రరిస్టును కాను. మొట్టమొదటగా, ఈ ఉద్యమంలో దృఢంగా నిలబడ్డ విద్యార్థులకు, అధ్యాపకులకు నా అభినందనలు. ఈ పోరాటం కేవలం ఐదారుగురు వ్యక్తుల కోసం సాగుతున్నది కాదనేది మనకు తెలుసు. ఇది మనందరి పోరాటం. ఇది ఈ విశ్వవిద్యాలయం పోరాటం. దేశంలోని విశ్వవిద్యాలయాలన్నింటి పోరాటం. ఇది మన సమాజ మార్పునకు సంబంధించిన పోరాటం.

గత పది రోజుల్లో నా గురించి నాకే తెలియని చాలా విషయాలు తెలిశాయి. నేను రెండు సార్లు పాకిస్తాన్‌కు వెళ్లొచ్చానట! నా దగ్గర పాస్‌పోర్టే లేదు కానీ రెండు సార్లు వెళ్లానట! ఈ ఆరోపణ బెడిసికొట్టడంతో మరొకటి పుట్టించారు. నేను 'మాస్టర్ మైండ్'నట! జేఎన్‌యూ విద్యార్థులందరికీ అద్భుతమైన 'మైండ్' ఉంటుందనేది నిజమే కానీ ఈ మొత్తం కార్యక్రమానికి పథకం రచించిన 'మాస్టర్ మైండ్'గా నన్ను చిత్రించారు! అంతేకాదు,

నేను ఈ ప్రోగ్రాంను 17-18 విశ్వవిద్యాలయాల్లో నిర్వహించాలని ప్లాన్ చేసినట్టుగా కూడా చెప్పారు. నా ప్రభావం ఇంత విస్తృతంగా ఉందని నాకే తెలియదు! నేను గత 2-3 నెలలుగా ఆ సమావేశం కోసం పథకం రూపొందించానని వారు చెప్పారు. ఇది కూడా కౌంటర్ కావడంతో, నేను గత కొద్ది రోజులలో 800 ఫోన్‌కాల్స్ చేశానని అన్నారు.. ఏ సాక్ష్యం అవసరం లేదు మీడియాకు! 'ఎలెజెడ్లీ' (కథనం) అని చెప్పాల్సిన అవసరం కూడా లేదిప్పుడు! ఎక్కడెక్కడికి కాల్స్ చేశానట? గల్ఫ్‌కు చేశానట! కాశ్మీర్‌కు చేశానట! మరి సాక్ష్యం తీసుకురావచ్చుగా! ఫోన్ చేసినంత మాత్రాన నేరం కాదనేది మొదటి విషయం. ఒకవేళ చేసినా దానికి సాక్ష్యాలైతే ఉండాలి కదా! వీళ్లకు ఇంతలా అబద్ధాలాడేందుకు సిగ్గుగా కూడా అనిపించడం లేదు. జరిగినదంతా 'మీడియా ట్రయలే'. మన నేరాల చిట్టా (ప్రొఫైలింగ్) కూడా తయారు చేసింది. ఆఖరుకు ఐబీ, ప్రభుత్వం సైతం జైషేమహ్మద్‌తో వీళ్లకు సంబంధాలు లేవని చెప్పినా, మీడియా మాత్రం క్షమాపణ చెప్పడం గానీ, డిస్‌క్లెయిమర్ గానీ ఏదీ ఉండదు.

మొదట ఇవన్నీ వింటుంటే నవ్వొచ్చింది. ఇన్ని అబద్ధాలతో, ఇన్ని ఆరోపణలు ప్రచారంలో పెట్టి తప్పుకోవచ్చనిమీడియా వాళ్లు అనుకుంటున్నారేమో కానీ అలా జరగదు. **మీరు దేశ ప్రజలకు వ్యతిరేకంగా... ఆదివాసులైతే వారిపై మావోయిస్టులనే ముద్రవేయడం ద్వారా, ముస్లింలైతే టెర్రరిస్టులుగా ముద్ర వేయడం ద్వారా సాగిస్తున్న విచారణలు ఎన్నో ఉన్నాయి. చాలా మంది నిస్సహాయులు కాబట్టి ఇలాగే సాగిపోతోంది. కానీ మీరిప్పుడు పప్పులో కాలేశారు. జేఎన్‌యూ విద్యార్థులు దీనికి సరైన జవాబు చెబుతారు. ఇలా తప్పుడు రిపోర్టింగ్ చేసిన ఒక్కొక్క మీడియా చానెల్ ఇందుకు బాధ్యత వహించక తప్పదు.**

వ్యక్తిగతంగా నేనెప్పుడూ భయపడలేదు. ఎందుకంటే నాకు తెలుసు. మీరంతా వేల సంఖ్యలో నాకు మద్దతుగా నిలబడతారని. కానీ నేను నా చెల్లెండ్ల ప్రకటనలు, మా తండ్రి ప్రకటన చూశాక ఆందోళన చెందాను. నా చెల్లెండ్లను రేప్ చేస్తామని, యాసిడ్ దాడి చేస్తామని సోషల్ మీడియాలో బెదిరింపులు రావడంతో ఆందోళన కలిగింది. నాకప్పుడు కంధమాల్ (ఒడిషా) గుర్తుకొచ్చింది. క్రైస్తవ సన్యాసినిపై బజరంగ్‌దళ్ గూండాలు సామూహిక అత్యాచారం జరిపినప్పుడు 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. ఫిబ్రవరి 11న కామ్రేడ్ కన్నయ్య అన్నట్టుగా, 'ఇదే మీ భారత్ మాత అయితే మాకీ భారత్ మాత వద్దు'. దీనికి మేం సిగ్గుపడం కూడా! మా తండ్రిని టీవీ స్టూడియోల్లో ప్రశ్నలతో వేధించారు. ఎక్కడెక్కడి వివరాలో తవ్వి తీసి వాటిని దీనితో జోడించే ప్రయత్నం చేశారు. జీ న్యూస్, టైమ్స్ నౌ (దాన్ని నడిపిస్తున్న వ్యక్తి పేరు నేను చెప్పదల్చుకోలేదు) వంటి చానెళ్లకు ఇంత

ద్వేషం, ఇంత కోపం ఎక్కడి నుంచి వస్తోంది? ఇంత ద్వేషాన్ని ఎలా పెంచుకోగలుగుతారో అర్థం కావడం లేదు.

గత ఏడేండ్లుగా ఈ నేనీ క్యాంపస్ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్నాను. కానీ ఇన్నేండ్లలో నన్ను నేను ఎప్పుడూ ఒక 'ముస్లిం'గా భావించలేదు. నన్ను నేను ఎప్పుడూ ఒక ముస్లింగా ప్రదర్శించుకోలేదు. ఎందుకంటే పీడన కేవలం ముస్లింల పైననే జరగడం లేదు. సమాజంలోని వివిధ పీడిత సెక్షన్లన్నీ బాధిత సమూహాలే. ఆదివాసులపై, దళితులపై పీడన కొనసాగుతోంది. మా లాంటి బాధిత సమూహాల నుంచి వచ్చే వాళ్లం మా తక్షణ గుర్తింపుల పరిధి లోంచి బైటికి వచ్చి సమస్యలను సమగ్ర దృష్టితో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ గత ఏడేండ్లలో నాకు మొదటిసారిగా గత పది రోజుల్లోనే నేను ముస్లింనని తోచింది. రోహిత్ వేముల మాటల్లో చెప్పాలంటే, నన్ను నా తక్షణ గుర్తింపుకు కుదించి వేశారు. ఇది చాలా సిగ్గు చేటైన విషయం.

వీళ్లు నన్ను పాకిస్తాన్ ఏజెంట్ అంటున్నారు. నేను పాకిస్తాన్‌కు చెందిన ఒక కవి రాసిన రెండు మాటలు ఇక్కడ చెప్పాలనుకుంటున్నాను. 'అరే భాయ్! హిందూస్తాన్ నాదే... పాకిస్తాన్ నాదే.. కానీ ఈ రెండింటిపైనా ఉన్నది అమెరికా పెత్తనమే. ఆ అమెరికాకు మీరు దళారులు!' మీ ప్రభుత్వానికి దళారీతనం తప్ప మరొకటి రానే రాదు. మీరే అమెరికా పాదాలు నాకుతున్నారు. ఈ దేశ సంపదలను, వనరులను అమెరికాకు దోచిపెడుతున్నారు. పెద్ద పెద్ద ఎంఎన్‌సీలు ఇక్కడి శ్రమశక్తిని దోచుకుంటున్నాయి. విద్యారంగాన్ని కూడా తాకట్టు పెట్టింది. డబ్ల్యూటీవోలో ప్రభుత్వం ఎలా మోకరిల్లిందో మనం చూశాం. వీళ్లు మాకు దేశభక్తి గురించి చెబుతున్నారు! నా తోటి దేశద్రోహులారా! 'ప్రపంచ దేశద్రోహులారా, ఏకం కండి' అని అనాలిప్పుడు. మేం ప్రజలను ప్రేమిస్తాం. మా పోరాటానికి హద్దులు, సరిహద్దులు లేవు. ప్రపంచవ్యాప్తంగా మనమంతా ఏకమవుతాం. ప్రజలను పీడించే ఏ దేశ ప్రభుత్వానికైనా వ్యతిరేకంగా ఏకమవుతాం.

ఈ తరహా హేయమైన ఎత్తుగడలతో వాళ్లు మనల్ని భయపెట్టలేరు. వాళ్లు మన నోళ్లను మూయించలేరు. మిత్రులారా! మనం వీళ్లకు భయపడాల్సిన అవసరం లేదని మీకు చెప్పాల్సిన పనే లేదు. వీళ్లకు మెజారిటీ ఉండొచ్చు. వీళ్లకు చాలా సీట్లు ఉండొచ్చు. వీళ్ల దగ్గర బలమైన మీడియా ఉండొచ్చు. రాజ్య యంత్రానికి సంబంధించిన చాలా విభాగాలు, పోలీసులు వగైరా ఉండొచ్చు. అయినా వీళ్లు భయపడతున్నారు. మన పోరాటాలకు భయపడుతున్నారు. మనం ఆలోచిస్తున్నందుకు వాళ్లు భయపడుతున్నారు. నా సహచరుడు

అనిర్బాన్ ఫిబ్రవరి 10న ఒక మాట చెప్పాడు. దేశద్రోహి కావడం చాలా సులువని. ఆలోచించడం మొదలు పెడితే చాలు వెంటనే దేశద్రోహి అయిపోతారు. కాబట్టి మీరు మమ్మల్ని భయపెట్టగలమని అనుకుంటే మీరు చాలా పెద్ద భ్రమలో ఉన్నట్టే. ముందే చెప్పినట్టుగా, మీరీ విశ్వవిద్యాలయంతో తలపడి పొరపాటు చేశారు. చాలా విశ్వవిద్యాలయాలతో ఇదివరకే మీరు తలపడ్డారు. ఎఫ్‌టిఐఐలో జరిగింది గానీ, హెచ్‌సీయూలో రోహిత్ వేముల హత్య జరిగిన తీరు గానీ, బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో సందీప్ పాండేకు జరిగింది గానీ... ఈ అన్ని పోరాటాలతో మేం భుజం భుజం కలిపి నడిచాం. ప్రతి పోరాటాన్ని మేం ఇక్కడ వీధుల్లోకి తీసుకెళ్లాం. ఇది మా బాధ్యతని మేం భావిస్తాం.

**అయితే మీకు జేఎన్‌యూనే పెద్ద అడ్డంకిగా ఉంది కాబట్టి దీనినే అణచివేస్తామని అనుకుంటే మీకు చెప్పేదొకటే. ఈ తరహా విఫల ప్రయత్నాలు గతంలోనూ జరిగాయి. బహుశా మీరు మర్చిపోవచ్చు గానీ ఎమర్జెన్సీ తర్వాత ఇందిరా గాంధీ ఇక్కడికి రావడానికి ప్రయత్నిస్తే ఆమెను అడ్డుకున్నారు.** మునుపటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇక్కడికి వచ్చినప్పుడు యూపీఏ దేశాన్ని తాకట్టు పెడుతున్న విధానాలను వ్యతిరేకిస్తూ అతనికి నల్ల జెండా చూపించాం. చిదంబరం ఇక్కడికి వచ్చినప్పుడు, తనకు ఘన స్వాగతం లభిస్తుందని ఆశించి ఆశాభంగం పొందిన విషయం గుర్తుండాలి. విద్యార్థులు తాము ఈ దేశ పీడిత ప్రజల వైపున్నామని చిదంబరంకు తెలియజెప్పారు. కాబట్టి ఇలాంటి తాటాకు చప్పుళ్లతో బెదిరిపోయే కుందేళ్లం కాదు మేం. ఇవి కేవలం మైండ్‌గేమ్స్ మాత్రమే! మనం భయపడతామా లేదా అని వాళ్లు పరీక్ష పెడుతున్నారు. కానీ మనం భయపడమని చాటి చెబుదాం. సవాలును స్వీకరిద్దాం. ప్రతి రంగంలోనూ ఎదురు నిలిచి పోరాడుదాం. ప్రతి అంశంపైనా, క్యాంపస్‌లోని ప్రతి విద్యార్థికీ ఎలాంటి జంకు లేకుండా తన అభిప్రాయాన్ని చర్చించే హక్కుంది.

వీళ్లకో విద్యార్థి విభాగం ఉంది - ఏబీవీపీ. ఇది ఈ క్యాంపస్‌లో వాళ్ల వానర సేన. ఏ అంశం వచ్చినా వీళ్లు అల్లరి మూకలా వ్యవహరిస్తారు. పోలీసులు, క్యాంపస్ అడ్మినిస్ట్రేషన్, మంత్రులు అందరూ వీళ్లకు అండగా ఉంటారు. రోహిత్‌ను ఇట్లాగే అందరూ కుమ్మక్కై చంపేశారు. కానీ ఇక్కడ ఎవ్వరూ మరో రోహిత్ కాబోరని నేను ప్రకటిస్తున్నాను. ఈ క్యాంపస్ విలువేమిటో మనకు తెలుసు. దీన్ని మనమే తీర్చిదిద్దుకున్నాం. దీన్ని నాశనం చేయాలనే వీళ్ల ప్రయత్నాలను ఓడిద్దాం. ఇందులో ఒక్క అంగుళం స్థలం కూడా వారికి వదిలెయ్యం. **ఏబీవీపీకి అసలు ప్రజల్లో బలం లేదు. ప్రజలను సమీకరించలేరు వీళ్లు. కేవలం ప్రభుత్వ యంత్రాంగాన్ని తోడుగా తెచ్చుకుంటారు. ఈ పది రోజుల్లో ఇంత మీడియా**

ప్రచారం, ఇన్ని మీడియా ట్రయల్స్, దేశభక్తి పేరుతో రెచ్చగొట్టే ప్రకటనలు ఇన్ని జరిగినా వీళ్ల కార్యక్రమాలకు హాజరవుతున్నది కేవలం వేళ్ల మీద లెక్కించేంత మందే. ఇక్కడ మనం 15 వేల మంది దాకా సమీకరించగలిగాం. విద్యార్థి ఉద్యమంలో మనం నేర్చుకున్నది ఏమిటంటే, 'అసమ్మతిని అనుమతించని విశ్వవిద్యాలయం జైలుగా మారిపోతుంది'. వారి అజెండా స్పష్టమే! విశ్వవిద్యాలయాలను జైళ్లుగా మార్చాలనేదే వాళ్ల లక్ష్యం. దీన్ని మనం ఓడించాలి. ఐక్యంగా ఉండాలి. చీలి పోవద్దు. మనలో మనకు విభేదాలున్నాయని మనకు తెలుసు. అయితే వాటిని ఎలా చర్చించుకోవాలో కూడా మనకు తెలుసు. చివరగా, గత పదిరోజుల్లో ఇక్కడే కాదు, దేశవ్యాప్తంగా లెక్క లేనన్ని దాడులు జరిగాయి. హెూండా కార్మికులపై దాడి జరిగింది. జగ్దల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లో లీగల్ ఎయిడ్ గ్రూపుపై దాడి జరిగింది. సోని సోరిపై దాడి జరిగింది. ఈ పోరాటాలన్నింటికీ సంఘీభావం తెలపాలి. ఈ పోరాటాలతో అనుసంధానం చేసుకోవాలి. ఎక్కడ, ఏ అన్యాయం జరిగినా వారికి అండగా నిలబడే జేఎన్‌యూ సంప్రదాయాన్ని సజీవంగా నిలుపుకోవాలి. ఇంక్విలాబ్ జిందాబాద్!

# 4

# నల్ల చట్టాలు మీరు తెస్తే... భగత్‌సింగ్‌లం మేమవుతాం...

## ఇండియా టుడే చర్చా వేదికలో కన్నయ్య, షెహ్లా రషీద్

ఎఫ్‌టిఐఐలో విద్యార్థులపై సస్పెన్షన్ వేటు, హెచ్‌సీయూలో రోహిత్ వేముల 'హత్య', జేఎన్‌యూ ఘటన చూస్తే... కొన్ని ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. క్యాంపస్‌లలో ఈ ఆగ్రహ జ్వాలలు ఎందుకు? విద్యార్థులు ఎందుకు ఆగ్రహంతో ఉన్నారు? ఇది ఎవరి తప్పు? ఇది రాజ్యం తప్పా? కన్నయ్యకుమార్ లాంటి విద్యార్థుల తప్పా? ఈ ప్రశ్నలకు జవాబుకోసం 'ఇండియా టుడే' ఏర్పాటుచేసిన చర్చా వేదికలో దేశ ద్రోహం ఆరోపణలు ఎదుర్కొంటున్న జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కన్నయ్య కుమార్, ఉపాధ్యక్షురాలు షెహ్లా రషీద్ పాల్గన్నారు. ఈ కార్యక్రమానికి ఇండియా టుడే ప్రతినిధి రాహుల్ కవల్ నేతృత్వం వహించారు. ఈ చర్చావేదికలో కన్నయ్య కుమార్, షెహ్లా రషీద్ చెప్పిన ఉత్తేజకరమైన విషయాలు.

రాహుల్ కవల్ : 'అఫ్జల్‌గురూను స్మరించుకుంటూ జేఎన్‌యూలో కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో కన్నయ్య కుమార్ కూడా పాల్గన్నారు. నినాదాలు చేశారా లేదా అనేది తర్వాతి విషయం. కానీ, అలాంటి కార్యక్రమాల్లో పాల్గనడం కూడా దేశ వ్యతిరేక చర్యే' అని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. దానికి మీ స్పందన ఏమిటి?

కన్నయ్య కుమార్ : 9వ తేదీన జరిగిన ఘటన పూర్తి వివరాల్లోకి నేను వెళ్ళను. కానీ, 'దేశ వ్యతిరేకం' అనే పదాన్ని గురించి కొన్ని విషయాలను చెప్పాలనుకుంటున్నాను. ఈ దేశంలో అన్నిటికన్నా అత్యున్నతమైనదీ, ఉత్తమమైనదీ ఏదైనా ఉందంటే అది మన రాజ్యాంగమే. పూర్తి రాజ్యాంగంలో జాతీయం (నేషనల్) గురించి ఎక్కడా చెప్పలేదు. నేషనల్ అనే పదాన్ని వాడనప్పుడు యాంటీ నేషనల్ (దేశ వ్యతిరేకం) అనే పదం ఉండటంలో అర్థంలేదు. కేవలం ఒకే ఒక్కసారి నేషన్ (దేశం) అనే పదాన్ని వాడారు. అన్నిచోట్లా 'ఇండియన్ స్టేట్ (భారత రాజ్యం)' అని అన్నారు. ఇంకా మన దేశ రాజ్యాంగ పీఠిక 'వియ్ ద పీపుల్ ఆఫ్ ఇండియా' అని మొదలవుతుంది. కాశ్మీర్ మనలో భాగమా కాదా అని ముందు నిర్ణయించుకోండి. నా ఉద్దేశంలో కాశ్మీర్ భారతదేశంలో భాగమే. అవిభాజ్యమైనది. కాశ్మీర్ ప్రజల గురించి మాట్లాడటం, భారతదేశ ప్రజల గురించి మాట్లాడటంలో ఏ తప్పూ లేదు. ఇక అఫ్జల్ గురూను సమర్థిస్తూ నినాదాలు ఇవ్వడం - ఇవ్వకపోవడం అనే దానిపై నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. మేము 'ఉరి'కి వ్యతిరేకంగా నినాదాలు ఇస్తాం. దేశంలోని ఏ నాగరికుడికైనా, ఏబీవీపీకి చెందినవ్యక్తికైనా ఉరిశిక్ష పడితే మేము దానిని వ్యతిరేకిస్తాం. ఇది సిద్ధాంతానికి సంబంధించిన విషయం. ఇక 'దేశద్రోహం - దేశభక్తి' అని చిత్రీకరించిన దానిపై చెప్పాలంటే... ఇవాళ దేశాన్ని కాపాడాల్సిన సవాల్ మన ముందుంది. దేశమంటేనే మనుషులు. ప్రజలకు తిండి లేకపోతే, ఆరోగ్యంలేకపోతే, చదువు లేకపోతే, ఉండటానికి ఇల్లులేకపోతే, ప్రయాణించడానికి రవాణా సదుపాయాలు లేకపోతే.... వారందరికీ తిండిపెట్టడం, అందరికీ పని కల్పించడం, అందరికీ చదువు చెప్పించడం, అందరికీ వైద్య సదుపాయాలు కల్పించడం... ఇది దేశం ముందున్న అతి పెద్ద సవాలు. రాజద్రోహం వంటి నల్ల చట్టాలను ఉపయోగించి... మేము భగత్‌సింగ్ సిపాయిలం అయినట్టు... మీరు ఆంగ్లేయులు అయినట్టు.... దేశ ప్రజలతో, నవయువకులతో, విద్యార్థులతో ప్రవర్తిస్తున్నారు. ఒకవేళ మీరు ఆంగ్లేయులు కావాలనుకుంటే... మీరు రాజద్రోహం వంటి నల్ల చట్టాలను ప్రయోగించడానికి సిద్ధపడితే... భగత్‌సింగ్‌లుగా మారడానికి మాకు అభ్యంతరంలేదు. భగత్‌సింగ్‌లు కావడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

రాహుల్ : మిమ్మల్ని మీరు భగత్‌సింగ్ అని వర్ణించుకుంటున్నారు. మీ విరోధులు మిమ్మల్ని అఫ్జల్ సైన్యం అంటున్నారు. మీ ముందు మీ సహచరుల్లో కొందరు దేశ వ్యతిరేక నినాదాలు చేసినప్పుడు జేఎన్‌యూఎస్‌యూ హోదాతో దానిని ఆపడానికి ప్రయత్నించలేదని మీపై ఆరోపణ ఉంది.

కన్నయ్య : ఒక బాధ్యతగల పౌరుడిగా... మన పరిసరాల్లో ఏదైనా తప్పు జరుగుతుంటే... దానిని ఆపడం మన బాధ్యత. అధ్యక్షుడు, యూనియన్ గురించి వదిలేయండి. ఒక మామూలు విద్యార్థిగా నా చుట్టుపక్కల ఏదైనా తప్పు జరుగుతుంటే, నేను దాన్ని ఆపుతాను. పౌరుడిగా ఇది నా ధర్మం. ఈ రోజు అనుపమ్ ఖేర్ మా క్యాంపస్‌కి వచ్చారు. నేను అభిమానించే నటుల్లో ఆయన ఒకరు. క్యాంపస్‌లో ఆయనను అడ్డుకోవాలని కొందరు అన్నారు. జేఎన్‌యూ అంటే ఏమిటో మనం లోకానికి చెప్పాలి. చర్చా సంస్కృతిని జేఎన్‌యూ ఎప్పుడూ ప్రోత్సహిస్తుంది. ప్రజలకు మాట్లాడే అవకాశమిస్తుంది. వారి అభిప్రాయాలను తెలియజేసే అవకాశాన్ని ఇస్తుంది. కానీ, వేరొకరి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అడ్డుకోవడం మన పనికాదని, ఇది మన రాజ్యాంగానికి వ్యతిరేకమని నేను వాళ్ళతో చెప్పాను. మాతో సైద్ధాంతిక విభేదాలు ఉన్నవారు మా యూనివర్సిటీకి వస్తే, మేము వారిని విరోధించబోమని, వారిపట్ల చెడుగా ప్రవర్తించబోమని అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ అధ్యక్షులు చెప్పారు. 'భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ నీరులాంటిది, నీటితో దేన్నయినా పలుచన చేయవచ్చు. కానీ, నీటిని పలుచన చేయలేరు'అని మహాత్మాగాంధీ 1920లో చెప్పారు. దేశాన్ని కాపాడాలంటే అన్నిటికన్నా ముందు దేశ పునాదులను అర్థం చేసుకోవాలి. ప్రపంచంలోని ప్రతి అయిదో వ్యక్తి భారతీయుడు. దేశంలో 55 శాతం మంది నవయువకులే. నవ యువకుల హక్కుల గురించి మాట్లాడటమే దేశభక్తి. రైతుల గురించి మాట్లాడటమే దేశభక్తి. దేశాన్ని మెరుగుపరచాలన్న కల మనకుంటే... లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం... వీటిని కాపాడటానికి మన వద్ద ఉన్న ఉత్తమమైన వస్తువే మన రాజ్యాంగం. కాబట్టి మన నినాదాలు 'జై జవాన్', 'జై కిసాన్', 'జై రాజ్యాంగం' అయ్యివుండాలి. దీనితోనే మనం మన దేశాన్ని కాపాడగలుగుతాం.

**రాహుల్ :** కన్నయ్యా... మీ ముందు ఏదైనా తప్పు జరిగితే దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తానని మీరు చెప్పారు. ఉమర్, అనిర్బన్ ఇంకా మిగిలిన సహచరులను ఆపే ప్రయత్నాన్ని మీరు చేయలేదు. అంటే మీ ముందు జరిగింది తప్పని మీరు అనుకోవడంలేదని అర్థం చేసుకోవచ్చా? 'పాకిస్థాన్ జిందాబాద్', 'గో ఇండియా గో బ్యాక్', 'భారత్‌కి బర్బాదీ తక్ జంగ్ రహేగీ', 'కాశ్మీర్‌కి ఆజాదీ తక్ జంగ్ రహేగీ', 'అఫ్జల్ హమ్ షర్మిందా హై తేరే కాతిల్ జిందాహై', 'తుమ్ కితనే అఫ్జల్ మారోగే.. హర్ ఘర్ సే అఫ్జల్ నిక్‌లేగా...' ఈ నినాదాలు సరైనవని మీరనుకుంటున్నారా?

కన్నయ్య : ఈ నినాదాలను నేను అంగీకరించను. భారత్ లాంటి దేశంలో ఇలాంటి నినాదాల అవసరం లేదని నేను నమ్ముతాను. 'హమ్ క్యా చాహతే హై... ఆజాదీ...,

భూఖ్ మరీసే... ఆజాదీ..., గరీబీసే... ఆజాదీ, మనూవాద్ సే... ఆజాదీ...' లాంటి నినాదాలు భారత్‌లో వినపడాలి. దేశంలో దోపిడీ జరుగుతోంది. ఆ దోపిడీ ఏమిటంటే... విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ) ఉండాలి. కానీ, అందులో 15 శాతం మాత్రమే ఉత్పత్తి రంగంలోకి వెళుతుంది. మిగిలినదంతా సట్టా మార్కెట్లో ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు మారుతోంది. ఈ దేశాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్ళాలంటే మన పునాదులు... వ్యవసాయం, ఉపాధి, విద్య, వైద్యం వంటి రంగాల్లో మనం ప్రవేశించాలి. అందులోంచే ఉపాధి పుట్టుకొస్తుంది. ఈ నవయువకుల భవిష్యత్తు సురక్షితమవుతుంది. అందుకే దేశానికి రాజకీయంగా సరైన నినాదం ఏంటంటే... 'సబ్‌కో శిక్షా - సబ్ కో కామ్... వర్నా హోగీ నీంద్ హరాం' (అందరికీ విద్య - అందరికీ ఉద్యోగం... లేదంటే అలజడే). నేను ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) సభ్యుడిగా చెబుతున్నాను. ఏఐఎస్ఎఫ్ ఆ నినాదాలతో ఏకీభవించదు. జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షుడిగా చెబుతున్నాను. జేఎన్‌యూఎస్‌యూ కూడా ఏనాడూ ఆ నినాదాలతో ఏకీభవించలేదు. ఇక ఆ నినాదాలను ఆపాలన్న దానిపై చెప్పాలంటే... ఒకవేళ నేను అక్కడ ఉండి ఉంటే ఆ నినాదాలను ఆపాల్సిన బాధ్యత నాకు ఉండేది. ఒకవేళ ఉండి ఉంటే... నేను ఆపేవాడిని కూడా. కానీ, నా బాధ్యతను నిర్ణయించినప్పుడు హోం మంత్రి బాధ్యతను కూడా నిర్ణయించండి. ఈ దేశంలో శాంతిభద్రతల సమస్య ఉందంటే... దాని బాధ్యత వైవస్ ఛాన్స్‌లర్‌ది. లోకల్ పోలీసులది. ఆపై ప్రభుత్వానిది, హోం మంత్రిది, ప్రధాన మంత్రిది. ఒక 'బలహీనుడి' భుజాలపై మొత్తం దేశ బాధ్యతను పెట్టేసి, దేశ అభివృద్ధి కలలను చూపిస్తున్న వారిని ఎవరూ ప్రశ్నించడంలేదు.

రాహుల్ : దేశ వ్యతిరేక కార్యక్రమాలు జేఎన్‌యూలో ఫ్యాషనైపోయిందని విశ్వవిద్యాలయంపై ఆరోపణ వచ్చింది. 2010లో దంతేవాడలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను నక్సలైట్లు చంపిన తర్వాత జేఎన్‌యూలో వేడుక జరిగిందని... భారతదేశాన్ని ముక్కలు చేయాలనే మాటలను ఇప్పటి వరకూ వ్యతిరేకించలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

షెహ్లా : ముందుగా... మా ఆందోళనలకు కలిసివచ్చిన వారికి అభినందనలు తెలియజేస్తున్నాను. ఉమర్ ఖాలిద్, అనిర్బన్‌లకు బెయిల్ వచ్చినందుకు మేము చాలా సంతోషంగా ఉన్నాం. సెక్షన్ 124(ఎ) - రాజద్రోహం కేసు వర్తించదని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక మీ ప్రశ్నకు వస్తే... ఏబీవీపీ చేసే కొన్ని నినాదాలను ప్రస్తావిస్తాను.

'ఖూన్‌సే తిలక్ కరేంగే, గోలియోంసే ఆర్తీ' (రక్తంతో బొట్టు పెడతాం... బుల్లెట్లతో హారతి పడతాం), 'జో అఫ్జల్‌కి బాత్ కరేగా...ఓ అఫ్జల్‌కీ మౌత్ మరేగా' (అఫ్జల్ గురించి మాట్లాడేవారు అఫ్జల్‌లాంటి చావు చస్తారు)... అంటే మీరు జస్టిస్ ఏపీ షా ని చంపుతారు, జస్టిస్ మార్కాండేయ కట్జూను చంపుతారు. అన్ని జాతీయ లా యూనివర్సిటీల్లో సదస్సులు జరుగుతాయి. వాటిలో అఫ్జల్ గురు కేసు గురించి, గాడ్సే కేసు గురించి... ఇలా చాలా కేసుల గురించి కేస్ స్టడీలు చేస్తారు. అంటే మీరు ఆ అన్ని జాతీయ యూనివర్సిటీలకూ వెళ్ళి అక్కడి వారిని చంపుతారు. అలాగే మా వద్ద వామపక్ష నినాదమొకటుంది. 'గుజరాత్ రేపిస్టోంకో ఏక్ ధక్కా ఔర్ దో' (గుజరాత్ రేపిస్టులను ఇంకోసారి కొట్టాలి) దానికి జవాబుగా ఏబీవీపీ వారు 'ఏక్ మోకా ఔర్ దో' (మరో అవకాశమివ్వండి) అంటారు. ఇది చాలా జుగుప్సాకరమైన నినాదం. కానీ, వాళ్ళను జైల్లో పెట్టాలని మేమెప్పుడైనా అన్నామా? లేదు. కన్నయ్య కుమార్, సౌరబ్ చెప్పినట్టుగా వారు పేద కుటుంబం నుంచి వచ్చినవారు. నేను మధ్యతరగతికి చెందిన అమ్మాయిని. నేను ఒక చిత్రమైన, అసాధారణమైన స్థానంలో ఇప్పుడున్నాను. ఎందుకంటే ఈ మొత్తం కార్యక్రమం కాశ్మీర్ చుట్టూ తిరుగుతోంది. నేను ఒక కాశ్మీరీని. యూనియన్ ప్రతినిధిని కూడా. కానీ, జేఎన్‌యూలో నేను ఎప్పుడూ వివక్షను ఎదుర్కోలేదు. నన్ను కాశ్మీరీలా చూడరు. ఎలాంటి పక్షపాతం లేకుండా, అత్యధిక ఓట్లతో ఎన్నికయ్యాను. ఇది జేఎన్‌యూ. నన్ను కేవలం రాజకీయ కార్యకర్తలా చూస్తారు. ఈ విధంగా మనం ప్రజలను ఏకం చేయాలి. రాజద్రోహం కేసులు బనాయించి ప్రజలను ఏకం చేయలేరు.

నేను ఒక ముస్లింనని ఎప్పుడూ భావించలేదు. నన్ను నేను ఒక కమ్యూనిస్టుగానే గుర్తిస్తాను. నా ముస్లిం గుర్తింపు ఎప్పుడూ అంత బలంగా లేదు. కానీ, ముస్లింగా ఒకసారి నాకు బాధకలిగింది. దేశంలో 'లవ్ జీహాద్', 'ఘర్ వాపసీ' లాంటి విషయాలు జరుగుతున్నప్పుడు బాధ కలుగుతుంది. దాద్రీ ఘటన నన్ను చాలా బాధించింది. కాశ్మీర్, దేశంలో అంతర్గత భాగమని మనమన్నప్పుడు దానిని ఎలా సాధించాలి? సైనికులు చేసిన అత్యాచారాల గురించి కన్నయ్య చెప్పాడా లేదా అని నిర్ణయించడం గురించి కాదు. దీనిపట్ల సున్నితంగా వ్యవహరించాలని నేను ప్రత్యేకంగా మహిళలను కోరుతున్నాను. సైన్యం మీద విస్తృత ఫిర్యాదులు, ఆరోపణలు ఉన్నాయని కేంద్ర జస్టిస్ వర్మ కమిటీ నివేదిక పేర్కొంది. ఆ కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. జేఎన్‌యూ కాదు. లైంగిక దాడులు జరుగుతున్నాయని, అఫ్‌స్పావల్ల శిక్ష నుంచి తప్పించుకుంటున్నారని ఆ నివేదిక తెలిపింది. ఇది తప్పని నిరూపించాలంటే దర్యాప్తులు జరిగేలా చూడాలి. కానీ, అసలు జరిగేదేంటంటే

సైనిక బలగాల ప్రత్యేక అధికార చట్టంవల్ల అది ఎవ్వరూ చేయలేరు. ఒకవేళ అనుమతి ఉంటే చేయొచ్చు. కానీ, అనుమతి ఎప్పుడూ ఇవ్వలేదు.

నేను కొన్ని ప్రశ్నలు అడగాలనుకుంటున్నాను. సౌరబ్, కన్నయ్య చెప్పినట్టు మేమంతా ఏదో ఒకరకంగా మధ్యతరగతి నుంచి వచ్చినవారమే. దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయంలో చదువుతున్నాము. ఇది ఎలా సాధ్యం? ఈ యూనివర్సిటీలో ప్రత్యేక ప్రగతి శీల ప్రవేశ విధానం ఉంది. మీరు ప్రజాధనంతో నడిచే సంస్థలో చదువుకోవచ్చు.

నిజం చెప్పాలంటే మన దేశంలో జరిగే హింసాత్మక ఘటనలను చూస్తూ నేను పెరిగాను.... కాశ్మీర్‌లో తరచూ ఎన్నికల బహిష్కరణ జరుగుతుంది. అక్కడి ప్రజలు బయటకువెళ్ళి ఓట్లు వేయరు. నాకు ఇంకా గుర్తుంది... 1996లో సైనికులు బూట్లు వేసుకొని మా ఇంటికి వచ్చారు. మా నానమ్మ అక్కడ కూర్చొని ఉంది. 'ఈ ముసలిది ఓటు వేసిందా? లేదా?... ఈ ముసలిదానితో కూడా ఓటు వేయించండి...' అని అప్పుడా సైనికులు దురుసుగా మాట్లాడారు. ఇదంతా చెప్పినందుకు నా మీద కేసులు వేయొచ్చు. కానీ నేను ఇలాంటి హింసాత్మక ఘటనలను చూస్తూ పెరిగాను. దానిని మీరు అబద్ధం చేయలేరు. తర్వాత నేను జేఎన్‌యూకి వచ్చాను. ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నాను. కాశ్మీర్‌లో ఎన్నికలు జరిగినప్పుడల్లా బహిష్కరణకు పిలుపునిస్తారు. జేఎన్‌యూలో నేను ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ఎన్నికల్లో పాల్గనాలని నిర్ణయించుకున్నాను. ఏ సంస్థ నాలో ఈ స్ఫూర్తిని, విశ్వాసాన్ని కలిగించింది...? ఇది ప్రజాస్వామ్య ప్రక్రియ. ఈ ప్రక్రియను ఆర్ఎస్ఎస్ నుంచి కాపాడాల్సిన అవసరం ఉంది. ఆర్ఎస్ఎస్ ఏం చేస్తోంది? ఎఫ్‌టిఐఐలో 35 మంది విద్యార్థుల మీద చార్జిషీటు దాఖలు చేశారు. ఇది అఫ్జల్ గురు గురించి కాదు. నేను 'ఆక్యుపై యూజీసీ' క్యాంపెయిన్ కోసం అలహాబాద్ యూనివర్సిటీకి వెళ్ళాను. అక్కడ జరగాల్సిన సమావేశం హాల్ తాళాలను ఏబీవీపీ వాళ్లు తీసేసుకున్నారు. ఆ కార్యక్రమాన్ని వినడానికి వచ్చిన విద్యార్థులపట్ల హింసాత్మకంగా వ్యవహరించారు. ఆ సమావేశం నిర్వహించింది అఫ్జల్ గురు గురించి కాదు... యాకుబ్ మెమన్ గురించి కాదు... హెచ్‌సీయూలో ఏఎస్ఏ వారు ముజఫర్‌నగర్ బీకీహై సినిమాను ప్రదర్శించాలనుకున్నారు. అక్కడి నుంచి మొదలైన వరుస ఘటనలు ఆఖరుకు రోహిత్ ఆత్మహత్యకు దారితీశాయి. ఏబీవీపీ దానికి అంతరాయం కలిగించాలనుకుంది. జేఎన్‌యూలో కూడా ప్రతిసారీ అంతరాయం కలిగిస్తూనే ఉంది. ఏబీవీపీ ఎప్పటి నుంచో ఉంది. కానీ, ఇప్పుడు వారు అధికారంలో ఉండటంవల్ల... ప్రతీసారీ పోలీసులకు ఫోన్ చేసి ఈ కార్యక్రమం మాకు ఇష్టంలేదని ఫిర్యాదు చేస్తారు. ఈ రోజు డీయూలో, భగత్‌సింగ్‌పై

పరిశోధన చేసిన ఉన్నతమైన, ప్రఖ్యాతిగాంచిన స్కాలర్ ప్రొఫెసర్ చమన్‌లాల్ మాట్లాడుతుండగా... ఏబీవీపీ ఆయనపై దాడి చేసింది. ఆయన అఫ్జల్ గురించి, యాకుబ్ గురించి ఏమీ మాట్లాడలేదు. ఇది ఎందుకు జరుగుతోందో పరిశీలించాలి. ప్రజలను దేశం నుండి నెట్టేయకండి. ఇక నినాదాల గురించి చెప్పాలంటే... 'పాకిస్తాన్ జిందాబాద్' అనే నినాదం జేఎన్‌యూలో ఎప్పుడూ జరగలేదు. ఒకవేళ పాకిస్తాన్‌లో మైనార్టీలకు సమానహక్కులు ఉండి ఉంటే... మహిళలకు సమాన హక్కులు ఉండి ఉంటే... 'పాకిస్తాన్ జిందాబాద్' అనే వారిలో నేను మొట్టమొదటి వ్యక్తినై ఉండేదాన్ని. కానీ, అలాలేదు. అందుకే జేఎన్‌యూలో కూడా ఎవ్వరూ ఆ నినాదం ఇవ్వరు. భారతదేశంలో ఉన్న అసమానత్వం... పాకిస్తాన్‌లో కూడా ఉందని మాకు తెలుసు. మేము ఆ నినాదం ఇవ్వలేదు. 'భారత్‌కీ టుకడే హోంగే...' అనే నినాదాన్ని కొందరు ఇచ్చారు. నేను మొదట్లో అక్కడ ఉన్నాను. కన్నయ్య అప్పుడు లేడు. అలాంటి నినాదాలు చేయొద్దని నేను వారికి సూచించాను. ఒక విషయాన్ని నొక్కి చెప్పాలనుకుంటున్నాను. నినాదాలు చేసింది జేఎన్‌యూ వారు కాదు. ఇంకొక విషయం... జేఎన్‌యూఎస్‌యూ సెన్సార్ బోర్డు కాదు. ఉదాహరణకు ఏబీవీపీ ఎన్నో నినాదాలు చేస్తోంది. అవి వినడానికి బాగోవు. అలాంటి నినాదాలు చేయొద్దని మేము వారికి ఎప్పుడూ చెప్పలేదు. మేము కేవలం సలహా ఇవ్వగలం. ఖండించగలం. కానీ, వారి మీద కేసులు పెట్టం. మా స్నేహితులను జైల్లో చూడాలని మేము అనుకోము. వారు కూడా మాలాంటి విద్యార్థులే.

# 5

# మావి విద్వేష రాజకీయాలు కావు... దేశాన్ని బాగు చేసే రాజకీయాలు!

జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన కన్నయ్య కుమార్ జేఎన్‌యూలో ఉత్తేజభరిత ప్రసంగం ఇచ్చారు. ఆ మరుసటి రోజు జాతీయ ఛానల్ 'ఇండియా టుడే' ప్రతినిధి, ప్రముఖ పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. తన ప్రసంగంలోని కొన్ని అంశా లకు కన్నయ్య మరింత లోతైన వివరణ ఇచ్చారు. పాఠకుల కోరిక మేరకు ఈ ఇంటర్వ్యూలోని కొన్ని భాగాలు ఇవి.

రాజ్‌దీప్ సర్దేశాయ్ : కన్నయ్యా, రాత్రి మీకు నిద్రపట్టిందా? రాత్రి చాలా సేపు మీరు ప్రసంగం చేశారు. ఈ రోజు వార్తాపత్రికలన్నింటిలోనూ ఫ్రంట్ పేజీలో మీరే. ఒక విద్యార్థి సంఘ నాయకుడి నుంచి రాత్రికి రాత్రే మీరొక నాయకుడిగా, స్టార్‌గా, హీరోగా ఎదిగిపోయారు!

కన్నయ్య : అన్నిటికన్నా ముందుగా జేఎన్‌యూ వైపు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ వైపు, ప్రజాస్వామిక విద్యాసంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడేందుకు నిలబడ్డ, నిజాన్ని నిజమని, అబద్ధాన్ని అబద్ధమని ప్రకటించిన విద్యావేత్తలకు, పేదలకు, రైతులకు, విద్యార్థులకు, పౌర సమాజానికీ, ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ మీ ఛానల్ ద్వారా కృతజ్ఞతలు చెబుతున్నాను. మీకూ, మీ మీడియా టీంకూ నా ధన్యవాదాలు.

ఇవి నాయకులిచ్చే ప్రకటనలే! నా ప్రశ్నేంటంటే, జేఎన్‌యూలో మీరిచ్చిన ప్రసంగం తీరు చూస్తే ఒక విద్యార్థి సంఘ నాయకుడు నాయకుడైపోయాడా అని?

నా ఉద్దేశంలో ప్రసంగం చేయడం మాత్రమే నాయకుడు కావడానికి మౌలికాంశం కాదు. ఈ సమాజ స్థితే నాయకుల్ని తయారుచేస్తోంది. నేను నాయకుడిని కావడం లేదు. ఈ సమాజంలో ఉన్న తప్పుల గురించి మాట్లాడుతున్నాను. నేనొక వక్తగా మాట్లాడుతున్నాను. వినేవాళ్లు శ్రోతల్లా వింటున్నారు. నేను వారి వాణికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని వారనుకుంటే నేను నిజంగానే వారికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు. నేను విద్యార్థినే.

**భారత్ నుంచి కాదు, భారత్‌లో ఆజాదీ కావాలని నిన్న మీరన్నారు. ఆజాదీకి ఒక కొత్త నిర్వచనాన్ని మీరు ప్రజల ముందుకు తీసుకొచ్చారు. మీ దృష్టిలో ఆజాదీ అంటే ఏమిటి? దాని గొప్పతనం ఏమిటి?**

ఆజాదీ గురించి మేం చెప్పేది దేశాన్ని విడగొట్టాలని కాదు. దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడుతాం. అదే సమయంలో దేశంలో అన్నిటికన్నా ముఖ్యమైంది దేశ ప్రజలే. వారి సమస్యలు - ఆకలిచావులు, పేదరికం. కులతత్వంలలో దళితులు, మైనార్టీలు నలిగిపోతున్నారు. పురుషాధిక్య సమాజంలో మహిళలు నలిగిపోతున్నారు. దోపిడీ వల్ల అందరూ నలిగిపోతున్నారు. మనుషులను మనుషుల్లాకాక, వారి జాతి, లింగం, భాష, చరిత్ర, హోదాల ఆధారంగా చూడడం నుంచి ఆజాదీ కావాలని మేము చెబుతున్నాం. అందుకే భారత్ నుండి కాదు, భారత్‌లో ఆజాదీ కావాలని నేను అంత గట్టిగా చెప్పాను. మనుషులను ఎక్కువ - తక్కువగా చూస్తూ విడదీయడం నుంచి ఆజాదీ కావాలి. దేశ ప్రజల మౌలిక ప్రశ్నలతో కూడుకున్న సమస్యల నుంచి, ఆకలి చావుల నుంచి, పేదరికం నుంచి ఆజాదీ కావాలి.

**దేశంలో గరీబీ హఠావో (పేదరిక నిర్మూలన)... ఇంక్విలాబ్ జిందాబాద్... అని ఎన్నో ఏండ్ల నుంచి నినాదాలు చేస్తున్నారు. నినాదాల వల్ల సమాజం మారుతుందని మీరనుకుంటున్నారా?**

నేను మీకు నా నినాదాల చారిత్రకతను గురించి మాత్రమే చెప్పాను. మేము కేవలం నినాదాలే చేయము. మేము మా పోరాటంలో, సంఘర్షణలో భాగంగానే నినాదాలు చేస్తాము. మొత్తం ఆందోళనను నినాదాలకే పరిమితం చేయాలనేది సంఘ్ కుట్ర. ఆ కుట్రను వెలుగులోకి తేవడానికే నేను నా నినాదాల అర్థం ప్రజలకు చెప్పాను. జేఎన్‌యూలో దేశద్రోహ నినాదాలిచ్చారని కొంతమంది అంటున్నారు. దానిని నేను ఖండిస్తున్నాను.

**మీరు ఏరకమైన దేశ వ్యతిరేక నినాదాలూ ఇవ్వలేదా? ఏ వీడియోలోనూ లేదని అంటున్నారు. కానీ ప్రత్యక్ష సాక్ష్యులు నినాదాలు చేశారని చెబుతున్నారు. వారు అబద్ధం చెబుతున్నారా?**

నేను ఎటువంటి నినాదాలూ చేయలేదు. వారు నిజం చెబుతున్నారా? అబద్ధం చెబుతున్నారా? అని నిర్ణయించాల్సింది న్యాయస్థానం. నేను దేశ వ్యతిరేక నినాదాలు ఇవ్వలేదు. అలాంటి వాటిని నేను సమర్థించను కూడా.

**మీరు ప్రజాస్వామ్యం గురించి చెప్పారు. 'మీకు మాట్లాడే స్వాతంత్ర్యం ఉంది. కానీ దాంతోపాటు కొన్ని నిబంధనలు ఉన్నాయి, బాధ్యతలున్నాయి. అక్కడ సైనికులు అమరవీరులవుతున్నారు. ఇక్కడ అఫ్జల్ గురు, మక్బూల్ భట్‌ను సమర్థిస్తూ నినాదాలు చేస్తున్నారు' అని మీకు బెయిల్ ఇస్తూ కోర్టు ఉత్తర్వుల్లో న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇదయితే ప్రజాస్వామ్యం కాదు కదా? న్యాయమూర్తి దృష్టిలో ఇది దేశాన్ని విడగొట్టే కుట్ర. రాజద్రోహం.**

విషయం కోర్టు పరిధిలో ఉంది. కోర్టు ఉత్తర్వులను నేను చదివాను. దాని మీద నేను వ్యాఖ్యానించను. ఎందుకంటే నాకు న్యాయ ప్రక్రియమీద నమ్మకం ఉంది. కానీ, మీ ప్రశ్నకు సమాధానం చెబుతాను. ఇది మాట్లాడే హక్కు గురించి కాదు. 'హర్ ఘర్ మే మక్బూల్ పైదా హెూగా' (ప్రతీ ఇంట్లో మక్బూల్ పుడతాడు)- గురించి చెప్పాలంటే, ఈ దేశంలో ఇవాళ యువతకు ఆదర్శంగా ఉన్నది రోహిత్ వేముల. నేను ప్రతీ ఇంట్లో రోహిత్ పుట్టాలని, బాబా సాహెబ్ డాక్టర్ బీం రావ్ అంబేద్కర్ పుట్టాలని అంటాను. వారు ఈ దేశంలో సామాజిక న్యాయం నెలకొల్పుతారు.

**మీ ఉద్దేశంలో యుద్ధాలు జరిపించేవారు సంఘ్ పరివారేకదా! ఎందుకంటే మీ సిద్ధాంతం సంఘ్‌కు వ్యతిరేకం. మీరు నిన్న ప్రసంగంలో కూడా చాలా సార్లు నాగ్‌పూర్ గురిం చి చెప్పారు. మోహన్ భగవత్ గురించి చెప్పారు. మోడీ గురించి చెప్పారు. మీరు వారిని టార్గెట్ చేస్తున్నారు. ఇది వ్యక్తిగత దాడి. అవునా, కాదా?**

నాకు తెలిసినంతవరకూ మేం ఎవరికీ వ్యతిరేకంగా రాజకీయాలు చేయం. సమాజాన్ని మెరుగుపర్చడం కోసం పని చేస్తున్నాం. అలా మెరుగుపర్చడానికి అడ్డుగా ఉన్నవారిని ఉదాహరణగా పేర్కొంటాం. మేము అంబేద్కర్ గురించి మాట్లాడతాం. మోడీ గురించి మాట్లాడాల్సిన అవసరం లేదు. అంబేద్కర్ గురించి మాట్లాడేవారు నిజంగానే అంబేద్కర్‌ను నమ్ముతారా అని స్పష్టం చేయడానికి వారి పేర్లను లేవనెత్తుతాం. మేం సంఘ్‌ను వ్యతిరేకించడం కోసం మాట్లాడడం లేదు, దేశంలో సామాజిక న్యాయాన్ని నెలకొల్పాలని అంటున్నాం.

**వామపక్ష పార్టీల సిద్ధాంతం క్రమంగా బలహీనమవుతోంది. సంఘ్ చెప్పే హిందూత్వ వాదం, జాతీయవాదమే ముందుకు సాగుతోంది. కాబట్టి మీలోనే ఏదో లోటుపాటు ఉందేమో...? మీ సిద్ధాంతంలోనే లోటుపాట్లు ఉండేవుంటాయి కదా?**

నేను ఒక రైతు బిడ్డను. కాబట్టి నేను ఆశావాదిని. రైతు గుప్పెడు ధాన్యాన్ని పొలానికి తీసుకొని వెళతాడు. పొలంలో కష్టపడినప్పుడు ఆ ధాన్యం పంటగా మారుతుంది. దానిని బస్తాల్లో నింపుకొని ఇంటికి తీసుకొస్తాడు. ఈ దేశంలో మీరైనా, నేనైనా... నిజాన్ని నిజమని, అబద్ధాన్ని అబద్ధమని చెప్పేవారెవరైనా నా ఉద్దేశంలో వామపక్షవాదులే. మన దగ్గర ఏ పార్టీ గుర్తింపు కార్డులేకపోయినా, సంఘ్‌కు వ్యతిరేకంగా మాట్లాడే ప్రతీ ఒక్కరూ వామపక్షవాదులే అని నేను నమ్ముతాను.

**మీరు, మీ సంస్థ స్మృతి ఇరానీని టార్గెట్ చేశారు. స్మృతి ఇరానీ జేఎన్‌యూను ఆధీనంలోకి తీసుకోవాలని కుట్ర చేశారంటున్నారు. జేఎన్‌యూను ఆధీనంలోకి తీసుకోవాలన్న కుట్ర జరిగిందని మీరు నిజంగా నమ్ముతున్నారా?**

నిప్పంటించిన వారే... పొగకు కారకులవుతారు. మాన్య స్మృతీ ఇరానీగారు ఈ దేశానికి హెచ్ఆర్‌డీ మంత్రి. వారికీ మాకు సంబంధమేమిటి? ఏంటంటే యూజీసీ వారి ఆధీనంలో ఉంది. యూజీసీ మా ఫెలోషిప్‌ను ఇస్తూ ఉంటే, మేము 'స్మృతీ ఇరానీ ముర్దాబాద్' అని ఎందుకంటాం? మా ఫెలోషిప్‌ను ఆపేశారు. ఒకవేళ రోహిత్ వేముల విషయంలో ఆమె జోక్యం చేసుకొని ఉండకపోతే, సంస్థాగత హత్య జరిగి ఉండకపోతే... స్మృతి ఇరానీ ముర్దాబాద్ అని మేమనం. ఈ దేశంలో గౌరవ ప్రధానమంత్రి మోడీ ఎన్నికల్లో చేసిన వాగ్దానాలన్నీ నెరవేర్చి ఉంటే... ప్రజల ఖాతాలోకి రూ. 15 లక్షలు వచ్చి వుంటే. . రైతులు ఆత్మహత్యలు చేసుకోకపోతే.. ధరలు పెరగకపోతే... పెట్రోల్, డీజిల్ ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గినట్టుగా ఇక్కడ కూడా తగ్గించివుంటే మేము నరేంద్ర మోడీని కూడా విమర్శించం... విభేదించం. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్లనే మేము వారిని వ్యతిరేకిస్తున్నాం. కాబట్టి ఇది ప్రభుత్వ లోటుపాటు.

**దీనికి ప్రత్యామ్నాయం ఏమిటో చెప్పండి. వారిది ప్రజా వ్యతిరేక విధానమని అంటున్నారు. ఒక విద్యార్థి సంఘ నాయకుడు కలల్లోనే బతుకుతున్నాడని నేనంటున్నాను. దేశం మారుతుందన్నది మీ కల.**

దేశం మారుతోంది. ఆ మార్పును సరైన మార్గంలో పెట్టాలి. ఆ శక్తిని దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగం మనకు ప్రత్యామ్నాయం ఇచ్చింది.

ఆ ప్రత్యామ్నాయాన్ని సమాజంలో అమలు చేయాలి. మన దేశంలో లౌకికవాదం, సమానత్వం ఉండాలని రాజ్యాంగం చెబుతోంది. సమానత్వం అంటే ఓట్ల సమానత్వం కాదు. ఒక ధనవంతుడు, ఒక ఫుట్‌పాత్ మీద పనిచేసే వ్యక్తి... ఈ ఇద్దరి ఓటు సమానమైనప్పుడు వారిద్దరి పిల్లలు ఒకే పాఠశాలలో ఎందుకు చదవరనే ప్రశ్న మీద ప్రజలను ఒక్కటి చేయాలి. ఇది ఒక ఆలోచన ఈ ఆలోచనను సరిగ్గా ప్రణాళికా బద్ధం చేయాలి.

**ఇది ఆదర్శవాదం. మీ ప్రసంగం ఎందుకంత 'మ్యాజిక్' చేసిం దంటే అందులో ఆదర్శ వాదముంది. కానీ, వాస్త వమైతే వేరు కదా? స్వాతంత్ర్యం వచ్చి 68 ఏండ్లు గడిచాయి. ఏ మార్పునూ నేను చూడలేదు.**

నేను మార్పును చూడ గలుగుతున్నాను. నేనొక రైతు బిడ్డను. జేఎన్‌యూలో చదువుకోవడానికి వచ్చాను. సమాజాన్ని అర్థం చేసుకొని, ఏది నిజమో... ఏది అబద్ధమో తెలుసుకొని దానివైపు నిలబడాలని నిర్ణయించుకున్నప్పుడు మా వైపు ప్రజలు కూడా నిలబడుతున్నారు. దానికోసం నేను ఎటువంటి ప్రచారం చేయలేదు. నేను కేవలం వారికి కృతజ్ఞతలు చెబుతున్నాను. నా తరపున న్యాయవాదులు కుల్‌శ్రేష్ట్, బృందా గ్రోవర్, కపిల్ సిబల్, సుశీల్ బజాజ్, విక్టర్, బజీందర్, సిద్ధార్థ్ మాది మొత్తం ఒక బృందం ఉంది. నేను వారికి ఏమైనా పేమెంట్ ఇచ్చానా? లేదు. ఈ ఐక్యత నేల మీదే జరుగుతోంది. ఇది ఆదర్శ వాదం కాదు. మీ ఛానల్ మార్కెట్ ప్రయోజనాలకు విరుద్ధంగా జర్నలిస్టు విలువలను కాపాడుతూ నిజం వైపు నిలబడడం నేల మీదే జరుగుతోంది. విదేశాల్లో నోమ్ చామ్‌స్కీ జేఎన్‌యూకు మద్దతుగా నిలబడ్డారు. ఈ దేశ సినీ నిర్మాతలు, కార్టూనిస్టులు, కళాకారులు రోడ్డుపైకి వస్తున్నారు. అనేక క్యాంపస్‌లలో విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు దీనర్థం ఈ ఆదర్శవాదం గాల్లో ఏమీ జరగడం లేదు, నేల మీద కనిపిస్తోంది.

**మీరు రోహిత్ వేముల గురించి చెబుతున్నారు. యాకుబ్ మెమన్‌కు ఉరిపడకూడదని రోహిత్ వేముల వ్యతిరేకించాడని చాలా మంది అంటున్నారు. అతను దేశద్రోహి అని కూడా అన్నారు. ఎఫ్‌టిఐఐలో చూస్తే... వారు నక్సలైట్లు అని ప్రభుత్వం చెబుతోంది. మీ యూనివర్సిటీలో కూడా ఉమర్ ఖాలిద్ మావోయిస్టుల సానుభూతిపరుడని పత్రికల్లో వచ్చింది. దీన్ని మీరు ఎలా చూస్తారు? ఎఫ్‌టిఐఐ అయినా, హెచ్‌సీయూ అయినా, జేఎన్‌యూ అయినా... విద్యార్థులంతా ఐక్యంగా ఉన్నారని నాకు అనిపించడంలేదు.**

ఐక్యతకు భంగం కలిగించేవారు వారి ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. దేశంలో యువకులను, రైతులను ఘర్షణకు ప్రేరేపించాలన్న ప్రయత్నం, దేశ విద్యార్థులను – దేశ

సైనికులను ఘర్షణకు ప్రేరేపించాలన్న ప్రయత్నం... అలాగే విద్యార్థులను కూడా వారిపై కొన్ని సైద్ధాంతిక ముద్రలు వేసి వేరుచేయాలని ప్రయత్నిస్తున్నారు. ఎఫ్‌టిఐఐ విద్యార్థులైనా, హైదరాబాద్‌లో రోహిత్ వేముల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛవైపు నిలబడినా, జేఎన్‌యూలోని వారు దేశంలో అందరికీ ఫెలోషిప్ ఇవ్వాలని పోరాడుతున్నా... ఈ అన్ని పోరాటాలు ఐక్యమవుతున్నాయి. ఈ ఐక్యతను మరింత దృఢపరచాల్సిన అవసరం ఉంది.

**'కన్నయ్యా.. మీ మీద దేశద్రోహం ఆరోపణలు నిర్ధారణ అయ్యాయి. మీరు దేశద్రోహం చేశారు. లేదా జైలులో ఉన్న ఉమర్ ఖాలిద్, అనిర్బన్ మీద దేశద్రోహ ఆరోపణలు నిరూపంచబడ్డాయి' అని రేపు కోర్టు అంటే....?**

నేను మీకు ముందే చెప్పాను. నేను జైలుకు వెళ్ళి వచ్చిన తర్వాత ఈ దేశ న్యాయ ప్రక్రియ మీద నాకు నమ్మకం పెరిగింది. మోడీ గారు 'సత్యమేవ జయతే' అని ట్వీట్ చేసినట్టుగా న్యాయస్థానాల నుంచి కూడా సత్యం బయటకు వస్తుంది. నేను దాని కోసం ఎదురుచూస్తున్నాను.

**ఎంతో మంది యువత మీ ప్రసంగం విని స్ఫూర్తిపొందారు. మీరు ఆ యువతకు ఏం సందేశమిస్తారు?**

నేను కేవలం ఒకే ఒక్క విషయం చెప్పాలనుకుంటున్నాను. ఈ దేశంలో చాలా అవకాశాలున్నాయి. పెద్ద బాధ్యత మన యువత భుజస్కంధాలపై ఉంది. దానిని సాకారం చేయాల్సిన అవసరం ఉంది. అది మనం ఎంత బాగా చేస్తే మనం సమాజాన్ని అంతగా మెరుగుపర్చగలుగుతాం.

**నేను మీ సోదరుడితో మాట్లాడాను. ఆయన చాలా ఆందోళనలో ఉన్నారు. మీరు బయటకొచ్చిన తర్వాత మీ అమ్మతో ఏం మాట్లాడారు?**

నేను మా అమ్మతో ఎప్పుడూ రాజకీయాల గురించి మాట్లాడలేదు. కానీ, మా అమ్మ నాతో చెప్పిన విషయాలను చూస్తే నాకు అనిపించింది. ఈ దేశాన్ని మెరుగుపర్చాలని కలలు కనే యువత వారి తల్లిదండ్రుల గురించి చింతించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మీరు సిద్ధపడుతున్నప్పుడు మీ కుటుంబం కూడా సిద్ధపడుతుంది. నా దృష్టిలో జేఎన్‌యూలో నేను చేసే సంఘర్షణ మా కుటుంబం మా ఊరిలో చేస్తుంది. అందులో మా అమ్మ అందరికన్నా ముందు నిలబడి ఉంది.

6

# దేశాన్ని దోచుకునేవాళ్ళ నుంచి కావాలి ఆజాదీ

జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కన్నయ్యకుమార్ గురువారం జైలు నుంచి విడుదలైన తర్వాత క్యాంపస్‌లో విద్యార్థులనుద్దేశించి చేసిన ప్రసంగం పూర్తి పాఠం ఇది. దేశంలో 'దేశద్రోహం' గురించి జరుగుతున్న చర్చలో ఆయన భావాలను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఇది దోహదపడుతుంది.

సహచరులారా!

ముందుగా జేఎన్‌యూలోని విద్యార్థులకూ, ఉపాధ్యాయులకూ, సెక్యూరిటీ గార్డులకూ, కార్మికులకూ అందరికీ నా విప్లవాభివందనాలు.

స్నేహితులారా! నేనీ వేదిక నుంచి జేఎన్‌యూ విద్యార్థులందరి తరపున, జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షుడిగా దేశ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను. వారికి నా సలాం! ప్రపంచవ్యాప్తంగా జేఎన్‌యూకు మద్దతుగా నిలబడ్డ విద్యావేత్తలకు, విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్నాను. జేఎన్‌యూను రక్షించుకునే పోరాటంతో నిలబడ్డ మీడియావాళ్లకు, పౌర సమాజానికి, రాజకీయ, రాజకీయేతర వ్యక్తులకు, సంస్థలకు నా ధన్యవాదాలు. రోహిత్ వేములకు న్యాయం జరగాలని నిలిచిన వారందరికీ నా లాల్ సలాం.

ఇకపోతే, పార్లమెంటులో కూర్చొని నిజానిజాల్ని నిర్ధారిస్తున్నామని చెప్పే పెద్ద మనుషులకూ, వారి పోలీసులకూ నా ప్రత్యేక ధన్యవాదాలు! కొన్ని మీడియా చానల్స్‌కూ నా ప్రత్యేక ధన్యవాదాలు! జేఎన్‌యూను బద్‌నాం చేయాలనే ఉద్దేశంతోనైనా సరే వారు

మనకు ప్రైమ్‌టైమ్‌లో చోటు కల్పించారు! అయితే ఎవరిపట్లా నాకు ద్వేషభావం లేదు. ప్రత్యేకంగా ఏబీవీపీ పట్లనైతే అసలే లేదు! ఎందుకంటే బయటి ఏబీవీపీ కన్నా, క్యాంపస్‌లోని ఏబీవీపీ హేతుబద్ధమైంది కాబట్టి... మేం నిజమైన ప్రజాస్వామిక వాదులం. మాకు రాజ్యాంగంపై పూర్తి విశ్వాసం ఉంది. అందుకే ఏబీవీపీని శత్రువులుగా కాకుండా, విపక్షంగా చూస్తాం. నిజాల్ని నిజాలుగా, అబద్ధాల్ని అబద్ధాలుగా చెబుతూ జేఎన్‌యూ నిలబడ్డ తీరు అమోఘం! నిజానికి ఇది యాదృచ్ఛికంగా సాగిన ఉద్యమం. వాళ్లది పథకం ప్రకారం చేసిన దాడి కాగా, ఈ పోరాటం యాదృచ్ఛికంగానే మొదలైంది.

మాకు ఈ దేశ రాజ్యాంగంపై, చట్టంపై, న్యాయవ్యవస్థపై భరోసా ఉంది. అంతేకాదు, మార్పు ఒక్కటే సత్యమని మేం నమ్ముతాం. మార్పు తప్పక జరుగుతుంది. మేం మార్పు వైపు నిలబడ్డాం. రాజ్యాంగంలోని పీఠికలో పేర్కొన్న విలువలన్నింటికీ మేం కట్టుబడి ఉన్నాం. సోషలిజం, లౌకికవాదం, సమానత్వం వైపు మేం నిలబడి ఉన్నాం.

నేనీ రోజు ప్రసంగం చేయను. కేవలం నా అనుభవాలను మాత్రమే చెబుతాను. ఇంతకు ముందు ఎక్కువ చదివేవాడిని కానీ వ్యవస్థను ఎదుర్కొన్నది తక్కువ. కానీ ఈసారి తక్కువ చదివాను, వ్యవస్థను ఎక్కువగా ఎదుర్కొన్నాను. జేఎన్‌యూలో విద్యార్థులు ఎక్కువ పరిశోధన చేస్తారు. ఇది పూర్తిగా మౌలిక సమాచారం. ప్రస్తుతం కోర్టు విచారణలో ఉన్న సమస్య గురించి నేనేమీ మాట్లాడను. దేశంలో రాజ్యాంగాన్ని నిజంగా ప్రేమించే, బాబాసాహెబ్ అంబేద్కర్ కలలను నిజం చేయాలని ఆశించే ప్రజలు నా మాటల్లోని భావమేమిటో అర్థం చేసుకోగలుగుతారు.

ప్రధానమంత్రి గారు 'సత్యమేవ జయతే' అని ట్వీట్ చేశారు. అయితే నేనంటాను.. ప్రధానమంత్రి గారూ, మీతో సైద్ధాంతికంగా భారీ విభేదం ఉన్నప్పటికీ, సత్యమేవ జయతే ఈ దేశానిదీ, రాజ్యాంగానిదీ కాబట్టి నేనూ అంటాను 'సత్యమేవ జయతే' అని అంతేకాదు. నిజంగానే సత్యం గెలుస్తుంది.

కొంతమంది విద్యార్థులపై ఒక రాజకీయ అస్త్రంగా రాజద్రోహం ఆరోపణల్ని ఉపయోగించారన్న కోణంలో దీనిని చూడకండి. ఈ విషయం నేనిదివరకు కూడా నా ప్రసంగాల్లో చెప్పాను. నేను గ్రామం నుండి వచ్చిన వ్యక్తిని. నా కుటుంబం ఇప్పుడు మీ అందరికీ పరిచయం అయ్యింది కూడా. మా దగ్గర రైల్వే స్టేషన్ దగ్గర గారడీ

వాళ్లుంటారు. వారు గారడీలు చేస్తూ ఉంగరాలు అమ్ముతారు. ఆ ఉంగరం ఏ కోరికలైనా తీరుస్తుందని వాళ్లు చెబుతారు. దేశంలో కూడా అలాంటి కొందరు విధాన నిర్ణేతలున్నారు. వారు 'నల్లడబ్బు వస్తుంది' అని చెబుతారు. 'హరహర మోడీ', 'ధరలు తగ్గుతాయి', 'భరించింది ఇక చాలు, ఈసారి మమ్మల్ని గెలిపించండి', 'సబ్‌కా సాథ్, సబ్ కా వికాస్' – ఈ మాటలన్నీ ప్రజలకు బాగానే గుర్తున్నాయి. మనం, భారతీయులం త్వరగా మర్చిపోతుంటామనుకోండి. కానీ, ఈసారి నాటకం భారీగా ప్రదర్శించారు కాబట్టి మర్చిపోలేకపోతున్నాం. ఆ మాటలన్నీ మర్చిపోయేలా చేయాలన్నదే వాళ్ల తాపత్రయం. ఎలా మర్చిపోయేలా చేయాలి? దేశంలోని రీసెర్చి ఫెలోలందరికీ ఫెలోషిప్ ఆపేశారు. దాంతో ఫెలోషిప్ ఇవ్వండని వీధుల్లోకొచ్చారు. అప్పుడిక గతంలోలా రూ. 5,000, రూ. 8,000 ఫెలోషిప్‌లనే కొనసాగిస్తామని చెబుతారు. దాంతో ఫెలోషిప్‌లను పెంచాలన్న ప్రతిపాదన గాలికి కొట్టుకుపోయినట్టే. దీనిని ప్రశ్నించేదెవరు? జేఎన్‌యూనే. ఇందుకు మనల్ని నిందిస్తున్నందుకు బాధపడకండి. మన 'కష్ట ఫలితమే' ఇది!

మనం దేశంలోని ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే వారి సైబర్ సెల్ ఏం చేస్తుంది? అది మీకు మార్ఫింగ్ చేసిన వీడియోల్ని పంపిస్తుంది. తిట్లను పంపిస్తుంది. డస్ట్‌బిన్‌లో ఎన్ని కండోమ్స్ ఉన్నాయో లెక్కబెడుతుంది.

ఇది చాలా గంభీరమైన సమయం. మనం కూడా గంభీరంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. జేఎన్‌యూపై జరిగింది పథకం ప్రకారం జరిగిన దాడి. దీన్ని అర్థం చేసుకోండి. ఎందుకంటే 'ఆక్యుపై యూజీసీ' ఉద్యమాన్ని నీరు గార్చాలన్నది వారి ఆలోచన. రోహిత్ వేములకు న్యాయం జరగాలని చేస్తున్న పోరాటాన్ని అడ్డుకోవాలన్నది వారి ఉద్దేశం. మన మాజీ ఆర్‌ఎస్‌ఎస్ ప్రధానమంత్రి గారు రూ. 15 లక్షలు ప్రజల ఎకౌంట్‌లోకి వస్తాయని చెప్పిన విషయాన్ని దేశ ప్రజలు మర్చిపోయేలా చేయాలనుకుంటున్నారు. అయితే, మీకొక విషయం చెప్పాలనుకుంటున్నాను. జేఎన్‌యూలో అడ్మిషన్ పొందడం సులువు కాదు. అట్లాగే జేఎన్‌యూ విద్యార్థులను మర్చిపోవడం కూడా అంత సులువు కాదు. మర్చిపోవాలని మీరనుకున్నా మేము గుర్తు చేస్తూనే ఉంటాం. దేశ పాలకులు అణచివేతకు దిగిన ప్రతిసారీ జేఎన్‌యూ నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వెలువడ్డాయి. దీన్ని మేం పునరావృతం చేస్తాం.

మా పోరాటాన్ని మీరు పలుచన చేయలేరు. దేశ సరిహద్దులో సైనికులు మరణిస్తున్నారని పార్లమెంటులో ఓ బీజేపీ నేత చెప్పారు. సరిహద్దుల్లో చనిపోతున్న వారికి

నా సెల్యూట్. అయితే ఆ నేతను నేనొక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. వాళ్లలో మీ సోదరులెవరైనా ఉన్నారా అని. దేశంలో కోట్ల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారు మన కోసం, మన సైనికుల కోసం ఆహారం పండిస్తున్నారు. ఆత్మహత్య చేసుకుంటున్న రైతుల్లో సైనికుల తండ్రులు కూడా ఉన్నారు. వాళ్ల గురించి చెప్పవెందుకు? పొలాల్లో పంటలు తీస్తున్న వాళ్లు మా తండ్రులే. సైన్యంలో చేరి ప్రాణాలర్పిస్తున్నది మా సోదరులే. కాబట్టి మీరు దీన్ని అడ్డం పెట్టుకొని దేశంలో తప్పుడు చర్చలు చెయ్యకండి. పొలాల్లో చనిపోతున్న వాళ్లూ మా వాళ్లే... సరిహద్దుల్లో చనిపోతున్నదీ మా వాళ్లే. పార్లమెంటులో నిలబడి మీరెవ్వరికి వ్యతిరేకంగా రాజకీయాలు నడుపుతున్నారో చెప్పండి? సరిహద్దుల్లో సైనికుల మరణాలకు బాధ్యత ఎవరిది? పోరాడే వారు బాధ్యులు కాదు. యుద్ధాలు పుట్టించే వాళ్లే బాధ్యులు. సమభావన నెలకొనే వరకు శాంతికి తావు లేదు! కాబట్టి యుద్ధానికి బాధ్యులెవరు? ప్రజల మధ్య ఘర్షణలు ఎగదోస్తున్నదెవరు? మా తండ్రులు ఎలా చనిపోతున్నారు? మా సోదరులు ఎలా చనిపోతున్నారు? ఈ ప్రశ్న నేను ప్రైమ్‌టైమ్‌లో నిరర్థక చర్చలు చేస్తున్న వారిని అడుగుతున్నాను.

ఈ దేశంలో ఎన్నో సమస్యలున్నాయి. ఈ సమస్యల నుండి 'ఆజాదీ' (స్వాతంత్ర్యం) కావాలనడం తప్పా? ఎవరి నుంచి ఆజాదీ కావాలి? భారత్ ఎవరినన్నా బానిసలుగా ఉంచిందా అని వారడుగుతున్నారు. లేదు. అందుకే భారత్ నుంచి ఆజాదీ కాదు, భారత్‌లోనే ఆజాదీ కావాలని మేమడుగుతున్నాం. 'నుంచి', 'లో' లకు మధ్య తేడా ఉంది!

ఇక నా అనుభవాలు కొన్ని చెబుతాను. జైలులో చాలా మంది పోలీసులతో నేను మాట్లాడాను. వాళ్లంతా నా లాంటి వాళ్లే. దేశంలో పోలీసులుగా పనిచేసేదెవ్వరు? రైతుల, కార్మికుల, బలహీన వర్గాల వారి పిల్లలే పోలీసు ఉద్యోగం చేస్తారు. నేను కూడా దేశంలో వెనుకబడిన రాష్ట్రాల్లో ఒకటైన బీహార్ నుంచి వచ్చాను. నాది కూడా పేద కుటుంబమే. రైతు కుటుంబమే నాది. నేను చెబుతున్నది కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఇన్‌స్పెక్టర్ స్థాయి ఉద్యోగుల గురించి మాత్రమే ఐపీఎస్ అధికారులతో సంభాషణ జరగలేదు... జేఎన్‌యూలో మీకు అన్నీ చౌకగా సౌకర్యాలు లభిస్తాయి కదా అని వాళ్లన్నారు. మరి ఇన్నేసి గంటలు పని చేస్తే మీకు ఓవర్‌టైం దొరుకుతుందా అని వాళ్లను అడిగితే లేదన్నారు. దాంతో అవినీతికి పాల్పడక తప్పదని ఒప్పుకున్నారు. అందుకే ఇటువంటి సమస్యలన్నింటి నుంచి 'ఆజాదీ' కావాలని మేమడుగుతున్నామని అతనికి చెప్పాను.

ఈ మధ్య హర్యానాలో ఒక ఆందోళన మొదలైంది. ఢిల్లీ పోలీసుల్లో ఎక్కువ శాతం మంది హర్యానా వారే ఉంటారనేది తెలిసిందే. దీని గురించి అడిగితే కులతత్వం చాలా పెద్దదని ఓ పోలీసు అన్నాడు. అందుకే మరి కులతత్వం నుంచి కూడా ఆజాదీ కావాలని అతనికి చెప్పాను. ఇందులోనైతే తప్పు లేదని, దేశద్రోహం ఏమీ లేదని పోలీసు అన్నాడు. ఈ వ్యవస్థలో అన్నింటికన్నా శక్తిమంతమైంది ఏదని నేను ఆయనను అడిగాను. 'లాఠీ' అని అతను సమాధానమిచ్చాడు. నిజమే, కానీ మీ లాఠీని మీ ఇష్టప్రకారం ఉపయోగించగలరా అని అడిగితే అడ్డంగా తలూపాడు. మరప్పుడు అధికారం ఎక్కడున్నట్టు అని పోలీసుని అడిగితే, నకిలీ ట్వీట్ ఆధారంగా స్టేట్‌మెంట్ ఇచ్చే వ్యక్తికి అని చెప్పాడు. అందుకే నకిలీ ట్వీట్స్ చేసే సంఘీయుల (ఆర్ఎస్ఎస్) నుంచి మాకు ఆజాదీ కావాలని నేను చెప్పాను. నిజం చెప్పాలంటే నువ్వూ నేనూ ఒకటేనని ఇప్పుడనిపిస్తోందని పోలీసు అన్నాడు.

ఇక మీడియా వాళ్ల గురించి... అందరినీ ఒకే గాటన కట్టను నేను. కొందరికి మాత్రం 'అక్కడి' నుంచే వేతనం వస్తుంది. వాళ్లు ఎంత చెడు వాతావరణం సృష్టించారంటే.. ఎఫ్ఐఆర్‌లో నీ పేరు వచ్చినప్పుడు నిన్ను బాగా కొడదామనుకున్నామని ఒక పోలీసు నాతో అన్నాడు. కానీ, నీతో మాట్లాడిన తర్వాత వాళ్ళనే తన్నాలని అనిపిస్తోందని ఆ పోలీసు అన్నాడు. పోలీసు చాలా గంభీరమైన విషయం చెప్పాడు. నేనీ విషయాన్ని మీడియా ద్వారా దేశ ప్రజల దృష్టికి తేవాలనుకుంటున్నాను. పోలీసు నా లాగే ఒక సాధారణ కుటుంబానికి చెందినవాడు. అతను కూడా నాలాగే పీహెచ్‌డీ చేయాలనుకున్నాడు. కానీ, అతనికి జేఎన్‌యూలో చోటు లభించలేదు. నాలాగే దేశంలోని వ్యవస్థను అర్థం చేసుకొని పోరాడాలనుకున్నాడు. అక్షరాస్యుడికీ, చదువుకున్నవాడికీ మధ్య తేడా తెలుసుకోవాలనుకున్నాడు. అది సాధ్యం కాకనే ఇవాళ పోలీసు ఉద్యోగం చేస్తున్నాడు.

ఇక్కడ జేఎన్‌యూ నిలబడివుంది. అందుకే వాళ్లు జేఎన్‌యూ గొంతు నొక్కేయాలనుకుంటున్నారు. బలహీనవర్గాలకు చెందిన వాళ్లెవరూ పీహెచ్‌డీ చేయకూడదనే విద్యారంగాన్ని అమ్మేస్తున్నారు. లక్షలు పోసి పీహెచ్‌డీ చేసే స్థోమత ఒక సాధారణ వ్యక్తికి ఉండదు. అందుకే వాళ్లు జేఎన్‌యూను మూసెయ్యాలని చూస్తున్నారు. ఐక్యం కావాలని ఆశించే గొంతులన్నింటినీ నొక్కెయ్యాలనుకుంటున్నారు. సరిహద్దుల్లో ఉన్నవారైనా, పొలాల్లో

ప్రాణాలను అర్పిస్తున్న వారైనా, లేక జేఎన్‌యూలో ఆజాదీ కోసం పోరాడుతున్నవాళ్లైనా వారి మధ్య ఐక్యత ఏర్పడగూడదనేది వాళ్ల ప్రయత్నం.

రాజకీయ ప్రజాస్వామ్యంతో ఒరిగేదేమీ లేదని, సామాజిక ప్రజాస్వామ్యం కావాలని బాబా సాహెబ్ అన్నారు. అందుకే మేము మళ్లీ మళ్లీ రాజ్యాంగం గురించి మాట్లాడతాం. 'సోషలిజానికి ప్రజాస్వామ్యం అత్యావశ్యకమైంద'ని లెనిన్ అన్నారు. అందుకే మేము ప్రజాస్వామ్యం గురించి, భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి, సమానత్వం గురించి, సోషలిజం గురించి మాట్లాడుతున్నాం. బంట్రోతు కొడుకైనా, రాష్ట్రపతి కొడుకైనా ఒకే పాఠశాలలో చదివే వ్యవస్థ కావాలని మేం చెబుతున్నాం. కానీ మీరు అణచివెయ్యాలనుకుంటున్నారు. సైన్సులో ఏం చెబుతారు? ఎంత అణచివేయాలని ప్రయత్నిస్తే, అంత ఒత్తిడితో పైకి లేస్తుందని. కానీ, వీళ్లకు సైన్సుతో పని లేదుగా.. దోపిడీ, అత్యాచారాల నుండి స్వాతంత్ర్యం... దళితుల, ఆదివాసీల, మహిళల, మైనారిటీల హక్కులను మేం ఇదే రాజ్యాంగం ద్వారా, పార్లమెంటు ద్వారా, ఇదే న్యాయ ప్రక్రియలో సాధించి తీరుతాం. ఇదే బాబా సాహెబ్ కల. ఇదే రోహిత్ కల.

నువ్వు ఒక్క రోహిత్‌ను చంపేశావు. దాని కొనసాగింపుగా నువ్వు అణచివేయాలని చూసిన ఆందోళన ఎంత పెద్దదై, విస్తరించిందో చూడు. మరో విషయం. నా జైలు అనుభవంతో, ఆత్మవిమర్శగా చెబుతున్నా. మనం జేఎన్‌యూ వాళ్లం బాగానే మాట్లాడతాం కానీ, పెద్ద పెద్ద పదాలను ఉపయోగిస్తాం. అవి సాధారణ ప్రజలకు అర్థంకావు. అది వాళ్ల తప్పు కాదు. వాళ్ళు మంచివాళ్లు, నిజాయితీ గలవారు, తెలివైనవారు. మనమే వారి స్థాయికి వెళ్ళి అర్థం చేయించాలి.

నేను మీ కోసం జైలు నుంచి శెనగలు తెచ్చాను. జబ్ తక్ జైల్ మే చనా రహేగా... ఆనా జానా లగా రహేగా (జైలులో శెనగలు ఉన్నంత కాలం మనుషులు రావడం పోవడం సాగుతూనే ఉంటుంది). చాలా కాలం తర్వాత జేఎన్‌యూ విద్యార్థులకు జైలుకు వెళ్లే అవకాశం లభించింది. ఇవ్వాళ ప్రధాన మంత్రిగారు స్టాలిన్, కృశ్చేవ్‌ల గురించి ప్రస్తావించారు. కొంత హిట్లర్ గురించి కూడా మాట్లాడండి అని ఆయనకు చెప్పాలనిపించింది. లేదా ముస్సోలినీ గురించైనా మాట్లాడండి. మీ గురూజీ గోల్వాల్కర్ ఆయనను కలవడానికి వెళ్లారు కదా! భారతీయతకు నిర్వచనాన్ని జర్మనీ నుంచి నేర్చుకోవాలని

ఉపదేశమిచ్చారు. 'మన్ కీ బాత్' (మనసులో మాట) చెబుతారు కానీ వినే అలవాటు లేదుగా మీకు!

ఇవాళ నేను మా అమ్మతో మాట్లాడాను. మూడు నెలల తర్వాత ఆమెతో మాట్లాడాను. జేఎన్‌యూలో ఉన్నప్పుడు నేనెప్పుడూ మాట్లాడేవాడిని కాదు. జైల్లోకి వెళ్ళిన తర్వాత ఇక నుంచి తప్పక మాట్లాడాలని అర్థమైంది. మీరు కూడా మీ ఇంటి వారితో మాట్లాడుతూ ఉండండి. నువ్వు మోడీ మీద మంచి సెటైర్ వేశావని మా అమ్మతో అన్నాను. అయితే ఆమె తాను సెటైర్ వెయ్యలేదని, సెటైర్లు వేయడం వాళ్ల పని అని చెప్పింది. నవ్వడం, నవ్వించడం వాళ్ల పనే. నేను నా బాధను మాత్రమే వ్యక్తం చేశాను. అది అర్థమైన వాళ్లు ఏడుస్తారు, కాని వాళ్లు నవ్వుతారు. ఇది నా బాధ అని ఆమె చెప్పింది. 'మోడీ కూడా ఒక తల్లి కొడుకే. నా కొడుకును దేశద్రోహ ఆరోపణల్లో ఇరికించారు. ఎప్పుడూ మన్ కీ బాత్ చెబుతావుగా, ఈ 'మా కీ బాత్' (అమ్మ మాట) కూడా మాట్లాడు' అని అమ్మ చెప్పింది.

దేశంలో నేడు జరుగుతున్నవి చాలా ప్రమాదకరమైన పరిణామాలు. అందుకే నేను ఏ పార్టీ గురించి గానీ, మీడియా ఛానల్ గురించి గానీ, సైనికుల గురించి గానీ మాట్లాడటంలేదు. నేను దేశం గురించి మాట్లాడుతున్నాను. జేఎన్‌యూ పక్షం వహించిన వారికి మనం సెల్యూట్ చెయ్యాలి. ఎందుకంటే వాళ్లు జేఎన్‌యూలోకి ఎలాంటి వారు వస్తారో అర్థం చేసుకుంటున్నారు. ఇక్కడ 60 శాతం మంది మహిళలు చదువుతున్నారు. ఎన్ని లోపాలున్నప్పటికీ రిజర్వేషన్లు గట్టిగా అమలు చేస్తున్న సంస్థ జేఎన్‌యూనే అని గట్టిగా చెప్పగలను. రిజర్వేషన్లు అమలు చేయని చోట అమలు చేయాలని మేము పోరాడతాం. నా కుటుంబం నెలకు రూ. 3,000లతో గడుస్తుంది. నేను పెద్ద పెద్ద యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేయగలనా? ఇలాంటి జేఎన్‌యూకు మద్దతుగా నిలబడ్డ వారిని కూడా దేశద్రోహులంటున్నారు. సీతారాం ఏచూరీపై కూడా నాతో పాటు దేశద్రోహం కేసు పెట్టారు. రాహుల్‌గాంధీని, డి రాజా. కేజ్రీవాల్‌లను కూడా దేశద్రోహులంటూ కేసులు పెట్టారు. నిజాలు మాట్లాడిన కొందరు మీడియా వారిపై కూడా దేశద్రోహులనే ముద్రలు వేశారు. వారికి తిట్లు, చంపేస్తామని బెదిరింపు సందేశాలు పంపిస్తున్నారు మీరు చెప్పుకునే ఈ దేశభక్తి ఏ రకమైందసలు?

జైల్లో కొంతమంది పోలీసులు నువ్వు నిజంగానే నినాదాలు చేశావా అని అడిగారు. నిజంగానే చేశానని చెప్పాను. మళ్ళీ వెళ్లి అవే నినాదాలు చేస్తావా అని అడిగితే చేస్తానని వారికి చెప్పాను. ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లే అయ్యింది. ఇంకా మూడేండ్లు దీనిని భరించాలి. ఇంత త్వరగా మనం హేతుబద్ధతను వదులుకోకూడదు. దేశంలో 69 శాతం మంది ప్రజలు వారికి వ్యతిరేకంగా ఓటు వేశారు. కేవలం 31 శాతం మంది మాత్రమే, వాళ్లలో కూడా చాలా మంది మాటల గారడీలో కొట్టుకుపోయి ఓట్లేశారు. కొంత మందిని మీరు 'హరహర' అంటూ మోసగించారు, వాళ్లంతా ఇప్పుడు 'అర్‌హార్' (కంది పప్పు)తో బాధలు పడుతున్నారు. అందుకే గెలుపు ఎల్లప్పుడూ మాదే అని అనుకోకండి. వందసార్లు అబద్ధాన్ని చెబితే అది నిజమవుతుందనేది నిజమే కానీ, అబద్ధాన్ని మాత్రమే అలా చెయ్యగలరు. కానీ నిజాన్ని మార్చలేరు. సూర్యుడ్ని వందసార్లు చంద్రుడు చంద్రుడు అని అంటే అది చంద్రుడు అయిపోదు కదా. మీరు అబద్ధాన్ని అబద్ధం చేయగలరు. నిజాన్ని అబద్ధం చేయలేరు.

వీళ్లసలు పార్లమెంటు బైట చేస్తున్నదంతా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలే. ప్రజల మౌలిక సమస్యలను గాలికొదిలేసే ఎత్తుగడలే. ఇక్కడ 'ఆక్యుపై యూజీసీ' జరుగుతుండగానే, అటు రోహిత్‌ను హత్య చేశారు. మనం రోహిత్‌కు న్యాయం జరగాలని ఉద్యమం మొదలు పెట్టగానే జేఎన్‌యూలో దేశద్రోహం జరిగిపోతోందంటూ ఇల్లెక్కి గోల చేశారు. ఇది కూడా ఎక్కువ రోజులు నడవదు. వీళ్ల తర్వాతి ప్రయత్నం రామమందిర నిర్మాణం. ఇవ్వాళ విడుదలయ్యే ముందు ఒక పోలీసుతో మాట్లాడాను. మతాన్ని పాటిస్తావా అని ఆయన నన్నడిగాడు. మతం గురించి నాకు తెలియనే తెలియదన్నాను ఏ కుటుంబంలో పుట్టావని అడిగితే యాదృచ్ఛికంగా హిందూ కుటుంబంలో పుట్టానని చెప్పాను. మరేమైనా నీకు తెలుసా అని అడిగాడు. నాకున్న సమాచారం ప్రకారం సృష్టికి మూలం భగవానుడని, అణువణువులోనూ దేవుడుంటాడని తెలుసన్నాను. మీరేమంటారని అతన్ని అడిగితే ఇది పూర్తిగా నిజమన్నాడు. మరి కొంత మంది భగవంతుడి కోసం ఏదో సృష్టించాలనుకుంటున్నారు, దీనిపై మీ అభిప్రాయం ఏమిటని అతన్ని అడిగాను. ఇది మూర్ఖపు ఆలోచన అని ఆ పోలీసు అన్నాడు. ఒకనాడు 80 నుంచి 180 సీట్లు గెల్చుకున్నారు కావచ్చు. నోటితో రాముడి భజన, చేతుల్లో కత్తులతో కథ నడిపించారు కావచ్చు. ఇక ముందు మాత్రం ఇది నడవదు.

దేశంలో ఉన్న మౌలిక ప్రశ్నలపై చర్చ జరగగూడదనేది వీళ్ల కుతంత్రం. ఈ రోజు మనపై పెద్ద దాడే జరిగింది. కానీ ఇది ఈరోజే మొదలైన దాడి కాదు. ఆర్ఎస్ఎస్ పత్రిక 'ఆర్గనైజర్' జేఎన్‌యూ గురించి ఒక కవర్ స్టోరీ ప్రచురించింది. జేఎన్‌యూ విషయంలో (సుబ్రమణ్యం) స్వామీజీ ప్రకటన కూడా వచ్చింది. నాకు ప్రజాస్వామ్యంలో పూర్తి నమ్మకం ఉంది. ఇక్కడెవరైనా ఏబీవీపీ మిత్రులుంటే ఒకసారి స్వామీజీని తీసుకురండి, ముఖాముఖి చర్చించుకుందాం. ఒకవేళ ఆయన జేఎన్‌యూను నాలుగు నెలల పాటు మూసెయ్యాలని తర్కబద్ధంగా (కుతర్కంతో కాదు) నిరూపించగలిగితే ఆయన మాటకు నేను కట్టుబడి ఉంటా. ఆయన ఆ పని చెయ్యలేకపోతే ఇదివరకు విదేశాల్లో ఉన్నట్టుగా మళ్లీ దేశం వదిలేసి వెళ్లిపొమ్మని నేనాయనకు విజ్ఞప్తి చేస్తా. హిందూత్వ శక్తులకు కనీసమైన తెలివి తేటలు కూడా లేవు. హిందూ సేన ఉపయోగించే పోస్టర్లు, కరపత్రాలనే ఏబీవీపీ ఉపయోగిస్తుంది. అవే డిమాండ్లతో 'మాజీ సైనికులు' మార్చింగ్ చేస్తారు. దీనిలో మతలబు ఏమిటంటే అన్నింటి కార్యక్రమం నాగపూర్‌లో నిర్ణయమవుతోంది! ఇవేవీ యాదృచ్ఛికంగా జరిగిన కార్యక్రమాలు కావు సహచరులారా! ఇవన్నీ పథకం ప్రకారమే జరిగాయి.

దేశంలో జరుగుతున్న పోరాటాలను అణచివెయ్యాలనేది వారి లక్ష్యం. ప్రజల దైనందిన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలనేది వారి కుట్ర. ఈ క్యాంపస్‌లో పోరాడుతున్న వాళ్లు అనిర్బన్ కావచ్చు, ఉమర్ కావచ్చు, అనంత్ కావచ్చు, ఆశుతోష్ కావచ్చు, లేదా మీ అందరిలో ఎవరైనా కావచ్చు.. వారిపై దేశద్రోహులని ముద్ర వేసి జేఎన్‌యూ గొంతు నొక్కాలనేదే వారి కుట్ర, జేఎన్‌యూను అపఖ్యాతి పాలు చేయడం, ఈ పోరాటాన్ని అంతం చేయడం వాళ్ల లక్ష్యం. కానీ మీరీ పోరాటాన్ని అణచివెయ్యలేరు. మీరెంత అణచివేయాలనుకుంటే మేమంతే బలంగా పైకి లేస్తాం. ఇది సుదీర్ఘమైన పోరాటం. ఆగకుండా, తలవంచకుండా, అలుపు లేకుండా ఈ పోరాటాన్ని మనం ముందుకు తీసుకెళ్లాలి. ఈ క్యాంపస్‌ను చీలదీయాలనుకుంటున్న శక్తులు - క్యాంపస్‌లోని ఏబీవీపీ వాళ్లు కానీ, బైట ఆర్ఎస్ఎస్ వాళ్లు కానీ - దేశాన్ని నాశనం చేయాలనుకుంటున్నారు. వాళ్లకు వ్యతిరేకంగా మనం సమైక్యంగా నిలబడాలి. జేఎన్‌యూ దృఢంగా నిలబడుతుంది. చరిత్ర సృష్టిస్తుంది. 'ఆక్యుపై యూజీసీ' ఉద్యమం సందర్భంగా మొదలైన ఈ పోరాటం, రోహిత్ వేముల ప్రారంభించిన ఈ పోరాటం, మీరందరూ ప్రారంభించిన ఈ పోరాటం, దేశంలోని శాంతికాముకులు, ప్రగతిశీల శక్తులు మొదలు పెట్టిన ఈ పోరాటం... దీన్ని



సుందరయ్య గ్రంథాలయం ACC No. ..............

కొనసాగిద్దాం. ఇందులో గెలుపు సాధిద్దాం. ఇది మనందరి విశ్వాసం. ఈ పోరాటంలో పాల్గన్న మీ అందరికీ మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తూ, ఇట్లాగే నిలబడాలని కోరుతూ ముగిస్తున్నా. ఇంక్విలాబ్ జిందాబాద్!

ఆవాజ్ దో............... హమ్ ఏక్‌హై .................
లడేంగే............... జీతేంగే .................
తో హమ్ క్యా చాహ్‌తే.... ఆజాదీ....
అరె జోర్ సే బోలో.... ఆజాదీ...
యే సంఘ్‌వాద్‌సే.... ఆజాదీ...
యే మనూవాద్ సే.... ఆజాదీ...
తుమ్ కుఛ్ భీ కర్లో.... ఆజాదీ...
హమ్ లేకె రహేంగే.... ఆజాదీ...
హై హక్ హమారీ... ఆజాదీ....
హై జాన్‌సే ప్యారీ.... ఆజాదీ...
హై ప్యారీ... ప్యారీ... ఆజాదీ...
జో హో కహనే కీ... ఆజాదీ...
జో నా కహనే కీ... ఆజాదీ...

# 7

# దేశాన్ని నాశనం చేస్తున్నది ఆర్ఎస్ఎస్, బీజేపీలే!

మార్చి 18న మధ్యంతర బెయిల్‌పై విడుదలైన తర్వాత జేఎన్‌యూ విద్యార్థి నేత ఉమర్ ఖాలిద్ చేసిన ప్రసంగం పూర్తి పాఠం ఇది. ఇందులో ఆయన విద్యార్థులపై జరుగుతున్న దాడుల నేపథ్యాన్ని వివరించడంతో పాటు సంఘ్ పరివార్ వాదనలను, ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టారు. దేశంలో జాతీయవాదం, దేశభక్తి వంటి భావనలపై జరుగుతున్న చర్చలో ఇది అవసరంగా భావించి ప్రచురిస్తున్నాం.

మిత్రులారా! ఈ భావోద్వేగాన్ని ఎలా మాటల్లోకి మార్చాలో నాకర్థం కావడం లేదు! గత నెల పదిహేను రోజులుగా వేగంగా జరిగిపోయిన సంఘటనలను ఒక క్రమంలో అర్థం చేసుకోవడానికి నేనింకా ప్రయత్నిస్తూనే ఉన్నాను. అయితే ఒక్క విషయం మాత్రం స్పష్టంగా చెప్పగలను. మనలో కొద్ది మందిపై నేరారోపణలు చేసి, వారిని వెంటాడి వేధించడం ద్వారా మనల్ని దెబ్బతీయొచ్చని, మన ఉద్యమాన్ని అణచివెయ్యొచ్చని, ఐక్యతను దెబ్బతీయొచ్చని, అంతకన్నా ముఖ్యంగా మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయొచ్చని ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ కన్న కలలు మాత్రం కల్లలుగానే మిగిలిపోయాయి. చాలా రోజుల తర్వాత మీ సమక్షంలో నిలబడ్డ నేను మునుపటికన్నా దృఢంగా ఉన్నట్టుగా భావిస్తున్నాను. ఇది మన ఉద్యమం సాధించిన విజయం.

మిత్రులారా! మమ్మల్ని సెక్షన్ 124ఏ కింద జైలులో పెట్టారు. ఇంగ్లీషులో దీన్ని సెడిషన్ అంటారు. అయితే ఇందుకు మేమేమీ బాధ లేదా సిగ్గు పడడం లేదని వాళ్లకు చెప్పాలనుకుంటున్నాను. నిజానికి ఎందరో స్వాతంత్ర్య సమరయోధులపై, ఆ తర్వాత అధికారాన్ని ప్రశ్నించిన చాలా మందిపై మోపిన ఆరోపణలను మాపై మోపినందుకు గర్వంగా ఉంది. ప్రజా ఉద్యమాలతో కలిసి నడిచిన బినాయక్ సేన్, అరుంధతీరాయ్,

ప్రొఫెసర్ షేక్ షౌకత్ వంటి వారి గొప్ప వాళ్ల సరసన మా పేర్లు నమోదైనందుకు మాకు గర్వంగా అనిపిస్తోంది. సెడిషన్ అంటే అర్థం 'దేశద్రోహం' కాదు, 'రాజద్రోహం' అని అధ్యక్షుడు కామ్రేడ్ కన్నయ్య చాలా బాగా చెప్పారు. నేడున్న ఫాసిస్టు రాజ్యానికి, ప్రజావ్యతిరేక రాజ్యానికి.. దళిత వ్యతిరేక, ఆదివాసీ వ్యతిరేక, మైనారిటీ వ్యతిరేక, మహిళా వ్యతిరేక, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, మానవత్వ వ్యతిరేక రాజ్యంపై మా పోరాటం కొనసాగుతుందని గొంతెత్తి చెప్పాలనుకుంటున్నా. ఇందుకోసం 1860 నాటి చట్టాన్ని ఉపయోగించారు. అంటే మమ్మల్ని జైల్లో వేయడానికి ఈ సోకాల్డ్ జాతీయవాదులు ఆంగ్లేయుల వద్దకు వెళ్లక తప్పలేదు! ఆనాడే భగత్‌సింగ్ నల్ల ఆంగ్లేయులుగా పేర్కొన్నది బహుశా వీళ్ల గురించే అయ్యుండాలి!

మేం కొద్ది రోజులు జైల్లో ఉన్నందుకు మాకెలాంటి బాధా, సిగ్గూ లేవు. అసలైన నేరస్థులు నేడు అధికారంలో ఉన్నారు. అధికారాన్ని వ్యతిరేకిస్తున్న వాళ్లు జైళ్లల్లో ఉన్నారు. జైళ్లల్లో ఉన్న ప్రజలెవ్వరో పరిశీలించండి. మారుతి ఉద్యోగులైతే యూనియన్ పెట్టుకుంటామని అన్నందుకు, ఛత్తీస్‌గఢ్ లేదా ఝార్ఖండ్‌కు చెందిన ఆదివాసులైతే జల్-జంగల్-జమీన్ గురించి మాట్లాడినందుకు, దళితులైతే రణవీర్‌సేనకు వ్యతిరేకంగా నిలబడ్డందుకు జైల్లో పెడతారు. ఇక ముస్లింలైతే జైల్లో వేయడానికి వేరే కారణం ఏదీ అవసరం లేదు. వీళ్ల పక్షాన నిలబడ్డ పౌరహక్కుల సంఘాల వాళ్లను కూడా జైళ్లలో వేస్తారు. అట్లాగే మమ్మల్ని కూడా కొద్ది రోజులు జైల్లో వేశారు. ఇప్పుడు బైటికి వచ్చేశాం కనుక అధికారాన్ని వ్యతిరేకిస్తూ జైలు పాలైన వారందరి పోరాటాన్ని ఇక మనం కొనసాగిద్దాం.

దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛ ప్రమాదంలో ఉందని మనం అంటున్నాం. అయితే ఇది పూర్తిగా నిజం కాదు. మీరు అధికారానికి ఏ వైపున్నారనే దానిపై ఆధారపడి మీకు భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుంది. ఒకవేళ మీరు ప్రభుత్వానికి అనుకూలమైతే, మోడీ, తొగడియా, యోగీ ఆదిత్యనాథ్ వంటి వారి కోవకు చెందిన ఛోటా మోటా నేతలందరికీ భావ ప్రకటన స్వేచ్ఛ కావాల్సినంత ఉంటుంది. ప్రజాస్వామిక హక్కుల, పౌర హక్కుల కార్యకర్తలను స్టెన్‌గన్‌తో కాల్చి చంపాలని బాలా సాహెబ్ ఠాక్రే బాహాటంగా అన్నాడు. ముస్లింలను చంపెయ్యాలన్నాడు. ఆయనపై రాజద్రోహం సంగతి అటుంచి, చిన్న కేసైనా పెట్టలేదు.

నెల పదిహేను రోజుల నుంచి జరుగుతున్న సంఘటనలను అర్థం చేసుకోవడానికి నేను జైలులో ఉన్నప్పుడు బాగా ప్రయత్నించాను. మేమేమైనా తప్పు చేశామా అని చాలా

సార్లు ఆలోచించాను. 9, 10, 11 తేదీల్లో ఏం జరిగిందో ఆలోచించాను. నాకొక సినిమా గుర్తుకొచ్చింది. 1973లో చిలీలో జరిగిన ఫినోషెట్ 'సైనిక కుట్ర' ఆధారంగా రూపొందిన 'మిస్సింగ్ కోస్తా గాగ్రాస్' సినిమాలోని ఒక సంభాషణ గుర్తుకొచ్చింది. ఆ సమయంలో చిలీలో ఉన్న ఒక అమెరికన్ వ్యక్తి కుమారుడు అదృశ్యమవుతాడు. ఆయన 'నా కొడుకు ఏమీ చెయ్యలేదు కదా అతణ్నెందుకు మాయం చేశార'ని ఒక చిలీ దేశస్థుణ్ని అడుగుతాడు. ఆ వ్యక్తి ఇలా జవాబిస్తాడు, 'మీ అమెరికన్లతో ఇదే చిక్కు. జైలుకు పోవాలంటే ఏదైనా చేసి ఉండాలని అనుకుంటారు'. సరిగ్గా నేడు మన దేశం పరిస్థితి కూడా ఇలాగే తయారైంది.

నేను జైషే మహ్మద్‌కు చెందిన వాడినని మొదట నా గురించి ప్రచారం చేశారు. అది ఎక్కువ రోజులు సాగలేదు కానీ ప్రజల మనస్సుల్లో ఒక ముద్రనైతే వేసింది. అయితే ఈ మీడియా విచారణ, ప్రొఫైలింగ్ ఫిబ్రవరి 23న మేం సరెండర్ అయిన తర్వాత కూడా కొనసాగడం విచిత్రం! రోజుకో కొత్త కథనం సృష్టించసాగారు. ఉదాహరణకు 21న మేం జేఎన్‌యూకి తిరిగొచ్చిన తర్వాత 23న 'హిందూస్తాన్' అనే పత్రికలో 'ఉమర్ ఖాలిద్ ఛత్తీస్‌గఢ్–ఒడిషా సరిహద్దు అడవుల్లో నక్సలైట్లతో ఉన్నాడు' అని రాశారు. ఆ సమయంలో నేను అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వద్ద కూర్చుని ఉన్నాను. అట్లాగే, ఒకరోజు ఒక పోలీసు అధికారి తన ఫోన్లో ఒక ఫోటో చూపించాడు. అందులో నాతో పాటు జేఎన్‌యూకు చెందిన ఒక విద్యార్థి ఉన్నాడు. 'ఇది ఐబీ నుంచి వచ్చింది. నీకు నక్సలైట్లతో సంబంధాలున్నాయనడానికి ఇదే రుజువు' అని ఆ అధికారి అన్నాడు. ఇది తప్పని నేనాయనకు చెప్పాను. మొదటి విషయం మీరు చూపిస్తున్న వ్యక్తి నక్సలైటు కాదు, జేఎన్‌యూ విద్యార్థి అని చెప్పాను. రెండో విషయం ఇది నా ఫేస్‌బుక్ పేజీలోంచి తీసుకున్న ఫోటోనే. ఐబీ అంటే ఇంటలిజెన్స్ బ్యూరో. కానీ వాళ్ల ఇంటలిజెన్స్ ఎంతో అర్థం చేసుకోవచ్చు.

ఇక ఈ మొత్తం వ్యవహారంలో మీడియా పోషించిన పాత్ర ప్రత్యేకించి చెప్పుకోదగినది. మీడియా స్వతంత్రంగా పని చేసిందని నేననుకోను. మీడియాలో ఒక వర్గానికి ఏం ప్రసారం చెయ్యాలనే విషయంలో కచ్చితమైన నిర్దేశాలున్నాయని నా నమ్మకం. ఈ నమ్మకానికి ఆధారాలున్నాయి. చాలా కేసుల్లో ఇలాగే జరిగింది. మీడియా ఒక అభిప్రాయాన్ని సృష్టిస్తుంది. పోలీసులు విచారణ జరిపించి ఆ తర్వాత మీడియాకు సమాచారం ఇస్తారని సాధారణంగా ఎవరైనా అనుకుంటారు. కానీ జరుగుతున్నది ఇందుకు పూర్తిగా విరుద్ధం. మీడియా విచారణ జరిపిస్తుంది. తర్వాత పోలీసులకు సమాచారం ఇస్తుంది. దాని ఆధారంగా పోలీసులు ఇంటరాగేషన్ చేస్తారు. తర్వాత విచారణ చేపడతారు!

ఇంతకు ముందు నేనిక్కడ మాట్లాడినప్పుడు ఒక మాటన్నాను. గత ఏడేండ్లలో నన్ను నేను ఎప్పుడూ ఒక ముస్లింగా భావించలేదని చెప్పాను. కానీ మీడియాలో నన్నొక ఇస్లామిక్ టెర్రరిస్టుగా చూపించారు. పోలీసు అధికారులతో విడిగా జరిగిన సంభాషణలను బట్టి ఈ విచారణ కొద్ది మంది వ్యక్తులపైననో, జేఎన్‌యూ పైననో కాదు, మొత్తం ముస్లిం సముదాయంపై జరుగుతున్న విచారణలా అనిపించింది. మాజీ రాష్ట్రపతి అబుల్ కలాం వంటి వారిని ఉదాహరణలుగా పేర్కొంటూ నన్ను దేశభక్తి గల ముస్లింగా రుజువు చేసుకోవాలని అడిగారు. అప్పుడు ఆలోచిస్తే, నేను మతాన్ని ఆచరిస్తున్న ముస్లింను కానంటూ ఇప్పటి దాకా చేసుకుంటున్న డిఫెన్స్ ఎదుటి పక్షానికే ఉపయోగపడుతోందని అనిపించింది. నేను మతాన్ని ఆచరించే ముస్లింను అయితే మాత్రం ఏమిటి? నేను ఆజంగఢ్ నుంచి వచ్చిన వాడినైతే ఏమిటి? నేను మదర్సాలో చదువుకున్న వాడినే అయితే ఏమిటి సమస్య? నేను తలపై టోపీ పెట్టుకొని గడ్డం పెంచుకున్న వాడినే అయితే ఏమిటి సమస్య? ఇవన్నీ కలిగి ఉంటే కూడా నన్ను నేను దేశభక్తుడిగా రుజువు చేసుకోవాల్సిన అవసరమేమిటసలు? నేను డిగ్రీ చదివేటప్పుడు 'రిలక్టంట్ ఫండమెంటలిస్ట్' అనే నవల చదివాను. ఆ నవలలో పాత్ర లాగే నాక్కూడా గడ్డం పెంచుకొని, టోపీ పెట్టుకొని మీరీ ప్రశ్నలడగానికి వీల్లేదు అనాలపించింది.

మేం జైలులో పోలీసుల భాషలో 'ఖాలిద్ సాబ్, భట్టాచార్య జీ'లం! నేనైతే సరే, నా పుట్టుక మూలంగానే నేను (నేను మరో రకంగా రుజువు చేస్తే తప్ప) ద్రోహిని! కానీ అనిర్బాన్ మాత్రం మూడు రెట్లు ద్రోహి! ఆయన ఒక్క దేశానికే కాదు, తన మతానిక్కీ, కులానికీ కూడా ద్రోహం చేసిన వాడు! ఒకసారి ఒక పోలీసు అధికారి అనిర్బాన్‌ను ఒక మూలకు తీసుకెళ్లి, నాకేమీ తెలియదు ఖాలిదే నన్ను ప్రేరేపించాడని చెప్పమని అన్నాడు.

అసలు ఇదంతా ఎందుకు జరిగింది? ఇది ముఖ్యమైన ప్రశ్న. ఫిబ్రవరి 9న లేదా 10న ఏదో జరిగినందువల్లనే ఇది జరిగిందా? మీలో ఏ ఒక్కరికీ దీనిపై ఎలాంటి భ్రమలు లేవని నేననుకుంటున్నాను. సరిగ్గా చెప్పాలంటే, మనమంతా ఆలోచించే వ్యక్తులం కనుకనే మనపై ఈ దాడి! నేను ఈరోజే న్యూస్ ఎక్స్ చానల్‌లో చూశాను. (జైలులో జీన్యూస్ వచ్చేది కాదు. చాలా మంచిదైంది. మా మానసిక పరిస్థితి నిలకడగా ఉండడానికి చాలా సహాయపడింది.). నిజానికి ఇవి న్యూస్ చానల్స్ కావు. ఇవి థ్రిల్లర్స్ చూపించే ఎంటర్‌టైన్‌మెంట్ చానెళ్లు. ఆ తర్వాత ఇది జరిగింది. దీని తర్వాత అది జరిగిందన్నట్టుగా వీళ్ల కథనాలు సాగుతాయి. ఈరోజే ఒక దినపత్రికలో చదివాను – ప్రేమికురాలి ఒత్తిడి

వల్లనే ఖాలిద్ సరెండర్ అయ్యాడు అని రాశారు. మధ్యతరగతి వినియోగదారులు ఇలాంటి థ్రిల్లర్ కథనాల్ని కోరుకుంటారు. దాన్ని సంగీతంతో, మసాలా జోడించి ప్రెజెంట్ చేస్తారు.

మళ్లీ ఇందాకటి విషయానికొస్తాను. మనం ఏ విషయాన్నీ ఉన్నదున్నట్టుగా తీసుకోం. ప్రతి విషయంపైనా మనం తర్కిస్తాం, ప్రశ్నిస్తాం, వాదిస్తాం, విభేదిస్తాం... ఎందుకంటే మనమంతా జేఎన్‌యూ. మమ్మల్ని జైళ్లో పెట్టడానికి ఇదే కారణం. ఈ కారణంతోనే మాపై కేసులు పెట్టారు. దీని పట్ల మేం గర్వపడుతున్నాం. జర్మనీలో దాదాపు ఇటువంటి పరిస్థితులే ఉన్నప్పుడు బ్రెఖ్త్ ఒక కవిత రాశాడు.... "ఓ జనరల్! నీ ట్యాంకు చాలా శక్తిమంతమైన వాహనమే. అది ఎగురగలుగుతుంది, మనుషుల్ని చంపగలుగుతుంది. అయితే దాని నిర్మాణంలో ఒక లోపం ఉంది. దానికో డ్రైవర్ కావాల్సి ఉంటుంది. దానికో మనిషి కావాల్సి ఉంటుంది. మనుషుల్లో కూడా ఒక లోపం ఉంది. వాళ్లు ఆలోచిస్తారు!" అవును, మనలో కూడా ఈ 'లోపం' ఉంది! కొందరు దీనిని 'ఇన్‌ఫెక్షన్', 'రోగం' అని కూడా అభివర్ణిస్తున్నారు! నిజానికిది మనకున్న అతి పెద్ద బలం ఇదే! జేఎన్‌యూలో పాలిమిక్స్ (రాజకీయ వాదనలు) ఒక సంప్రదాయంగా ఉంది. ప్రతి సంస్థలోనూ పాలిమిక్స్ జరుగుతాయి. ఈ సందర్భంగా మాపై బలవంతంగా రుద్దిన కొన్ని అభిప్రాయాలకు ఈ వేదిక నుంచి జవాబివ్వాలని భావిస్తున్నాను.

ఈ రోజే 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ఒక వ్యాసం చదివాను. మన దేశంలో లాన్స్ నాయక్ హనుమంతప్ప వంటి వీరులు ఒకవైపుంటే, మరో వైపు ఉమర్, కన్నయ్య, అనిర్బాన్ వంటి వాళ్లు కూడా ఉన్నారు. వీళ్లను జైళ్లో వేయాలి అని రాశారు. మరి కొందరైతే వీళ్లను ఉరి తీయాలని కూడా అన్నారు. కన్నయ్య ఈ విషయాన్ని చాలా చక్కగా చెప్పారు. ఇందులో మరొక్క విషయం జోడిస్తాను. సైనికులు పని చేసే ప్రాంతాలు, చేసే యుద్ధాలకు సంబంధించిన నిర్ణయాలు అసలు సైనికులు తీసుకుంటారా? యుద్ధాలకు సంబంధించిన నిర్ణయాలు అధికారంలో ఉన్న కొద్ది మంది చేస్తారు. నేను కేవలం మన దేశం విషయం చెప్పడం లేదు. ప్రపంచ చరిత్ర గురించి మాట్లాడుతున్నాను. పాలకులు తమ రాజకీయ, ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాల కోసమే యుద్ధాలకు సంబంధించిన నిర్ణయాలు చేస్తారు. ఆ యుద్ధాల్లో సైనికులను బలిపశువుల్ని చేస్తారు. చరిత్రలో మనం చదువుకున్నాం. రెండు ప్రపంచయుద్ధాల్లో దేశదేశాల్లో కోట్లాది మంది చనిపోయారు. అని చోట్లా జాతీయవాదం, దేశభక్తి పేరుతోనే వారితో యుద్ధాలు చేయించారు. యుద్ధాలతో ఎవరికీ ఉపాధి దొరకలేదు, తిండీ దొరకలేదు. కొన్ని బడా కంపెనీలు మాత్రమే లాభాలు దండుకోగలిగాయి. 60 ఏండ్ల క్రితం కూడా ఇదే నిజం. నేటికీ ఇదే నిజం.

కొన్నేండ్ల క్రితం ప్రత్యేక ఆర్థిక మండళ్లు అనే చట్టం వచ్చింది. ఈ మండళ్లలో విదేశీ కంపెనీలు మన దేశంలో మన దేశ కార్మిక చట్టాలు కూడా వర్తించకుండా చేసింది మన దేశభక్తులే! వీళ్లే ఆదివాసులను జల్–జంగల్–జమీన్ నుంచి బేదఖలు చేయడం కోసం విదేశీ కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. ఈ ఘర్షణలో సాయుధ బలగాలు అత్యాచారాలకు పాల్పడ్డాయని పౌరహక్కుల సంఘాలు, కొందరు వ్యక్తులు అన్నప్పుడు మీరు సైనికులను తప్పు పడుతున్నారని అంటున్నారు. కానీ మేం తప్పు పడుతున్నది సైనికులను కాదు, ప్రభుత్వాన్ని. ఇవ్వాళ సైనికులు పాలక వర్గాల కోసం యుద్ధాలు చేస్తున్నారు కానీ వాస్తవానికి వాళ్ల శత్రువులు, మన శత్రువులు ఒక్కరే – అధికారంలో ఉన్నవారే మన ఉమ్మడి శత్రువులు. మా పోరాటంలో భాగం కావాలని మేం వారికి కూడా విజ్ఞప్తి చేస్తున్నాం. ఒకసారి ఒక పోలీసు కానిస్టేబుల్ నన్నో ప్రశ్న అడిగాడు. మీ సిద్ధాంతం ఏమిటో చెప్పమని అన్నాడు. కానిస్టేబుల్‌తో భుజం కలిపి నిలబడి ఆఫీసర్లతో పోరాడడమే మా సిద్ధాంతం అని అతనికి చెప్పాను. పక్కనే ఉన్న ఒక ఆఫీసర్ ఇది విని మీ జేఎన్‌యూ వాళ్లు ఇక్కడ యూనియన్లు పెట్టకండని అన్నాడు!

మరో సందర్భంగా, ఒక పోలీసు అధికారి 'లాల్ సలాం' అంటే ఏమిటని అడిగాడు. పక్కనే ఉన్న మరో పోలీసు దీనికి జవాబు చెప్పాడు. నక్సలైట్లు సీఆర్‌పీపై దాడి చేసేటప్పుడు 'లాల్ సలాం' అని అరుస్తారని చెప్పాడు. మీరు సినిమా చూడలేదా అని కూడా అన్నాడతను. దీనితో స్పష్టమయ్యేదేమిటంటే ముందస్తుగా ఏర్పర్చుకున్న తప్పుడు అభిప్రాయాలు చాలా బలంగా ఉన్నాయి. జేఎన్‌యూ వాళ్లు బావిలోని కప్పలని మమ్మల్ని అన్నారు. జేఎన్‌యూ నాలుగు గోడలనే మీరు ప్రపంచంగా భావిస్తారని అన్నారు. కానీ ఈ జేఎన్‌యూ నాలుగు గోడల మధ్యే నేను గత ఏడేండ్లలో వేర్వేరు ప్రజా ఉద్యమాల ప్రతినిధుల మాటల్ని విన్నాను. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిషాలలో నిర్మాణమవుతున్న పోలవరం డ్యాంతో 400 ఆదివాసీ గ్రామాలు ముంపుకు గురవుతాయని నేను తెలుసుకున్నది ఈ యూనివర్సిటీలోనే. నాకు సల్వాజుడుం గురించి కానీ, మైనారిటీలపై విద్వేష దాడుల గురించి గానీ, కులోన్మాద నరమేధాల గురించి తెలిసిందంటే అది ఈ విశ్వవిద్యాలయం వల్లనే. ఈ విశ్వవిద్యాలయం కేవలం మా కోసమే చాలా చేసిందని కూడా అనుకోకండి. దేశంలోని సమరశీల ప్రజలకు ఈ విశ్వవిద్యాలయం గేట్లు ఎప్పుడూ స్వాగతం పలికాయి. 1984లో సిక్కులను వేటాడి చంపుతుంటే ఈ క్యాంపస్ తన నాలుగు గోడల మధ్య వారికి రక్షణ కల్పించింది. ఇది ఈ క్యాంపస్, విద్యార్థి ఉద్యమం చరిత్ర.

మిత్రులారా! దేశంలో ఎలాంటి వాతావరణం సృష్టిస్తున్నారో గమనించండి... ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామిక హక్కులన్నింటినీ హరించే ప్రయత్నం

జరుగుతోంది. దేశద్రోహులు, దేశద్రోహులంటూ అంటూ ఇల్లెక్కి అరుస్తున్న మీడియా దేశంలోని వివిధ రాష్ట్రాలలో, ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాలలో కార్మిక చట్టాలను బలహీనపరుస్తున్న సంఘటనల గురించి ఏనాడూ ప్రైమ్ టైం డిబేట్ నిర్వహించలేదు. దేశంలోని ఆదివాసులు ఎలా బతుకుతున్నారనే దానిపై మీడియా ఏనాడూ ప్రైమ్ టైం డిబేట్ చెయ్యలేదు. విద్యార్థులు ఫెలోషిప్ కోల్పోతే ఏం జరుగుతుందనే అంశం కూడా ఏనాడూ ప్రైమ్ టైం చర్చకు నోచుకోలేదు.

ఈ దేశంలో నల్ల చట్టాలున్నాయి. యూఏపీఏ వాటిలో ఒకటి. మాపై ఆ కేసు కూడా పెడతామని బెదిరించారు. అందులో కేవలం ఆలోచనను కలిగి ఉన్న కారణంగా కూడా జైలులో వేయవచ్చు. మీరు ఏ చర్యకు పాల్పడకపోయినప్పటికీ మీకు ఉద్దేశం ఉంటే చాలు జైలులో పెట్టచ్చని ఈ చట్టం చెబుతుంది. ఉద్దేశాన్ని కొలిచే యంత్రాలైతే లేవు కానీ పోలీసులకు మాత్రం అది ముందే అర్థమవుతుంది! ఉదాహరణకు మీరు రేపు బాంబు పేల్చబోతుండగా ఈరోజే అరెస్టు చేశామని చెప్పవచ్చు. ఏడాదిన్నర క్రితం ముంబైకి చెందిన పౌరహక్కుల కార్యకర్త అరుణ్ ఫెరీరా ఇక్కడికొచ్చారు. ఆయన తన అనుభవాలు చెబుతూ, ఆయనను అరెస్ట్ చేసినప్పుడు ఇంట్లో దాడి చేసి ఆయన భార్యకు చెందిన సోషియాలజీ పుస్తకాల్ని కూడా పోలీసులు పట్టుకెళ్లారట. కోర్టులో ఇవెందుకు తెచ్చారని ప్రశ్నిస్తే 'ఎర్ర' రంగుతో ఉన్నాయని పోలీసులు చెప్పారట! మేం కూడా ఇలాంటివి ఎదుర్కొన్నాం. మొదటి రోజు ప్రాసిక్యూషన్ వాళ్లు ఉమర్, అనిర్బాన్‌లతో అఫ్జల్ గురూ, మక్బూల్ భట్‌లకు ఉన్న సంబంధాన్ని వెతకాలని అన్నారు. ఒక బతికున్న వ్యక్తికి చనిపోయిన వ్యక్తితో సంబంధం ఎలా ఉంటుందోనని మేం ఆలోచించాం! ఢిల్లీ పోలీసులు చనిపోయి దయ్యాలుగా మారిన వాళ్లను సైతం కలిసి విచారణ జరిపితే తప్ప సాధ్యం అయ్యేది కాదిది! మేం పుట్టకముందే ఉరితీసిన మక్బూల్ భట్‌తో మాకు సంబంధం ఎట్లా ఉంటుందని మేం అడిగాం.

మనం జేఎన్‌యూలో భారత్ వినాశనం గురించి నినాదాలు చేశామని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు బాగా బాధపడ్డాయి. ఆ నినాదాన్ని మేం ఖండిస్తున్నాం. అది మా నినాదం కానే కాదు. కానీ ఇందులో బీజేపీ బాధపడాల్సిందేముంది? ఈ పని చేయాల్సిన కాంట్రాక్టు తమది కాబట్టి వేరే వాళ్లు ఎందుకు ఇందులోకి దిగారని బహుశా బీజేపీ బాధ అయ్యుంటుంది! దేశంలో ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఉన్నంత కాలం ఈ దేశాన్ని మరెవ్వరూ నాశనం చేయలేరు! మేం ఈ దేశ వినాశనం కోసం కాదు, దేశ ప్రజల కోసం పోరాడుతున్నాం. అయితే మాదొక నినాదం మాత్రం తప్పక కొనసాగుతుంది. భారతదేశం వినాశనమయ్యే దాక

కాదు, మా పోరాటం సంఘ్ నాశనమయ్యే దాకా తప్పక కొనసాగుతుంది! ఎందుకంటే సంఘ్ నాశనమైతేనే దేశ ప్రజలకు మేలు కలుగుతుంది. నిన్న నరేంద్ర మోడీ ప్రపంచ సూఫీ ఫోరంలో మాట్లాడారు. మేం శాంతి కోసం నిలబడ్డామని అన్నారు. నిజమే మీరు స్మశానశాంతి కోసం నిలబడ్డారు! మీరు దేశంలో యదేచ్ఛగా అణచివేత చర్యలను కొనసాగిస్తుంటే ప్రజలు మౌనంగా భరించే శాంతి గురించి కదా మీరు చెబుతున్నారు. మీరు ఆదివాసులను వాళ్ల జల్-జంగల్-జమీన్‌ల నుంచి తన్ని తరిమేసినా వాళ్లు శాంతియుతంగా దాన్ని భరించాలి! మీరు దళిత బస్తీలను కాలబెట్టినా వాళ్లు నోళ్లు మూసుకొని ఉండిపోవాలి. మీరు ముస్లింలపై బూటకపు కేసులు పెట్టినా, అల్లర్లలో చంపేసినా వాళ్లు దీన్ని శాంతియుతంగా స్వీకరించాలి. అయితే మేమీ శాంతికి భంగం కలిగించాలనే అనుకుంటున్నాం. ఎందుకంటే ప్రపంచంలో ఎక్కడైనా సరే న్యాయం లేకుండా శాంతి ఉండదు. మేం పోరాడుతున్నది ప్రజలందరికీ న్యాయంతో కూడిన శాంతి లభించేలా చేయడానికే.

నేడు పరిస్థితులు చాలా తీవ్రంగా ఉన్నాయి. మా కుటుంబాన్ని చంపుతామని బెదిరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 1980లలో ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రశ్నించినందుకు పౌరహక్కుల కార్యకర్తలను హత్య చేశారు. షాహిద్ ఆజ్మీని ఆయన చేసిన పోరాటం కారణంగానే హత్య చేశారు. ఇంకా వేర్వేరు రకాల దాడుల్లో బలైన వందలాది మందిని మేం మర్చిపోలేదు. ఎక్కువగా మాట్లాడితే చంపేస్తామని వేర్వేరు రూపాల్లో మనల్ని బెదిరిస్తున్నారు. 'జీవితం చనిపోనీ గాక, చావును మాత్రం చావనివ్వొద్దు' అని మార్క్స్ అన్నాడు. ఇది నిజం! మనం ఇలా మాట్లాడితే దీని పరిణామాలు తీవ్రంగా ఉండొచ్చు. కానీ మాట్లాడకుండా ఉండడమంటే అదొక వ్యర్థ జీవితం. అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్, బీజేపీ, వీహెచ్‌పీ.. సంఘ్ పరివార్ మొత్తానికీ మేం స్పష్టం చేస్తున్నాం. ప్రతి పోరాటంలో మేం ముందు వరుసలో నిలబడతాం. ఇకపై మేం పోరాటాల్ని వదిలేసి నిశ్శబ్దంగా ఉండిపోతామని, బుద్ధిగా చదువుకుంటామని మీరు భావిస్తే పొరబడ్డట్టే. మీరు మమ్మల్ని 20-25 రోజులు జైలులో పెట్టడం ద్వారా మా భుజాలపై మరిన్ని బాధ్యతల్ని మోపారు. ఆ బాధ్యతలను మేం నిర్వర్తిస్తాం కూడా. ఇక చివరగా, సంఘ్ నాశనమయ్యే దాకా పోరాటం కొనసాగుతుందనే మా నినాదం విషయానికొస్తే, ఆ పోరాటాన్ని ప్రారంభించింది మేం కాదు, భగత్‌సింగ్! మనిషిని మరో మనిషి దోచుకునే వ్యవస్థ ఉన్నంత వరకు యుద్ధం ఉనికిలో ఉంటుందని, కొనసాగుతుందని ఆయన చెప్పాడు. ఇక 'ఈ దేశానికి అతి పెద్ద

ప్రమాదం హిందూ రాజ్యం ఏర్పాటు చేయాలనుకుంటున్న వారితోనే' అని బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నాడు.

అయితే మరొక్క విషయం.. మనం ఇప్పటి వరకు ఎదుర్కొన్నది చాలా తక్కువే. దేశంలోని మిగతా ప్రాంతాల్లో జరుగుతున్న వాటితో పోల్చితే ఇవన్నీ లెక్కలోకే రావు! ఎందుకంటే మనల్ని బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపెయ్యలేదు. మనల్ని అక్రమ నిర్బంధంలో ఉంచలేదు. మనపై శారీరకంగా చిత్రహింసలకు పాల్పడలేదు. మన ఇండ్లను కాలబెట్టలేదు. కానీ దేశంలోని చాలా ప్రాంతాల్లో ఇవన్నీ జరుగుతున్నాయి. 'సంక్షోభ సమయాలు ప్రజలను దెబ్బ తీస్తాయనేది నిజమే కానీ అవి కొన్నింటిని కొత్తగా సృష్టిస్తాయి కూడా' అని లెనిన్ అన్నాడు. ఈరోజు ఆ బాధ్యత మనపై ఉంది. రానున్న రోజుల్లో మనం 'హై లెవల్' ఎంక్వైరీ కమిటీకి వ్యతిరేకంగా పోరాడాల్సి ఉంది. రాజద్రోహం ఆరోపణలను కొట్టివేయాలని డిమాండ్ చేస్తూ పోరాడాలి. వీటితో పాటు హింసకు తావు లేని సమాజాన్ని నిర్మించే పోరాటాన్ని చివరకంటా కొనసాగించాలి. అప్పటి దాకా సమైక్యంగా, సమష్టిగా పోరాడుతూనే ఉందామనే విశ్వాసంతో... ఇంక్విలాబ్ జిందాబాద్!

# 8

# హక్కులడగడమే దేశద్రోహమా?

## జేఎన్‌యూ విద్యార్థిని చింటూ కుమారి

నాకిక్కడ మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు మొదటగా మీ అందరికీ నా ధన్యవాదాలు. ఇప్పుడు జేఎన్‌యూలోనే కాకుండా మొత్తం దేశమంతా ఒక సంఘీభావ ఉద్యమం మొదలైంది. నేడు దేశంలో రైతుల, కార్మికుల, దళితుల, ఆదివాసుల, మహిళల... మొత్తం పీడిత ప్రజలందరి హక్కులపై దాడి జరుగుతోంది. కార్మికులకు ట్రేడ్ యూనియన్ పెట్టుకునే హక్కు లేకుండా చేస్తున్నారు. మారుతి సుజుకి కంపెనీలో దీన్ని మనం స్పష్టంగా చూశాం. ఆదివాసుల హక్కుల హననం జరుగుతోంది. అడవిపై, భూమిపై వారికి హక్కు లేకుండా చేస్తున్నారు. రైతులకు సబ్సిడీ లభించకుండా చేస్తున్నారు. విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులను హరిస్తున్నారు. దేశంలో చాలా విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్య హక్కులు లేవు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలే జరగవు. ప్రైవేటీకరణ ప్రక్రియ చాలా వేగంగా కొనసాగుతోంది. ఏదో మేరకు ప్రజాస్వామిక హక్కులు అమలులో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయాన్ని కూడా బలహీనపర్చాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడ మేం కేవలం రూ. 250 మాత్రమే చెల్లించి మెరుగైన విద్యను పొందగలుగుతున్నాం. జేఎన్‌యూకు ఎన్నో ఉద్యమాల వారసత్వం ఉంది. జేఎన్‌యూను జేఎన్‌యూగా నిలబెట్టడంలో అక్కడి విద్యార్థుల, అధ్యాపకుల పాత్ర ఎంతో గొప్పది. జేఎన్‌యూ స్వేచ్ఛాయుత భావజాలానికి ముఖ్య వేదికగా ఉంది. చర్చలకు, వాదనలకు అక్కడ ఎప్పుడూ పెద్దపీట వేస్తారు. వామపక్ష, మితవాద భావజాలాలకు చెందిన వారి మధ్య ఎల్లప్పుడూ సైద్ధాంతిక సంఘర్షణ అక్కడ సాగుతుంటుంది. చాలా సూక్ష్మాతిసూక్ష్మ విషయాల్లోకి వెళ్లి

కూడా చర్చిస్తారు. దేశంలోని అన్ని రకాల సమస్యలపై అక్కడ చర్చ జరుగుతుంది. ప్రతి రోజూ రాత్రి భోజనాలైన తర్వాత అనేక అంశాలపై బహిరంగంగా సమావేశాలు జరుగుతుంటాయి. పాలస్తీనా సమస్య, భూసంస్కరణలు, ఆహార భద్రత, సాయుధ బలగాల ప్రత్యేకాధికార చట్టం (అఫ్స్పా), అణు ఒప్పందం.. ఇలా ప్రజా జీవితాన్ని ప్రభావితం చేసే ప్రతి సమస్యపైనా చర్చ జరుగుతుంది. రైతుల, కార్మికుల, దళితుల, ఆదివాసుల హక్కులను హరించే ప్రతి అంశాన్ని – అది దేశీయమైనదైనా, అంతర్జాతీయమైనదైనా ప్రతి అంశంపై అక్కడ మేం చర్చిస్తుంటాం. ఒక్కోసారి రాత్రి 3, 4 గంటల దాకా కూడా ఈ సమావేశాలు కొనసాగుతాయి. ఇలాంటి స్వేచ్ఛాయుత భావ సంఘర్షణ జరిగే జేఎన్‌యూలో నేడు అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోంది.

ఎవరైనా కాశ్మీర్ గురించి మాట్లాడినా, తెలంగాణ గురించి మాట్లాడినా, ప్రత్యేక రాష్ట్రం గురించి మాట్లాడినా, దళితుల హక్కుల గురించి మాట్లాడినా వారిపై 'దేశద్రోహి'గా ముద్ర వేసే కుట్ర మొదలైంది. కన్నయ్యకుమార్‌ను అరెస్టు ఇందులో భాగమే. కన్నయ్య పట్ల జరిగిందేమిటో అందరికీ తెలిసిందే. డీఎస్‌యూ అనే సంస్థ నుంచి విడిపోయిన కొందరు వ్యక్తులు ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కాశ్మీర్ సమస్య, అఫ్జల్‌గురుకు విధించిన ఉరిశిక్ష గురించి చర్చించాలని అనుకున్నారు. అదొక ప్రజాస్వామిక వేదిక. ఈ తరహా చర్చలు అనేక ఏండ్లుగా జరుగుతున్నాయి. ప్రతి అంశాన్ని విమర్శనాత్మకంగా, హేతుబద్ధంగా, శాస్త్రీయంగా చర్చించడం అక్కడి ఆనవాయితీ. దాదాపు గత ఐదేండ్లుగా ఈ అంశాన్ని అక్కడ చర్చిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమ నిర్వాహకులు దీనికి సంబంధించిన నియమాలన్నీ పాటించారు. ముందస్తుగా అడ్మినిస్ట్రేషన్ నుంచి అనుమతి తీసుకున్నారు. రెండు, మూడు రోజుల ముందు నుంచే పోస్టర్లు అంటించారు. వాటిలో ఈ ఆ కార్యక్రమంలో చర్చించబోయే అంశాలను స్పష్టంగా పేర్కొన్నారు. అయినప్పటికీ చివరి రోజున, పది నిమిషాల్లో కార్యక్రమం జరగాల్సి ఉండగా అనుమతిని వెనక్కి తీసుకున్నారు. ఏబీవీపీ వాళ్లు పోలీసులను, మీడియాను పిలిచారు. వీళ్లంతా దేశద్రోహులంటూ అరెస్టు చేయాలంటూ గొడవకు దిగారు. 'దేశద్రోహుల'నే ఆరోపణ కొత్తదేమీ కాదు. సుబ్రమణ్యంస్వామి ఇదివరకే మాపై 'దేశద్రోహులు'గా ముద్ర వేశారు. ఆ సందర్భంగా అక్కడ లెఫ్ట్‌కు చెందిన అన్ని గ్రూపుల వాళ్లం హాజరయ్యాం. బైటి నుంచి వచ్చిన వాళ్లు కూడా ఉన్నారు. 'ముజఫర్‌నగర్ బాకీ

హై' సినిమాను ప్రదర్శించినప్పుడు కూడా ఇలాగే గొడవ సృష్టించారన్నది మా దృష్టిలో ఉంది. ఏబీవీపీ వాళ్లు దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించగా లెఫ్ట్ విద్యార్థులంతా కలిసి వారితో ఘర్షణ పడి సినిమా ప్రదర్శన జరిపించారు. ఈసారి కూడా అలా జరుగుతుందని నిర్వాహకులు చెప్పడం వల్ల ఆ కార్యక్రమాన్ని సజావుగా జరగనివ్వడం కోసం లెఫ్ట్ విద్యార్థులందరూ అక్కడికి చేరుకున్నారు. అలా వారి భావ ప్రకటనా స్వేచ్ఛకు అండగా నిలిచేందుకే అందరం హాజరయ్యాం.

ఎవరి భావాలు వారిని వెల్లడి చేయనివ్వకుండా, దేశద్రోహులుగా ట్యాగ్ చేస్తే ఇక ప్రజాస్వామ్యం ఎక్కడుంది? జాతీయ జెండా ఎగురవేయాలని ఇప్పుడు నియమం తీసుకొచ్చారు. మంచిదే, దాంతో ఎవరికీ పేచీ లేదు. కానీ కేవలం సింబాలిజంతో ఒరిగేదేమిటి? కాని కాశ్మీర్ సమస్య గురించి మాత్రం ఎందుకు మాట్లాడగూడదు? దానిపై ఒక్కొక్కరికి ఒక్కో రకమైన వైఖరి ఉండొచ్చు. కానీ మాట్లాడనే వద్దంటే ఎలా? వారి భావాలేమిటో, బాధలేమిటో వినకుంటే ఎలా? వారితో ప్రజాస్వామ్యబద్ధంగా సంభాషణల్లో భాగం చేసి శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలి కదా! సమస్యను అలాగే కొనసాగనిస్తే ఏండ్లకు ఏండ్లు ఇలాగే ఉంటుంది. అందుకే ఒక్కోసారి అనిపిస్తుంది. ప్రభుత్వానికి అసలు ఆ సమస్యను పరిష్కారించే యోచనే లేదని. సమస్యను సమస్యగానే ఉండనివ్వాలనేది వారి ఆలోచనేమోనని. అక్కడ అఫ్స్పాను దుర్వినియోగం చేస్తున్నారు. సామూహిక గ్రేవ్స్ బైటపడుతున్నాయి. రోజూ అత్యాచారాలకు సంబంధించిన వార్తలు వింటున్నాం. ప్రతి ఒక్కరూ బైటికి వెళ్తే సురక్షితంగా ఇంటికి వస్తామన్న నమ్మకం లేకుండా జీవిస్తున్నారు. ఇదంతా అక్కడి వాస్తవ పరిస్థితి. దీనికి పరిష్కారం వద్దా?

అదటుంచి, ఈ కార్యక్రమం తర్వాత 'మీడియా ట్రయల్' మొదలైంది. ప్రకటనలపై ప్రకటనలు మొదలయ్యాయి. ఈ మాటలు మాట్లాడిన వాళ్ల నాలికలు కోసెయ్యాలని, జేఎన్‌యూ వాళ్లంతా దేశద్రోహులని, వారిని కాల్చి చంపాలని, పాకిస్తాన్‌కు వెళ్లగొట్టాలని... ఇలా రకరకాలుగా ప్రకటనలు వెలువడ్డాయి. మమ్మల్నయితే వేశ్యలని కూడా నిందించారు. క్యాంపస్ నుంచి బైటికి వెళ్లాలంటే మేం భయపడే పరిస్థితి తయారైంది. ఇక్కడ అంతా ఉగ్రవాదులుంటారని, ఉగ్రవాదంలో వీరికి పీహెచ్‌డీ ఇస్తారని... రకరకాల విషపూరిత వ్యాఖ్యలు చేశారు. మేం మెట్రో స్టేషన్‌కు వెళ్లాలంటే కూడా ఆటో వాళ్లు సిద్ధపడడం లేదు.

ట్యాక్సీ వాళ్లు రావడం లేదు. వేశ్యలంటున్నారు. నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఎలా మాట్లాడేందుకైనా వారికి 'స్వేచ్ఛ' ఉంది!

కానీ ఇక్కడ ఒక ప్రశ్న. ఈ ప్రభుత్వ పాలనలో విచ్ఛిన్నకర విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన వాళ్ల మీద ఎక్కడైనా చర్య తీసుకున్నారా? 'రామ్‌జాదే... హరామ్‌జాదే' అంటూ వ్యాఖ్యలు చేసిన వాళ్లపై ఏమైనా చర్యలు తీసుకున్నారా? నేను బీహార్‌కు చెందినదాన్ని. అక్కడి ఉదాహరణలే చెబుతాను. బథానీటోలా, శంకర్‌బిఘహా, ఇంకా అనేక గ్రామాల్లో పట్టపగలే దళితులను పట్టుకొని చంపేసిన, నరికేసిన, సజీవంగా కాలబెట్టిన సంఘటనలు జరిగాయి. కడుపులో పిండాన్ని సైతం పొడిచి చంపారు. వీళ్లు పెరిగి నక్సలైట్లవుతారని వ్యాఖ్యలు చేశారు. 'కోబ్రాపోస్ట్' నిర్వహించిన ఒక ఆపరేషన్‌లో వాళ్లు తాము పాల్పడ్డ అకృత్యాల గురించి బాహాటంగా, ఎలాంటి భయం లేకుండా చెప్పుకున్నారు. చంపామని, నరికామని తమ నోటితోనే చెప్పారు. వాళ్లపై ఎలాంటి చర్యా ఉండదు. దళిత నరమేధాల సంఘటనలు ఎన్నింటినో మనం చూశాం. దోషులందరినీ హైకోర్టు నిర్దోషులుగా తేల్చేసింది.

బాబ్రీ, గోద్రా, గుజరాత్, ముజఫర్‌నగర్, దాద్రీ వంటి అల్లర్లలో... మైనారిటీ వర్గాలకు చెందిన వారిని ఘోరంగా చంపారు. మహిళలను రేప్ చేశారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు. కానీ ఈరోజు విద్యార్థులను శిక్షించేందుకు మాత్రం చాలా తొందరపాటును ప్రదర్శిస్తున్నారు. ఎందుకు? ప్రభుత్వం జేఎన్‌యూకు ఎందుకు భయపడుతోంది? ఎఫ్‌టీఐఐకి ఎందుకు భయపడుతోంది? హెచ్‌సీయుకు ఎందుకు భయపడుతోంది? ఎందుకంటే ఈ సంస్థలలో విద్యార్థులు మాట్లాడుతారు కాబట్టి. విద్యార్థులు నిజాలను గట్టిగా మాట్లాడుతారు కాబట్టి. అయితే హెచ్‌సీయూ, జేఎన్‌యూ విద్యార్థులు ఇప్పుడు నిజం మాట్లాడినందుకు శిక్ష అనుభవిస్తున్నారు. ఇందులో కులం, జెండర్, వర్గం వంటి అన్ని ఆధిపత్యాలు పని చేస్తున్నాయి. అయితే విద్యార్థులు వీటన్నింటినీ వ్యతిరేకిస్తున్నారు. విద్య ప్రైవేటీకరణను, కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తున్నారు. విద్యార్థులు తమ హక్కుల కోసం పోరాడుతున్నారు. వాళ్లు అంబేడ్కర్, ఫూలేలను చదువుతున్నారు. మార్క్స్ క్యాపిటల్ చదువుతున్నారు. కమ్యూనిస్టు ప్రణాళికను చదువుతున్నారు. అందుకే వాళ్లు భయపడుతున్నారు. పెట్టుబడి భయపడుతోంది. వాళ్లు మన మెదళ్లను ఆలోచింపనియ్యకుండా చేయాలనుకుంటున్నారు. వీరి జాతీయవాదం నిర్వచనాన్ని ఒప్పుకోని వాళ్లను... ఒక భాష, ఒక రాజ్యం.. అన్నీ ఒక్కటే! ఈ దేశంలో వైవిధ్యాన్ని వీరు ఒప్పుకోరు. వాళ్లందరూ దేశద్రోహులే వీరి దృష్టిలో.

కన్నయ్యను దేశద్రోహి అని నిందించడం వెనుక కారణం ఏమిటి? నిజానికి నినాదాలు కాదు కారణం. (ఆ నినాదాలు ఆయన ఇవ్వలేదు కూడా). 'ఆక్యుపై యూజీసీ' పేరుతో గత 90 రోజులుగా జరుగుతున్న ఉద్యమాన్ని అణచివేయడం వాళ్ల అసలు ఉద్దేశ్యం. ఫెలోషిప్‌లను కొనసాగించాలని, వాటిని రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు కూడా విస్తరింపజేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ద్వంద్వ నీతి వద్దని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉద్యమంతో 'మను' స్మృతి ఇరానీ హడలిపోయారు. మరొక అంశం రోహిత్ వేముల మృతికి సంబంధించినది. దీనిపై దేశవ్యాప్తంగా ఉద్యమం పెల్లుబుకింది. రోహిత్‌ను బలిగొన్నది సంస్థాగత హింసేనన్న విషయాన్ని విద్యార్థులు బలంగా లేవనెత్తారు. విద్యాసంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడేందుకు విద్యార్థులు గొంతెత్తారు. అందుకే వారిపై అణచివేత సాగుతున్నది. దేశవ్యాప్తంగా ఫాసిస్టు తరహా దాడులు కొనసాగుతున్నాయి. మరే విద్యాసంస్థలోనూ రోహిత్ వంటి పరిస్థితులు తలెత్త గూడదని, నిజం మాట్లాడినందుకు శిక్ష పడగూడదని విద్యార్థులు ఉద్యమిస్తున్నారు. ఆకలిచావుల నుంచి, నిరుద్యోగం నుంచి మాకు 'ఆజాదీ' కావాలని అడుగుతున్నాం. వీళ్లకు 'ఆజాదీ' అనే మాటే మింగుడు పడకుండా ఉంది. నిజానికి 'ఆజాదీ' అనే ఈ ప్రియమైన నినాదం మేం 21 డిసెంబర్ (నిర్భయ) ఉద్యమం నుంచి మేం చేపట్టాం. ఖాప్ నుంచి ఆజాదీ కావాలని, పితృస్వామ్యం నుంచి ఆజాదీ కావాలని, నిరుద్యోగం నుంచి విముక్తి కావాలని డిమాండ్ చేశాం. ఇది కోరుకోవడమే దేశద్రోహమైతే ఈరోజు దేశవ్యాప్తంగా 'దేశద్రోహుల' అవసరం ఉంది.

# 9

# మనువులూ, హిట్లర్‌లూ, గోబెల్స్‌లూ! కాస్త నోళ్లు మూసుకుంటారా?

*'రాజద్రోహం' ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేయడానికి కొద్ది ముందు, జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కన్నయ్య కుమార్ క్యాంపస్‌లో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇంటర్నెట్‌పై యూట్యూబ్‌లో అందుబాటులో ఉన్న ఈ ప్రసంగానికి ఇది తెలుగు అనువాదం. ప్రేక్షకుల చప్పట్ల మూలంగా అక్కడక్కడ వినబడని భాగాలు మినహాయిస్తే, ఇది ఆయన హిందీలో చేసిన ప్రసంగానికి పూర్తి పాఠం. జేఎన్‌యూ విద్యార్థుల 'దేశభక్తి' విషయంలో మతతత్వ శక్తులు సాగిస్తున్న దుష్ప్రచారం నేపథ్యంలో కన్నయ్య కుమార్ ప్రసంగమే అనేక ప్రశ్నలకు జవాబు.*

...వాళ్లు త్రివర్ణ పతాకాన్ని కాలబెట్టే వాళ్లు. బ్రిటిష్ వాళ్లను క్షమాభిక్ష వేడుకున్న సావర్కర్‌కు శిష్యులు వాళ్లు. ఇప్పుడు హర్యానాలో ఖట్టర్ ప్రభుత్వం వాళ్లదే. ఈ ప్రభుత్వం షహీద్ భగత్‌సింగ్ పేరుతో ఉన్న విమానాశ్రయానికి ఒక 'సంఘీయుడి' పేరు పెట్టింది. వీళ్లా మాకు దేశభక్తి గురించి పాఠాలు చెప్పేది? దేశం గురించి, దేశభక్తి గురించి ఆర్ఎస్ఎస్‌తో చెప్పించుకునే దుస్థితిలో మేం లేం.... మేము ఈ దేశానికి చెందిన వాళ్లం. ఈ మట్టిని మేం ప్రేమిస్తాం. ఈ దేశంలో ఉన్న 80 శాతం పేద ప్రజల కోసం మేం పోరాడుతాం. మా దృష్టిలో దేశభక్తి అంటే ఇదే. మాకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంపై పూర్తి విశ్వాసం ఉంది. అంతే కాదు, ఈ దేశ రాజ్యాంగాన్ని అవమానించే వాళ్లను మేం సహించబోమని కూడా స్పష్టం చేస్తున్నాం. 'సంఘీయులే' కానివ్వండి, లేదా మరెవరైనా సరే...

అయితే, 'ఝుండేవాలా' (ఆర్ఎస్ఎస్ ఢిల్లీ కార్యాలయం)లో, 'నాగపూర్' (ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయం)లో నిర్వచించే రాజ్యాంగంపై మాత్రం మాకెలాంటి విశ్వాసం లేదు! మాకు మనుస్మృతిపై ఎలాంటి విశ్వాసం లేదు. ఈ దేశంలో వేళ్లూనుకున్న కులవ్యవస్థపై మాకు విశ్వాసం లేదు! అట్లాగే, ఇదే రాజ్యాంగంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 'రాజ్యాంగ పరిహారం' గురించి కూడా చెప్పారన్న విషయం మరచిపోవద్దు. మరణశిక్షను రద్దు చేయాలని కూడా అంబేద్కర్ అభిప్రాయపడ్డారన్న విషయం మర్చిపోవద్దు. భావ ప్రకటనా స్వేచ్ఛకు ఆయన సర్వోన్నత స్థానం ఇచ్చారన్న విషయం కూడా గుర్తుంచుకోవాలి. ఈ అంశాలన్నింటితో సహా, మన మౌలిక హక్కులను, రాజ్యాంగపరమైన హక్కులను నిలబెట్టుకోవాలని మేం ఆకాంక్షిస్తున్నాం.

కానీ ఈరోజు ఏబీవీపీ తనకున్న మీడియా అండతో ఈ విషయాన్ని పూర్తిగానే తారుమారు చేయడం చాలా సిగ్గుచేటు.. బాధాకరం కూడా. విషయాన్ని అది పూర్తిగా నీరు గారుస్తోంది. నిన్న ఏబీవీపీ సంయుక్త కార్యదర్శి మాట్లాడుతూ, 'మేం ఫెలోషిప్ కోసం పోరాడుతామ'ని చెప్పాడు. ఎంత హాస్యాస్పదం ఇది! ఇప్పటికే వీళ్ల ప్రభుత్వం, మేడం 'మనుస్మృతి ఇరానీ ఫెలోషిప్‌లు లేకుండా చేసేశారు. ఉన్నత విద్యకు బడ్జెట్లో వీళ్ల ప్రభుత్వం 17 శాతం కోత విధించారు. దాంతో మన హాస్టళ్లు గత నాలుగేండ్లుగా అఘోరిస్తున్నాయి. మనకు వై-ఫై లభ్యం కాలేదు. బీహెచ్ఈఎల్ ఒక బస్సునివ్వగా, దాంట్లో చమురు పోయడానికి అధికారుల వద్ద డబ్బు లేదు! ఏబీవీపీ వాళ్లు మాత్రం మేం హాస్టళు నిర్మింపజేస్తామని, వై-ఫై తెప్పిస్తామని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు.

మిత్రులారా! ఈ దేశంలో మౌలిక ప్రశ్నలపై చర్చ ప్రారంభిస్తే వీళ్ల ముసుగు తొలగిపోతుంది. మేం మౌలిక ప్రశ్నలు లేవనెత్తుతున్నందుకు గర్విస్తున్నాం. వాటిపై చర్చ చాలా అవసరం...జేఎన్‌యూలో జెహాదీలున్నారని సుబ్రమణ్యస్వామి అన్నాడు. జేఎన్‌యూ వాళ్లు హింసను వ్యాపింప జేస్తున్నారని అంటున్నారు. నేనీ జేఎన్‌యూ గడ్డ మీది నుంచి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తలను సవాల్ చేస్తున్నాను. రండి, మాతో వాదించండి! మేమసలు 'హింస'కు సంబంధించిన మౌలిక అవగాహనపైనే చర్చ చేయాలనుకుంటున్నాం. 'ఖూన్ సే *తిలక్ కరేంగే, గోలియోంసే ఆరతీ'* (నెత్తుటితో తిలకం దిద్దుకుంటాం, తుపాకీ గుళ్లతో హారతి) అని ఏబీవీపీ వాళ్లు చేస్తున్న నినాదాల గురించి కూడా మాట్లాడుకుందాం రండి.

ఈ దేశంలో మీరెవరెవరి రక్తం పారించాలనుకుంటున్నారో చెప్పండి. ఎవరిపై తూటాలు పేల్చాలనుకుంటున్నారో చెప్పండి. అవును, మీరు తుపాకీ గుళ్లు కురిపించారు... బ్రిటిష్ వాళ్లతో చేయి కలిపి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడే వాళ్లపై గుళ్లు కురిపించారు. దేశంలో పేదరికంతో, ఆకలితో పీడితులైన వాళ్లపై మీరు గుళ్లు కురిపించారు. మీరు ముస్లింలపై గుళ్లు కురిపించారు.

మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమిస్తే, 'ఐదు వేళ్లు సమానమవుతాయా' అని మీరంటారు. మహిళలు 'సీత' లాగా ఉండాలని, అగ్నిపరీక్షకు దిగాలని మీరంటారు. ఈ దేశంలో ఉన్నది ప్రజాస్వామ్యం కదా! ప్రజాస్వామ్యంలో అందరికీ సమానంగా జీవించే హక్కుండాలి కదా! విద్యార్థులైనా, ఉద్యోగులైనా, పేదలైనా, కార్మికులైనా, రైతులైనా... అంబానీ అయినా, అదానీలైనా అందరికీ హక్కులు సమానమే కదా! కానీ మహిళల సమాన హక్కుల గురించి మాట్లాడితే, భారతీయ సంస్క అతిని నాశనం చేయాలనుకుంటున్నారని మీరు గొంతు చించుకుంటారు. నిజమే, మేం మీ దోపిడీ సంస్కఅతిని నిజంగానే నాశనం చేయాలనుకుంటున్నాం! మీ కులతత్వ సంస్కఅతిని నాశనం చేయాలనుకుంటున్నాం. మీ మనువాద సంస్క అతిని నాశనం చేయాలనుకుంటున్నాం. అసలు సంస్క అతికి నిర్వచనాన్నే మార్చాలని మేమంటున్నాం.

అసలు వీళ్లకు సమస్య ఎక్కడొస్తోంది? మనం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే వీరికి కడుపుమంటగా ఉంది. 'లాల్ సలాం'తో పాటు 'నీలా సలాం' అని మనం నినదిస్తే, మార్క్స్‌తో పాటు బాబా సాహెబ్ అంబేద్కర్ గురించి మనం మాట్లాడితే వీరికి మింగుడు పడకుండా ఉంది.... కుట్ర వీళ్లదే. వీళ్లసలు బ్రిటిష్ వాళ్ల తొత్తులు! కావాలంటే నాపై పరువు నష్టం కేసు పెట్టుకోండి. ఆర్‌ఎస్‌ఎస్ చరిత్రే బ్రిటిష్ వాళ్లతో కుమ్మక్కయిన చరిత్రని మళ్లీ మళ్లీ అంటాను! ఈ దేశద్రోహులు మనల్ని దేశభక్తి సర్టిఫికేట్ చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

నా మొబైల్‌ను పరిశీలించండి మిత్రులారా! మా తల్లిని నానా రకాల బూతులు తిడుతూ మెసేజ్‌లు పెట్టారు. వీళ్లేనా భారతమాత గురించి మాట్లాడేది? ఒకవేళ మీరు చెప్పే 'భారతమాత'లో నా తల్లి భాగం కాకపోతే నేను 'భారతమాత' అనే మీ అవగాహనను నేనంగీకరించను. నా తల్లి అంగన్‌వాడీ సేవకురాలిగా పని చేస్తోంది. రూ. 3,000లతో

మా కుటుంబం బతుకుతోంది. అమెను వీళ్ల బూతులు తిడుతున్నారు. వీళ్ల 'భారతమాత' నినాదానికి నేను సిగ్గు పడుతున్నాను. ఈ దేశంలో ఉన్న నిరుపేద, దళిత, రైతుకూలీల తల్లులెవరూ వీళ్ల 'భారతమాత' పరిధిలోకి రారు. నేనంటాను 'జై! దేశంలోని మాతలందరికీ జై! తండ్రులందరికీ జై! అక్కాచెల్లెండ్లకు జై! రైతుకూలీలకు, కార్మికులకు, ఆదివాసీలకు, దళితులకు జై! వాళ్లకు ఇలా అనే దమ్ముందా? ఉంటే అనమనండి. 'ఇంక్విలాబ్ జిందాబాద్' అని అనమనండి వీళ్లను. 'భగత్‌సింగ్ జిందాబాద్' అనమనండి. 'సుఖ్‌దేవ్ జిందాబాద్' అనమనండి. 'అష్ఫాఖుల్లా ఖాన్ జిందాబాద్' అనమని అనండి. 'బాబా సాహెబ్ అంబేద్కర్ జిందాబాద్' అనమనండి.

బాబా సాహెబ్ 125వ జయంతి పేరుతో మీరాడిందంతా నాటకం! మీకు ధైర్యముంటే, బాబాసాహెబ్ చెప్పినట్టుగా ఈ దేశంలో కులవాదమే అతి పెద్ద సమస్య అని ఒప్పుకోండి. కులతత్వం గురించి మాట్లాడండి. రిజర్వేషన్లు అమలు చేయండి. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ అమలు చేయండి.... అప్పుడు నమ్ముతాం మీకు ఈ దేశంపై విశ్వాసం ఉందని. అసలు దేశమంటే ఏమిటి? దేశమంటే మనుషులు! దేశం గురించిన మీ అవగాహనలో పేదలకు, నిస్సహాయులకు, రైతుకూలీలకు, ఆదివాసులకు, దళితులకు చోటే లేదు. నేను నిన్నొక టీవీ డిబేట్‌లో మాట్లాడాను. దీపక్ చౌరాసియాతో చెప్పాను. ఇది చాలా సీరియస్ సమయం అనే విషయం గుర్తుంచుకోండని అన్నాను. దేశంలో పడగ విప్పుతున్న ఫాసిజంతో మీ మీడియాకు కూడా ముప్పేనని చెప్పాను. ఇకపై మీక్కూడా సంఘ్ కార్యాలయం నుంచే స్క్రిప్టులు వస్తాయని అన్నాను. సరిగ్గా ఇందిరాగాంధీ సమయంలో కాంగ్రెస్ కార్యాలయం నుంచి వచ్చినట్టుగానే.

కొంత మంది మీడియా వాళ్లు అంటున్నారు. మా పన్నులతో, సబ్సిడీ డబ్బులతో జేఎన్‌యూ నడుస్తుంది అని. అవును నిజమే! అనుమానమేమీ లేదు. కానీ అసలు విశ్వవిద్యాలయాలు ఉన్నది దేని కోసం అని మేమడుగుతున్నాం. విశ్వవిద్యాలయాలుండేది సమాజంలోని 'కామన్ కాన్సెన్స్' (సామూహిక చేతన)ను విమర్శనాత్మకంగా విశ్లేషించడానికే. అవి ఆ పని చేయకపోతే దేశమే సరిగా నడవదు. అలాంటి దేశం కేవలం పెట్టుబడిదారులకు నెలవుగా మాత్రమే మిగిలిపోతుంది. దోపిడీ, పీడనలకు మాత్రమే ఆలవాలంగా మారిపోతుంది. దేశ ప్రజల సంస్క అతి, విశ్వాసాలకు, హక్కులకు స్థానం లేనప్పుడు అసలు దేశం అనే మాటలో అర్థమే లేదు.

మేం ఈ దేశంతో పాటుగా సంపూర్ణంగా నిలబడి ఉన్నాం. భగత్‌సింగ్, బాబాసాహెబ్ కన్న కలల కోసం నిలబడి ఉన్నాం. అందరికీ సమాన హక్కులుండాలన్న అవగాహనతో నిలబడ్డాం. అందరికీ జీవించే హక్కు ఉండాలి. అందరికీ తినే, మాట్లాడే, నివసించే హక్కుండాలి. ఈ స్వప్నంతోనే మేం నిలబడి ఉన్నాం. దీని కోసమే రోహిత్ ప్రాణత్యాగం చేశాడు. కానీ రోహిత్ విషయంలో జరిగిట్టు, జేఎన్‌యూలో మేం జరగనివ్వమని కేంద్ర ప్రభుత్వానికి సవాల్ చేసి మరీ చెబుతున్నాం. మేం భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం నిలబడుతాం. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల విషయం వదిలెయ్యండి. ప్రపంచ పేదలంతా ఏకం కావాలని మేమంటున్నాం. 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అని కోరే వాళ్లం మేం. ప్రపంచ మానవత వర్ధిల్లాలి. భారత మానవత వర్ధిల్లాలి అని మేమంటాం. మానవత్వానికి వ్యతిరేకంగా నిలబడిందెవరో మేం గుర్తించాం. మనువాదం, కులవాదం.. బ్రాహ్మణవాదంతో కుమ్మక్కయిన పెట్టుబడిదారీ విధానం – ఇవే మానవత్వానికి శత్రువులు. వీటి ముఖాలను బట్టబయలు చేయాలి. నిజమైన ప్రజాస్వామ్యం, నిజమైన స్వాతంత్ర్యం దేశంలో నెలకొల్పాలి. ఆ స్వాతంత్ర్యం రాజ్యాంగం ద్వారానే వస్తుంది. పార్లమెంటు ద్వారా వస్తుంది. ప్రజాస్వామ్యం ద్వారా వస్తుంది. అందుకే మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. మన మధ్య ఎన్ని విభేదాలున్నా, భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం, రాజ్యాంగం కోసం, దేశ సమగ్రత కోసం మనందరం ఐక్యంగా నిలబడదాం. సంఘీయులే మన దేశాన్ని చీలదీసే శక్తులు... ఉగ్రవాదాన్ని పెంచి పోషించే శక్తులు.

ఇక చివరి ప్రశ్న. కసాబ్ ఎవరు? అఫ్జల్ గురు ఎవరు? శరీరాలపై బాంబులు కట్టుకొని హత్యలు చేయడానికి సిద్ధపడుతున్న ఆ పరిస్థితులేమిటి? ఈ ప్రశ్నను విశ్వవిదాయాల్లో చర్చించకపోతే అవి ఉండీ ప్రయోజనం లేదని నా అభిప్రాయం. హింసను కూడా నిర్వచించుకుందాం. హింస అంటే ఏమిటి? తుపాకీ తీసుకొని ఒకరిని చంపడమే హింస కాదు. దళితులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను జేఎన్‌యూ అడ్మినిస్ట్రేషన్ ఇవ్వడానికి నిరాకరిస్తే అది కూడా హింసే అవుతుంది. ఇది వ్యవస్థీకృత హింస. న్యాయం అంటే ఏమిటి? దీనిని నిర్ణయించేదెవరు? బ్రాహ్మణవాద వ్యవస్థలో దళితులకు మందిరంలోకి ప్రవేశం లేదు. ఆనాడు అదే న్యాయం. బ్రిటిష్ కాలంలో కుక్కలకు, భారతీయులకు రెస్టారెంట్లలోకి ప్రవేశం లేదనేవారు. అప్పటికి అదే న్యాయం. కానీ ఈ న్యాయాన్ని అప్పుడూ

సవాలు చేశారు. ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్‌లు చెప్పే న్యాయాన్ని మేం సవాల్ చేస్తున్నాం. మీ న్యాయం మా న్యాయాన్ని ఇముడ్చుకోనప్పుడు మీ న్యాయాన్ని మేం ఒప్పుకోం. మీరు చెప్పే స్వాతంత్ర్యాన్ని మేం ఒప్పుకోం. మనషులందరికీ వారి రాజ్యాంగ హక్కులు లభించిన రోజునే మేం స్వాతంత్ర్యాన్ని గుర్తిస్తాం. ప్రతి మనిషికీ తన రాజ్యాంగ హక్కులతో పాటు దేశంలో సమాన హెూదాను కల్పించినప్పుడే, ఆ రోజునే మేం ఇది న్యాయమని ఒప్పుకుంటాం. జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఏ రకమైన హింసనూ, ఏ ఉగ్రవాదినీ, ఏ ఉగ్రవాద సంఘటననూ, ఎలాంటి దేశ వ్యతిరేక చర్యనూ ఏ రకంగానూ సమర్థించదని నేను స్పష్టం చేస్తున్నాను. కొంత మంది... గుర్తు తెలియని వ్యక్తులు 'పాకిస్తాన్ జిందాబాద్' అని నినాదాలు చేశారు. దానిని జేఎన్‌యూ విద్యార్థి సంఘం తీవ్రంగా ఖండిస్తోంది.

# ఇది విద్యార్థుల వసంతం!

**(మార్చి 18న మధ్యంతర బెయిల్‌పై విడుదలైన తర్వాత జేఎన్‌యూ విద్యార్థి నేత అనిర్బాన్ భట్టాచార్య చేసిన ప్రసంగం పూర్తి పాఠం ఇది. తన ప్రసంగంలో అనిర్బాన్ సంఘ్ శక్తుల కుహనా దేశభక్తిని, రాజ్యాంగం పట్ల బూటకపు అంకితత్వాన్ని ప్రతిభావంతంగా ఎండగట్టారు. దేశంలో నేడు జాతీయవాదం, దేశభక్తి భావనలపై జరుగుతున్న చర్చలో ఇది అవసరమని భావించి ప్రచురిస్తున్నాం. – సంపాదకులు)**

సహచరులారా! మేం జైలుకు వెళ్లడంతో ఇక్కడ జరిగిన చాలా సమావేశాలను మిస్సయ్యాం. జైలులో ఉన్నప్పుడు టీవీల్లో, పత్రికల్లో భారీ సంఖ్యలో మిమ్మల్ని చూస్తుంటే మేం కూడా ఉండి ఉంటే ఎంత బాగుండు అని అనిపిస్తుండేది... కన్నయ్య విడుదల రోజైతే మరీ... మీ అందరికీ, దేశంలోని ప్రజాస్వామ్యవాదులందరికీ, ప్రపంచవ్యాప్తంగా మనతో సంఘీభావం ప్రకటించిన వారందరికీ నేను కేవలం కృతజ్ఞతలు చెప్పి సరిపెట్టుకోవడం లేదు. అలా చెప్పి వాళ్ల పాత్రను తగ్గించలేను. వాళ్లు సత్యం వైపు, అసత్యానికి విరుద్ధంగా నిలబడ్డారు. న్యాయం వైపు, అన్యాయానికి విరుద్ధంగా నిలబడ్డారు. పోరాటం వైపు, ఫాసిజానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. ఈ రాజకీయ బాధ్యతను భుజాల పైకెత్తుకున్న మీ సాహసానికి జై భీం, లాల్ సలాం చెబుతున్నాను.

ఉమర్ చెప్పినట్టుగా, ఈ నెలాపదిహేను రోజుల సమయంలో జరిగిన సంఘటనల్లో వాస్తవమైనవేవీ, అధివాస్తవికమైనవేవీ, కుళ్లవి ఏవీ అనే తేడాను గుర్తించడం కష్టమైంది.... ఉమర్ చెప్పినట్టుగా, అసలిది 9 ఫిబ్రవరికి సంబంధించిన విషయం కానే కాదు. 9న

నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమానికి 10 మంది 'మాస్టర్‌మైండ్స్' అని అన్నారు! మాస్టర్‌మైండ్స్ అనే పదాన్ని దేనికి ఉపయోగిస్తారో మనందరికీ తెలిసిందే. ప్రత్యేకించి ముస్లింలను వేధించడం కోసం దీనిని ఉపయోగిస్తారు. ఇప్పటి వరకూ మనం ఈ పదాన్ని బాంబు పేలుళ్లు, టెర్రర్ కేసులు, ఏకే-47, ఆర్‌డీఎక్స్ వంటి వాటితో జోడించి ఉపయోగించడాన్ని చూశాం! కానీ ఒక సాంస్కృతిక కార్యక్రమానికి మాస్టర్‌మైండ్స్ ఉంటారని మొదటిసారి వింటున్నాం. 'ఎ కంట్రీ విదౌట్ ఎ పోస్ట్ ఆఫీస్' వెనుక వీళ్లు మాస్టర్‌మైండ్స్ అని మమ్మల్ని అన్నారు. పాటల తోనే బాంబుల్ని పేల్చుతామని అనుకున్నారో ఏమో తెలియదు! ఎంత పిచ్చి మాటలివి! అయితే ఈ పిచ్చితనానికి కూడా ఒక పద్ధతి ఉంది. ఈ అధివాస్తవిక విషయాల వెనుక కొంత వాస్తవికత కూడా ఉంది.

ముఖ్యంగా ఉమర్ ఖాలిద్ గురించి ఎన్ని ఆరోపణలు చేశారు! జైషే మహ్మద్... మూడు సార్లు పాకిస్తాన్‌కు వెళ్లాడు... గల్ఫ్‌కు ఫోన్ చేశాడు.. 800 కాల్స్ చేశారు. హవాలా ద్వారా డబ్బులు ముట్టాయి... ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్నాడు. ఇవన్నీ వింటుంటే ఒక్కోసారి నవ్వొచ్చేది. ఒక్కోసారి నిరాశ కలిగేది. కొన్ని సార్లు కోపమొచ్చేది. ఇంటరాగేషన్‌లోనూ, బైటా చాలా రకాలుగా మాట్లాడారు. 'ఖాలిద్ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు కానీ మీరెందుకు ఇందులోకి దిగారు భట్టాచార్య గారూ' అని పోలీసులు నన్నడిగారు. అతను ముస్లిం కావడం వల్లనే ఇట్లా మాట్లాడుతున్నారా అని అడిగితే, మేమా మాట అనలేదే అనే వాళ్లు. ఖాలిద్ మూడు సార్లు పాకిస్తాన్ వెళ్లాడనే స్టోరీ అమ్ముడుపోతుంది కానీ భట్టాచార్య పాకిస్తాన్‌కు మూడు సార్లు వెళ్లొచ్చాడనే స్టోరీని ఎవరూ కొనరు! వాళ్లకు కావాల్సింది కథనాలు అమ్ముడుపోవడం! అందుకే ఒకరిని మించి అబద్ధాలు ప్రసారం చేశారు.

కస్టడీలో మాపై శారీరకంగా ఎలాంటి హింస జరగలేదు. కానీ ఒకవేళ ఉమర్ మదర్సాలో చదువుకున్న వాడయి వుంటే, ఆజంగఢ్ వాసి అయి ఉంటే, ఒకవేళ మేమిద్దరం ఆజంగఢ్‌కు చెందిన వాళ్లం అయి ఉంటే మాతో స్పెషల్ సెల్ అధికారులు ఎలా వ్యవహరించే వాళ్లు? అప్పుడు మా పక్షాన ఎంత మంది నిలబడే వాళ్లు? ఇలా ప్రశ్నించుకుంటే ఆందోళన కలుగక తప్పదు. బహుశా మనందరం ఈ ప్రశ్నను ఎవరికి వాళ్లం వేసుకోవాలి. ఎందుకంటే రేపెప్పుడైనా ఆజంగఢ్‌కు చెందిన యువకుడిని పట్టుకెళ్లినా మనం ఈ ఐక్యతను ప్రదర్శించగలగాలి.

జాతీయవాదం, జాతివ్యతిరేకత గురించి ఇప్పటికే చాలా చర్చ జరిగింది. మేం రహస్యంగా ఉన్నప్పుడు, జైలులో ఉన్నప్పుడు దినపత్రికలు చదివేవాళ్లం, టీవీ చూసేవాళ్లం. కొన్ని విషయాలు చాలా బాధ కలిగించేవి. కొన్ని సార్లు నవ్వు కూడా వచ్చేది. ఎవరు జాతీయవాదం గురించి మాట్లాడుతున్నారు? ఎవరిని జాతివ్యతిరేకులని అంటున్నారు? బుందేల్‌ఖండ్ సహా దేశంలోని 50 శాతం ప్రాంతాల్లో తీవ్రమైన కరవు నెలకొంది. ఈ కరవుకాటకాల మధ్యే బుందేల్‌ఖండ్‌లో బడిపిల్లల మధ్యాహ్న భోజన పథకాన్ని బంద్ పెట్టించారు. చానల్ మారిస్తే అన్నింటికన్నా చౌకైన మొబైల్ ఫోన్ 251 రూపాయలకే ఇస్తామన్న వార్త వస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' అని అంటున్నారు కానీ ఇది తయారయ్యేది చైనాలోనట! దానికి త్రివర్ణ పతాకం లోగోను జోడించి చైనా వాటిని విడుదల చేస్తోంది. ఇదీ జాతీయవాదం అంటే! బుందేల్‌ఖండ్ పిల్లల కడుపులు మాడ్చి 251 రూపాయలకు మొబైల్ ఫోన్లు అందించడం జాతీయవాదమైతే బహుశా మేం జాతివ్యతిరేకులమే! మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో కరవు మూలంగా రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. వాళ్ల కుటుంబాలు ఆకలి మంటలతో అలమటిస్తున్నాయి. చానల్ మారిస్తే 'మేక్ ఇన్ ఇండియా' స్టేజిపై మంటలు వ్యాపించాయన్న వార్త కనిపిస్తుంది. కానీ ప్రభుత్వం ఈ మంటల గురించి మాత్రమే సిగ్గుపడుతోంది. మన దేశభక్తులు పేదల ఆకలి మంటలను సిగ్గు పడాల్సిన విషయంగా భావించడం లేదు. ఇదే జాతీయవాదానికి నిర్వచనమైతే బహుశా మేం జాతివిద్రోహులమే. మేం సరెండర్ అయిన రోజు రాత్రి ఒక ముస్లిం పోలీసు కానిస్టేబుల్‌ను బట్టలు చింపేసి నగ్నంగా రోడ్లపై ఊరేగించారని మహారాష్ట్ర నుంచి ఒక వార్త వచ్చింది. 'జై భవానీ' అనాలంటూ ఆయనపై దౌర్జన్యం చేశారు. కొందరు దీనిని జాతీయవాదమని అంటున్నారు. నలుగురు క్రిశ్చియన్ సన్యాసినులను రేప్ చేసినప్పుడు వీహెచ్‌పీ వాళ్లు 'భారత్ మాతా కీ జై' అని నినాదాలు చేసినట్టు మనం విని ఉన్నాం. కొంత మంది దృష్టిలో ఇదే జాతీయవాదం! రోహిత్ వేములపై జాతివ్యతిరేకి అనే ముద్ర వేసి, బూటకపు విచారణలు జరిపించి, మృత్యువు అంచుల్లోకి నెట్టేసి హత్య చేసిన సంఘటన కూడా జాతీయవాదం పేరుతోనే జరిగింది. తమిళనాడులో కులాంతర వివాహం చేసుకున్న దంపతులను పట్టుకొని పట్టపగలే హత్య చేసిన ఘోరం భారతీయ సంస్కృతి రక్షణ పేరుతోనే జరిగింది. ఇదంతా జాతీయవాదమే అయితే, మేమందరం జాతివ్యతిరేకులమే!

దేశంలో ఇప్పుడు ఓఎల్ఎక్స్ రాజ్యం నడుస్తోంది! అన్నీ అమ్మెయ్యండి! ఖనిజ సంపదను, విద్యను, భూముల్ని... ఆఖరుకు నిజాయితీని అమ్మెయ్యండి. ఎందుకంటే ఇక్కడ అన్నీ అమ్ముడుపోతాయి. ఈ ఓఎల్ఎక్స్ రాజ్యం జాతీయవాదమైతే మేమంతా జాతి

వ్యతిరేకులమే. వాడేసిన కండోమ్‌లను లెక్కబెట్టడం, గుర్రాన్ని చితకబాదికాలు విరగ్గొట్టడం జాతీయవాదమైతే మేమందరం జాతి వ్యతిరేకులమే. మిత్రులారా! ఈ దేశంలో కొంత మంది తమ దేశభక్తిని 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాదంతో చాటుకుంటారు. మరి కొందరు 'జై భీం' అంటారు. మరి కొందరు 'జై హింద్' అంటూ తమ దేశభక్తిని వెల్లడి చేస్తారు. కానీ కేవలం 'భారత్ మాతా కీ జై' అంటేనే దేశభక్తి, మిగతావన్నీ కాదని అంటే మేమొప్పుకోం.

దేశంలో జరుగుతున్న సంఘటనలపై రక్తం మరిగిపోతోందని అని మీడియాలో పదే పదే గగ్గోలు పెడుతున్నారు. అయితే వారికి మాదో ప్రశ్న. మీ రక్తం ఎప్పుడు మరుగుతుంది, ఎప్పుడు మరుగదు అనే విషయాల్ని నిర్ణయించేదెవ్వరు? గుజరాత్‌లో, హాషింపురాలో, ముజఫర్‌నగర్‌లో ముస్లింలను ఊచకోత కోసినప్పుడు మీ రక్తం మరగలేదెందుకు? శంకర్‌బిఘహాలో, బథానీటోలలో, చుండూరులో దళితులను ఊచకోత కేసినప్పుడు మీ రక్తం ఎందుకు మరగలేదు? సార్కిన్‌గూడ, ఎడస్‌మెట్టలో చీకటి వేళ 30–35 మంది ఆదివాసులను చుట్టుముట్టి కాల్చి చంపేస్తే మీ రక్తం మరగకపోవడానికి కారణమేమిటి? కునాన్ పాష్‌పోరా సంఘటనలు జరిగినప్పుడు గానీ, ఇంఫాల్‌లో మహిళలు వివస్త్రలుగా మారి 'భారతీయ సైనికులారా మమ్మల్ని రేప్ చేయండి' అనే బ్యానర్‌ను తమ దేహాలపై ఆచ్ఛాదనగా అడ్డం పెట్టుకున్నప్పుడు మీ రక్తం ఏ మాత్రం మరగలేదు కదా? పట్టపగలే కల్బుర్గిని, పన్సారేను, దాభోల్కర్‌ను, గంటి ప్రసాదాన్ని కాల్చి చంపేస్తే, కత్తులతో నరికేస్తే అప్పుడూ మీ రక్తం మరగలేదు. దేశంలో 77 శాతం మంది ప్రజలు రోజుకు 20 రూపాయలకన్నా తక్కువ ఆదాయంతో బతుకులీడుస్తుంటే మీ రక్తం ఏనాడూ మరగలేదు. మహిళలకు గౌరవంగా బతికే హక్కు సంగతి అటుంచి, వాళ్లను ఇండ్లలోనే ఉండిపొమ్మని ఆర్‌ఎస్‌ఎస్ మాట్లాడుతుంటే వీళ్ల రక్తం అస్సలుకే మరగదు! రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే,కార్మికులు కనీసం యూనియన్ కూడా పెట్టుకోలేకపోతుంటే వీళ్ల రక్తం మరుగదు. దేశభక్తులారా! అసలు మీ రక్తం మరిగే స్థానం ఎంత? ఎంత ఉష్ణోగ్రత కావాలో చెప్పండి!

జేఎన్‌యూ వాళ్లు రాజ్యాంగానికి వ్యతిరేకులనేది మీడియాలో జరిగిన మరో ప్రచారం. రాజ్యాంగం వైపు ఉన్న వాళ్లెవరు? రాజ్యాంగానికి వ్యతిరేకులెవరు? అనేవి క్లిష్టమైన ప్రశ్నలు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సోషలిజం, సార్వభౌమిక రిపబ్లిక్, లౌకికవాద రిపబ్లిక్ గురించి రాజ్యాంగం చెబుతుంది. హిందూత్వ పేరుతో నరమేధాలకు పాల్పడే వాళ్లు లౌకికవాదాన్ని పరిరక్షిస్తున్నారట! వాళ్లు రాజ్యాంగాన్ని కాపాడుతున్నారట! దేశంలోని ఖనిజ సంపదను విదేశాలకు

తెగనమ్మే వాళ్లు సార్వభౌమత్వం గురించి మాట్లాడుతున్నారు! కాషాయ ధ్వజధారులైన ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లే ప్రజాస్వామ్యానికి అతి పెద్ద శత్రువులని అంబేద్కర్ ఆనాడే గుర్తించగా, తాము రాజ్యాంగ సమర్థకులమని వాళ్లు మాట్లాడుతున్నారు. కేవలం పుస్తకాన్ని ముట్టుకొని ప్రమాణం చేస్తే దానికి కట్టుబడి ఉన్నట్టు కాదు.

రాజ్యాంగంలో ఉన్న లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సార్వభౌమత్వం, సోషలిజం, రిపబ్లిక్... ఇవన్నీ ఉత్త మాటలు కాదు, భావాలు! ఈ భావాల కోసం మనం పోరాడి తీరాలి. ప్రజాస్వామ్యం కోసం, లౌకికవాదాన్ని పటిష్టం చేయడం కోసం, సోషలిజం సాధన కోసం, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడడం కోసం మనం పోరాడుతున్నాం. ఆదివాసుల, దళితుల, మైనారిటీల, కార్మికుల, రైతుల, దేశంలోని పీడిత ప్రజలందరి మౌలిక రాజ్యాంగ హక్కుల కోసం మనమే పోరాడుతున్నాం. అయితే, రాజ్యాంగాన్ని ప్రవేశపెడుతూ అంబేద్కర్ పార్లమెంటు భవనంలో చెప్పినట్టుగా, మనమొక వైరుధ్యాల శకంలోకి ప్రవేశించాం. పుస్తకాల్లో పేర్కొన్న చట్టాల ప్రకారం అందరికీ రాజకీయ సమానత్వం ఉంది. కానీ సమాజంలో మాత్రం అది లేదు. ఈ వైరుధ్యాలున్నంత కాలం పోరాటం కొనసాగించాల్సి ఉంటుంది. మనం చేసేది ఆ పోరాటమే. మనం ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్నాం. మార్క్సిస్టులుగా కేవలం రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల కోసం మాత్రమే కాదు, దాని పరిధిని దాటి కూడా మనం పోరాడుతున్నాం. ఎందుకంటే మార్క్సిస్టులుగా గెలిచేందుకు ఈ ప్రపంచం ఉందని మనం విశ్వసిస్తాం. కాబట్టి కేవలం పుస్తకంపై చేయి పెట్టి ప్రమాణం చేసినంత మాత్రాన కాషాయ దళం వారు రాజ్యాంగానికి బద్ధులై ఉన్నట్టు కాదు.

జేఎన్‌యూపై దాడి జరిగింది ఎందుకంటే మనం ఈ హక్కులన్నింటి గురించి మాట్లాడతాం కాబట్టి. మనం ఆలోచిస్తాం... మనం గొంతెత్తుతాం... మనం మార్పు గురించి మాట్లాడతాం... మెరుగైన సమాజం కావాలంటాం... అందుకే మనపై దాడి జరిగింది. జేఎన్‌యూలో మనం మొట్టమొదట నేర్చుకునే మౌలిక విషయం ప్రశ్నించడం. మనం విభేదాల్ని కలిగి ఉండటాన్ని నేర్చుకుంటాం. విభేదించడం నేర్చుకుంటాం. విమర్శనాత్మకతను నేర్చుకుంటాం. మనలో మనం చాలా ఘర్షణ పడతాం. మీడియా వాళ్లు మన ప్రెసిడెన్షియల్ డిబేట్‌కు వస్తే తెలుస్తుంది. ఇక్కడ పరస్పరం భుజం కలిపి నడుస్తున్న వాళ్లం ఎలా ఘర్షణ పడతామో కనిపిస్తుంది. మనం పరస్పరం చాలా తీవ్రంగా విభేదిస్తాం. అయితే ఇలా విభేదించడాన్ని సహించమని ఎవరైనా అంటే మాత్రం మనమంతా ఒక్కటిగా నిలబడతాం. 9 ఫిబ్రవరి తర్వాత పాలకులు ఇలాంటి దుస్సాహసానికే పాల్పడ్డారు.

మనం ఈ విమర్శనాత్మకతను మన అధ్యాపకుల నుంచి, తోటి విద్యార్థుల నుంచి, సమాజం నుంచి నేర్చుకున్నాం. ఈ విమర్శనాత్మకతే మమ్మల్ని మీ యంత్రంలో విడిభాగాలుగా మారిపోకుండా నిరోధిస్తుంది. మీ గోడల్లో ఇటుకల్లో మారకుండా, మీ కల్లబల్లి మాటలకు మోసపోకుండా కాపాడుతుంది. ఈ విమర్శనాత్మకతే మమ్మల్ని యదాతథ స్థితిని బద్దలు కొట్టే చైతన్యమూర్తులుగా మలుస్తుంది ఇదే మనకు మెరుగైన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించడాన్ని నేర్పిస్తుంది.

ఈ విమర్శనాత్మకత వల్లనే ఈ విశ్వవిద్యాలయం ఒక వినూత్నమైన, విలక్షణమైన, సమ్మిళితత్వ ప్రవేశ విధానాన్ని కలిగి ఉంది దేశంలోని అత్యంత వెనుకబడ్డ ప్రాంతాల నుంచి, సముదాయాల నుంచి విద్యార్థులు రాగలుగుతున్నారంటే దీనికి కారణం ఈ విధానమే ఇది మనం పోరాడి సాధించుకున్న విధానం ప్రభుత్వం దయతో ఇచ్చింది కాదు ఇక్కడి విద్యార్థులం, అధ్యాకులం కలిసి నిర్ణయించిన విధానం ఇది ఇక్కడ ఫీజులు తక్కువ. అందుకే ఇక్కడికి పేద, దళిత, ఆదివాసీ విద్యార్థినీవిద్యార్థులు రాగలుగుతున్నారు మహిళలకు ఇక్కడ ప్రవేశానికి అదనపు పాయింట్లు ఉంటాయి అందుకే ఇక్కడి విద్యార్థులలో 60 శాతం మహిళలున్నారు. వాళ్లు రాత్రి 3 గంటలకు కూడా ఇక్కడి రోడ్లపై తిరుగుతారు, చర్చిస్తారు వీరిని మీరు జాతి వ్యతిరేకులంటారా? విమర్శనాత్మకతతో మేం సాధించిన విజయాలను మీరు జాతి వ్యతిరేకత అంటారా? ఈ విమర్శనాత్మకత వల్లనే మేం ఎమర్జెన్సీ నాటి నుంచి 16 డిసెంబర్ (నిర్భయ సంఘటన) దాకా మేం న్యాయం కోసం పోరాడాం, పోరాడుతున్నాం కాశ్మీర్ నుంచి పాలస్తీనా దాకా అన్ని అంశాలపై మాట్లాడుతున్నాం స్వయంనిర్ణయాధికార హక్కు గురించి మాట్లాడుతున్నాం. దీని వల్లనే మేం రోహిత్ హత్యను వ్యతిరేకించాం. ఖైర్లాంజీకి, బథానీటోలకు వ్యతిరేకంగా నిలబడ్డారు. ఈ విమర్శనాత్మకత వల్లనే మేం పాలకుల ముఖం మీదే నిజాలు మాట్లాడడానికి భయపడం. దీన్ని మేం కొనసాగిస్తాం.

ఇది కేవలం జేఎన్‌యూకు సంబంధించిన విషయం కాదని మనందరికీ తెలిసిందే ఈరోజు పార్లమెంటులో విపక్ష నేతలకు సైతం విద్యార్థులం వివిధ అంశాలను అందిస్తున్నాం రోహిత్ వేముల, జేఎన్‌యూ, ఎఫ్‌టీఐఐ, అలహాబాద్, జాదవ్‌పూర్... విద్యార్థులమే నిజమైన ప్రతిపక్షంగా ఉన్నాం నేడు. ఇది విద్యార్థి వసంతమని నేనంటాను! మనందరం ఇలాగే అనాలి ఇది దేశవ్యాప్తంగా వ్యాపిస్తోంది. ఈరోజు దళిత, ఆదివాసీ, మైనారిటీ, పీడిత జాతుల, కార్మిక, కర్షకుల పక్షాన నిలబడింది విద్యార్థి శక్తి. అధికారానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా నిలబడింది

విద్యార్థి శక్తి ఈ గొంతుకల్ని గుర్తు పట్టండి. ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా, ఒ పి శర్మ విక్రం చౌహాన్‌లకు వ్యతిరేకంగా, అర్నాబ్ గోస్వామికి వ్యతిరేకంగా, జీ (ఛీ) న్యూస్‌కు వ్యతిరేకంగా, దీపక్ చౌరాసియాకు వ్యతిరేకంగా, బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా, రోహిత్ హత్యకు వ్యతిరేకంగా జేఎన్‌యూ నిలబడింది జేఎన్‌యూ ఒంటరిగా లేదని కూడా మీ అందరికీ తెలుసు! రోహిత్ వేముల మనకు తన జీవితంలోనే కాదు, మరణంలో కూడా నేర్పి వెళ్లిన పోరాటాన్ని మనం కొనసాగిస్తున్నాం ఏ కారణాల వల్ల రోహిత్‌ను జాతివ్యతిరేకి అని అన్నారో, అవే కారణాలతో జేఎన్‌యూను కూడా నిందిస్తే మనం పోరాటం ద్వారా ఐక్యంగా ఎదుర్కొన్నాం 'స్టాండ్ విత్ జేఎన్‌యూ', 'జస్టిస్ ఫర్ రోహిత్' రెండు నినాదాలు ఒక్కటిగా ప్రతిధ్వనించాయి ఇది మన ఐక్యతకున్న శక్తి ఇది కొనసాగుతుంది!

ACC No. ..................

కన్నయ్య కుమార్ ఓ పరిణతి చెందిన విద్యార్థి నేత. సమాజంలో కొనసాగుతున్న వివక్షలు, అణచివేతలు, దోపిడీల గురించి అవగాహన ఉన్న వ్యక్తి. మతోన్మాద, సామ్రాజ్యవాద ప్రమాదాల గురించి స్పష్టంగా తెలిసిన వ్యక్తి. ఆయన పుట్టి పెరిగిన వాతావరణంతో పాటు, బహుళ అభిప్రాయాలకు తావుకల్పిస్తూ, పురోగామి భావజాలానికి నెలవుగా ఉన్న న్యూఢిల్లీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం కన్నయ్య కుమార్ మేధోపరిణామానికి తోడ్పడింది. ఇదే భావజాలంతో ఉన్న ఇతర విద్యార్థి సహచరులతో పాటు కన్నయ్య కుమార్ కార్యకలాపాలు మతోన్మాదులకు, ఇతర ప్రతీప శక్తులకు కంటగింపుగా ఉండటం ఎంత మాత్రం ఆశ్చర్యం కల్గించదు. రెచ్చిపోయిన మతోన్మాద మూకలు కన్నయ్య కుమార్‌పై పదే పదే దాడులకు పాల్పడుతున్నారు. దేశంలోనే కాకుండా, అంతర్జాతీయంగా సైతం ప్రజాస్వామికవాదుల, ప్రగతిశీలుర మద్దతును పొందుతూ, మతోన్మాదుల, ఇతర అభివృద్ధి నిరోధకుల ఆగ్రహానికి ఇంతగా కారణమవుతున్న ఈ విద్యార్థి నేతల ప్రసంగాలు, చర్చాగోష్ఠులు, ఇంటర్వ్యూల సంకలనం ఇది.

నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్